
'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 సంచిక: 314

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

SUNDAY Special   ఆదివారం   4-2-2024



బుమ్రా కూల్చేశాడు...

6 వికెట్లతో హడలెత్తించిన భారత పేసర్. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 253 ఆలౌట్. భారత్ ఓవరాల్ ఆధిక్యం 171 పరుగులు. వైజాగ్ టెస్టుపై పట్టుబిగించిన టీమిండియా.

- వివరాలు 12లో



దేశాల సమన్వయంతోనే న్యాయ వితరణ

నేరగాళ్లు సాంకేతికతను దుర్వినియోగం చేస్తున్న వేళ దేశాలు సైతం సత్వర న్యాయ వితరణ కోసం సహకరించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.

- వివరాలు 6లో



ఇమ్రాన్, ఆయన భార్యకు ఏడేళ్ల జైలు

ఇస్లామ్ నిబంధనలకు విరుద్ధంగా పెళ్లి చేసుకున్న ఆరోపణలపై పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌కు, ఆయన భార్య బుష్రా బీబీ(49)కి ఓ కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది.

- వివరాలు 6లో



యూరప్‌లోనూ రోడ్డెక్కిన రైతు

సాగు గిట్టుబాటు కావడం లేదంటూ యూరప్‌లో రైతులు పెద్ద ఎత్తున ఆందోళన బాట పట్టారు. రైతుల నిరసనలు, ఆందోళనలతో కొద్ది వారాలుగా యూరప్ దేశాలన్నీ ఉక్కిరిబిక్కిరవుతున్నాయి.

- వివరాలు 6లో



అడ్వాణీకి భారతరత్న

బీజేపీ కురువృద్ధునికి అత్యున్నత పౌర పురస్కారం

శిఖర సమానుడికి సముచిత గౌరవం: మోదీ

తనకివి అత్యంత భావోద్వేగ క్షణాలన్న ప్రధాని

కేంద్ర మంత్రులు తదితరుల అభినందనలు

అత్యంత వినమ్రంగా స్వీకరిస్తున్నా..

నా ఆశయాలకు, సిద్ధాంతాలకు దక్కిన గౌరవం : అడ్వాణీ



శనివారం ఢిల్లీలోని తన నివాసంలో అడ్వాణీ

న్యూఢిల్లీ: రాజకీయ కురు వృద్ధుడు, బీజేపీ అగ్ర నేత లాల్‌కృష్ణ అడ్వాణీ (96)కి కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఎక్స్‌లో ఈ మేరకు పోస్ట్ చేశారు. ఆ వెంటనే రాష్ట్రపతి భవన్ నుంచి ఈ మేరకు ప్రకటన వెలువడింది. అయోధ్యలో రామాలయం నిర్మాణం కోసం 1990లో దేశవ్యాప్త రథయాత్రతో బీజేపీకి ఊపు తెచ్చి అధికార సాధనకు బాటలు పరిచిన అడ్వాణీని, రామాలయ ప్రారంభోత్సవం జరిగిన కొద్ది రోజులకే భారతరత్న వరించడం విశేషం. అడ్వాణీకి ఈ సందర్భంగా మోదీ అభినందనలు

మిగతా 6వ పేజీలో ▶

గమ్యం చేరని రథ యాత్రికుడు 6లో





ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో శనివారం వైఎస్సార్‌సీపీ నిర్వహించిన 'సిద్ధం' బహిరంగ సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం. (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

- వివరాలు 5లో

న్యూస్‌రీల్

ఆర్థిక వనరులు పెంచుకోవడం ఎలా?



ప్రముఖ ఆర్థికవేత్త మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలకు అవసరమైన నిధుల సమీకరణ, అలాగే ప్రజలపై భారం పడకుండా ఏవిధంగా ఆర్థిక వనరులు పెంచుకోవాలన్న అంశంపై చర్చించారు.

- వివరాలు 2లో▶

17 సీట్లు.. 306 దరఖాస్తులు



అధికార కాంగ్రెస్‌లో లోక్‌సభ టికెట్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. టికెట్ల కోసం టీపీసీసీ దరఖాస్తులను ఆహ్వానించగా గడువు ముగిసే సమయానికి 306 దరఖాస్తులు వచ్చినట్లు గాంధీ భవన్ వర్గాలు వెల్లడించాయి.

- వివరాలు 5లో▶

75 గజాల్లోపు ఉన్నా ప్రారంభ అనుమతి తప్పనిసరి



రాష్ట్రంలో 75 చదరపు గజాల కంటే తక్కువ విస్తీర్ణం ప్లాట్‌లో ఎలాంటి నిర్మాణాన్ని చేపట్టాలనుకున్నా.. భవన యజమానులు మున్సిపాలిటీ లేదా కార్పొరేషన్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని పొందడం తప్పనిసరి అని హైకోర్టు స్పష్టం చేసింది.

- వివరాలు 14లో▶

'మేనేజ్' చేస్తున్నారా..?

- ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్డగోలు దోపిడీపై నివేదిక కోరిన ముఖ్యమంత్రి..
- మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీపై ఆరా!
- సమగ్ర వివరాలివ్వమని వీసీలకు ఆదేశాలు

14లో

ఇదండీ సంగతి



కదలి వచ్చేది ప్రజలు కాదాసార్! ఆటో డ్రైవర్లు!

టీచర్లు సిటీకి.. చదువులు గాలికి!



గ్రామాల్లో పనిచేయాల్సిన టీచర్లు పట్టణ ప్రాంతాలకు డిప్యుటేషన్

ఊర్లలో పనిచేయడం ఇష్టం లేక కొందరు.. అనారోగ్య, ఇతర కారణాలతో మరికొందరు

డీఈఓలతో బేరసారాలు.. కోరిన పాఠశాలకు డిప్యుటేషన్

ఒక్కొక్కరి నుంచి రూ. 3 లక్షల వరకు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు

గ్రేటర్ హైదరాబాద్, పరిసర ప్రాంతాలకు బాగా డిమాండ్

గ్రామాల్లోని బడుల్లో ఉపాధ్యాయుల కొరతతో పిల్లలకు సరిగా అందని బోధన

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్, శివారు ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో కొన్నిరోజులుగా కొత్త టీచర్లు కొలువుదీరుతున్నారు. ఉపాధ్యాయుల బదిలీలేమీ లేకున్నా.. కొత్త నియామకాలేవీ జరగకున్నా.. కొత్త టీచర్లు వస్తుండటంపై తోటి టీచర్లు ఆశ్చర్యపోతున్నారు. ఈ కొత్త టీచర్లంతా రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లోని గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో పనిచేయాల్సిన వారు. కానీ డిప్యుటేషన్లపై పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలలకు వచ్చి తిష్టవేస్తున్నారు. తమకు పోస్టింగ్ ఇచ్చిన గ్రామీణ పాఠశాలలో పనిచేయడం ఇష్టం లేకనో, మరేదైనా కారణాలతోనో.. జిల్లా విద్యాశాఖ అధికారులు (డీఈఓలు), పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలోని అధికారులు, రాజకీయ నేతల సహకారంతో ఇలా పట్టణ ప్రాంత బడుల్లోకి మారుతున్నారు. ఈ జిల్లాల పరిధిలో వంద మందికిపైగా టీచర్లు ఇలా డిప్యుటేషన్లపై ఇతర చోట్లకు వెళ్లినట్టు అంచనా. దీంతో ఇప్పటికే ఉపాధ్యాయుల కొరతతో సతమతం అవుతున్న గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో బోధనకు మరింతగా ఇబ్బంది ఎదురవుతోంది.

రూ.3 లక్షల దాకా ముట్టజెప్పి..

కోరిన చోటికి డిప్యూటేషన్‌పై వెళ్లేందుకు కొందరు టీచర్లు.. స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలతో పైరవీలు చేయించుకుంటున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు విద్యాశాఖ అధికారులను ఆశ్రయించి డిప్యుటేషన్ పొందుతున్నారు. ఈ క్రమంలో ఒక్కో టీచర్ రూ.3 లక్షల వరకు ముట్టజెప్పున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు డీఈఓలు అందినకాడికి వసూలు చేసి, ఇలా డిప్యుటేషన్లు ఇస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ లోపల, శివార్లలోని దగ్గరి ప్రాంతాల స్కూళ్లకు వెళ్లేందుకు అంతకంటే ఎక్కువే చేతులు

మిగతా 2వ పేజీలో ▶

క్షేత్రస్థాయి పరిశీలనకు కమిటీ

'ధరణి' పోర్టల్ పునర్నిర్మాణం, మార్పుచేర్పులపై పూర్తికావొచ్చిన సంప్రదింపులు

తాజాగా సర్వే సెటిల్‌మెంట్, దేవాదాయ అధికారులతో భేటీ

- రేపు రిజిస్ట్రేషన్ల శాఖతో భేటీ.. ఆ తర్వాత రంగారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్ లేదా ఖమ్మంకు..
- ఈ పర్యటనలయ్యాక వారంలో ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక ఇవ్వాలని నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ పునర్నిర్మాణం కోసం ఏర్పాటైన కమిటీ తమ పరిశీలనను వేగవంతం చేసింది. ఇప్పటికే భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయంతోపాటు పోర్టల్ నిర్వహణ కంపెనీ ప్రతినిధులు, ఐదు జిల్లాల కలెక్టర్లతో సంప్రదింపులు జరిపిన కమిటీ.. శనివారం సర్వే సెటిల్‌మెంట్, దేవాదాయశాఖ, వక్ఫ్ బోర్డులకు చెందిన ఉన్నతాధికారులతో భేటీ అయింది. ఆయా విభాగాల పరిధిలో ధరణి పోర్టల్ ద్వారా ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి మార్గాలు, ప్రత్యామ్నాయాలపై చర్చించింది. సోమవారం సచివాలయంలో స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖతో సమావేశం కావాలని, ఆ తర్వాత జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని కమిటీ నిర్ణయించింది.

ఇందుకోసం రాష్ట్రంలోని మూడు జిల్లాలను కమిటీ ఎంపిక చేసుకున్నట్టు సమాచారం. రంగారెడ్డి, నిజామాబాద్‌తోపాటు ఆదిలాబాద్ లేదా ఖమ్మంలో 'ధరణి' సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించనున్నట్టు తెలిసింది. ఈ పర్యటనలు పూర్తయ్యాక అన్ని అంశాలను క్రోడీకరించి, ధరణి పోర్టల్ వాస్తవ పరిస్థితిని తెలియజేస్తూ.. ప్రభుత్వానికి నివేదిక

మిగతా 2వ పేజీలో ▶

మహారాష్ట్రలో బీజేపీ ఎమ్మెల్యే బుల్లెట్ల వర్షం

- మహారాష్ట్రలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో శివసేన నేత మహేశ్ గైక్వాడ్‌పై బీజేపీ ఎమ్మెల్యే గణ్‌పత్ గైక్వాడ్ కాల్పులు జరిపాడు. పదేళ్ల క్రితం తాను కొనుగోలు చేసిన భూమిని కబ్జా చేయడమే కాకుండా తన కుమారుడిపై దాడి చేసినందునే కాల్పులు జరిపినట్లు ఎమ్మెల్యే గణ్‌పత్ అంగీకరించాడు. పోలీసులు ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకొని.. విచారణ జరుపుతున్నారు. -6లో

టీఎస్‌కు బదులు 'టీజీ'!

వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్‌లో రాష్ట్ర కోడ్‌ను మార్చాలని సర్కారు నిర్ణయం

ఉద్యమకాలంలో తెలంగాణకు సంక్షిప్త రూపంగా వాడిన అక్షరాలు ఇప్పుడు అమల్లోకి..

నేడు సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగే కేబినెట్ భేటీలో ప్రకటించే చాన్స్

2లో

- కొత్తగా మరో 64 పోస్టులతో గ్రూప్-1 అనుబంధ నోటిఫికేషన్
- గతంలో గవర్నర్ నిలిపేసిన బిల్లులను మళ్లీ పరిశీలనకు పంపేందుకు ఏర్పాట్లు
- వివిధ శాఖలు, విభాగాల్లో కొనసాగుతున్న 1,049 మంది రిటైర్డ్ అధికారులపైనా చర్చ
- కులగణన బిల్లు, బడ్జెట్ సమావేశాలు సహా చర్చకు రానున్న 20కిపైగా అంశాలు

ప్రాజెక్టుల అప్పగింతపై ఉద్యమం

పార్టీ నేతలతో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

ప్రజాతీర్పును గౌరవిద్దాం.. ప్రతిపక్ష పాత్ర సమర్థంగా పోషిద్దాం

ముఖ్యనేతలతో భేటీ అయ్యి కార్యాచరణ రూపొందిద్దాం

కేఆర్‌ఎంబీకి ప్రాజెక్టులిస్తే రాష్ట్ర హక్కులు కోల్పోతాం



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌ను ప్రతిపక్షంలో కూర్చోబెట్టి కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని, ప్రజా తీర్పును గౌరవిస్తూ ప్రతిపక్ష పాత్రలో సమర్థంగా పని చేద్దామని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. రాష్ట్ర హక్కులను తీవ్రంగా దెబ్బతీసే ప్రాజెక్టుల అప్పగింతపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వమే ప్రాజెక్టుల అప్పగింతకు ఒప్పుకున్నట్టుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అసలు నిజాలేంటో పార్టీ నేతలు ప్రజలకు వివరించాలని సూచించారు. 2014 జూన్2 నుంచి 2023 డిసెంబర్ 3వ తేదీ వరకు తెలంగాణ హక్కుల పరిరక్షణకు బీఆర్‌ఎస్ఎలా పని చేసిందీ, కృష్ణా జలాల్లో హక్కుల రక్షణకు ఎంతగా శ్రమించిందీ సాక్ష్యాధారాలతో సహా ప్రజలకు తెలియజేద్దామని అన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల పరిరక్షణకు ఉద్యమ కార్యాచరణ రూపొందించాల్సి ఉందన్నారు. ఈ అంశంపై రెండు, మూడురోజుల్లోనే ముఖ్య నేతలతో

మిగతా 3వ పేజీలో ▶



భవ్య, వైష్ణవి (ఫైల్)

ఇద్దరు టెన్త్ విద్యార్థినుల ఆత్మహత్య

హాస్టల్ గదిలో ఉరేసుకున్న స్నేహితులు

- తమను వేధిస్తున్నారంటూ వారిపై ఫిర్యాదు చేసిన 7వ తరగతి విద్యార్థినులు
- వార్డెన్ తల్లిదండ్రులకు చెప్పడంతో భయాందోళన
- ఒకేదగ్గర సమాధి చేయాలంటూ సూసైడ్ నోట్
- యాదాద్రి భువనగిరి జిల్లాలో విషాదం

5లో

క్లుప్తంగా...

షబ్బీర్ అలీ బాధ్యతల స్వీకారం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ)గా మాజీ మంత్రి షబ్బీర్ అలీ శనివారం తెలంగాణ సచివాలయంలోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సలహాదారుగా సమర్థంగా పని చేస్తానన్నారు. ఈ అవకాశం ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు షబ్బీర్ అలీని అభినందించారు.

షబ్బీర్‌అలీని కలిసిన బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ)గా బాధ్యతలు స్వీకరించిన షబ్బీర్ అలీని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ శనివారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీని శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు.

పరిష్కార బాధ్యత మాదే

మైనారిటీల సమస్యలపై సీఎం రేవంత్

సాక్షి,హైదరాబాద్: రాష్ట్రంలో మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే పూర్తి బాధ్యత తమదేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీనిచ్చారు. శనివారం సచివాలయంలో సీఎం రేవంత్‌తో మైనారిటీ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మైనారిటీలకు 4% రిజర్వేషన్ అమలు జరిగేలా చూడాలని సీఎంకు వారు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో వక్ఫ్ భూములను కాపాడటంతో పాటు మైనారిటీ పాఠశాలల అభివృద్ధికి తగిన బడ్జెట్ కేటాయించాలని కోరారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారు. సీఎం రేవంత్ ఇచ్చిన హామీ పట్ల మైనారిటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్‌రెడ్డి, వివిధ జిల్లాల మైనారిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

త్వరలో కాంగ్రెస్ 'దళితులారా మేల్కొనండి యాత్ర'

సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు దళితులపై లెక్కలేనన్ని దాడులు జరిగాయని కాంగ్రెస్ పార్టీ మాదిగ రిజర్వేషన్ల పోరాట సమితి అధ్యక్షుడు బొట్ల మహర్షి ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్‌లాంటి ఘటనలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఓటమే లక్ష్యంగా త్వరలో 'దళితులారా మేల్కొనండి యాత్ర' నిర్వహించనున్నట్లు తెలిపారు. పదేళ్లలో బీజేపీ దళితులపై చేసిన దాడులు, అఘాయిత్యాలపైన దళితులకు వివరించడమే ఈ యాత్ర ఉద్దేశమని మహర్షి పేర్కొన్నారు.

ఎంపీ సీటు ఆశిస్తున్నాననే బద్నాం

మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి ఆరోపణ



జనగామ: బీఆర్‌ఎస్ నుంచి మల్కాజిగిరి ఎంపీ టికెట్ ఆశిస్తున్నాననే ఉద్దేశంతో పార్టీలోని కొందరు తనను బదనాం చేసేందుకు కుట్రలకు తెర లేపుతున్నారని జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆరోపించారు. జనగామలోని తన స్వగృహంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో విజయం సాధించే సీట్లలో టాప్-10లో జనగామ ఉందని స్వయంగా అధినేత కేసీఆర్ చెప్పారన్నారు. తమ్ముడు పల్లాకు అవకాశం ఇస్తే ఎంపీ సీటు ఇస్తామని ఆనాడే చెప్పారని తెలిపారు. భువనగిరి ఎంపీ టికెట్ ఆశిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. తాను మల్కాజిగిరి ఎంపీ టికెట్ ఆశిస్తున్నట్లు కేసీఆర్‌కు తెలుసని వెల్లడించారు. తనపై కుట్రలకు తెరలేపిన వ్యక్తులు ఎవరో కూడా కేసీఆర్‌కు తెలుసని ముత్తిరెడ్డి పేర్కొన్నారు.

అద్వాణీ ప్రజాజీవితం మార్గదర్శనీయం

భారతరత్న ప్రకటనపై దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్ అభినందనలు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వాణీ దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నకు ఎంపిక కావడం పట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ వేర్వేరు ప్రకటనల్లో అభినందనలు తెలియజేశారు. దేశ రాజకీయ దృశ్యానికి రూపురేఖలు ఇవ్వడంలో అద్వాణీ కీలకపాత్ర పోషించారని, దేశానికి ఆయన సుదీర్ఘకాలం అందించిన సేవలకు ఈ పురస్కారం చక్కని గుర్తింపని దత్తాత్రేయ కొనియాడారు. పారదర్శకత, సమగ్రతతో పాటుగా విలువలను పాటిస్తూ దశాబ్దాల పాటు కొనసాగిన వారి ప్రజాజీవితం మార్గదర్శనీయమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అద్వాణీకి భారతరత్న ప్రకటించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలియజేశారు. దేశ అత్యున్నత పురస్కారానికి అద్వాణీని ఎంపిక చేయడం ఎంతో హర్షణీయమని డా.కె.లక్ష్మణ్ తెలిపారు.



చిరంజీవిని అభినందిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రామ్‌చరణ్, ఉపాసన, సురేఖ, దిల్‌రాజు తదితరులు

చిరంజీవికి సీఎం అభినందనలు

సాక్షి హైదరాబాద్: ప్రముఖ సినీ నటుడు చిరంజీవిని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తనకు పద్మవిభూషణ్ అవార్డు ప్రకటించిన సందర్భంగా చిరంజీవి ఏర్పాటు చేసిన విందులో సీఎం పాల్గొన్నారు. చిరంజీవికి అవార్డు రావడం మనందరికీ గర్వకారణమని అన్నారు.

టీఎస్‌కు బదులు 'టీజీ'!

వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్‌లో రాష్ట్ర కోడ్‌ను మార్చాలని సర్కారు నిర్ణయం

- ఉద్యమకాలంలో తెలంగాణకు సంక్షిప్తరూపంగా వాడిన అక్షరాలు ఇప్పుడు అమల్లోకి..
- నేడు సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగే కేబినెట్ భేటీలో ప్రకటించే చాన్స్
- కులగణన బిల్లు, బడ్జెట్ సమావేశాలు సహా చర్చకు రానున్న 20కిపైగా అంశాలు



సాక్షి, హైదరాబాద్: వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్‌లో తెలంగాణ రాష్ట్ర కోడ్‌ను తెలిపే 'టీఎస్'కు బదులుగా 'టీజీ'ని ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఉద్యమకాలంలో తెలంగాణను సంక్షిప్తరూపంలో 'టీజీ'గా పరిగణించేవారని.. ఈ క్రమంలోనే కోడ్‌ను 'టీజీ'గా మార్చేందుకు కాంగ్రెస్ సర్కారు సిద్ధమైందని ప్రభుత్వవర్గాలు చెప్తున్నాయి. ఇందుకోసం రాష్ట్ర మోటారు వాహనాల రిజిస్ట్రేషన్ చట్టానికి సవరణలు చేయాల్సి ఉంటుందని పేర్కొంటున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం మధ్యాహ్నం సచివాలయంలో జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం. దీనితోపాటు మరో 20 ప్రధాన అంశాలను కేబినెట్ చర్చించనున్నట్టు తెలిసింది.

గ్రూప్-1 పోస్టులు పెంపు

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న మరో 64 గ్రూప్–1 పోస్టులను టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీచేసే అంశంపై కేబినెట్ చర్చించనుంది. ఇప్పటికే టీఎస్‌పీఎస్సీ ద్వారా 503 గ్రూప్–1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో.. ఈ అదనపు పోస్టుల భర్తీకి అనుబంధ నోటిఫికేషన్ జారీచేసే అవకాశాలు ఉన్నాయి. ఇక వివిధ శాఖలు/విభాగాల్లో పదవీ విరమణ తర్వాత కూడా కొనసాగుతున్న 1,049 మంది ప్రభుత్వ అధికారుల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది.

'బడ్జెట్' తేదీల ఖరారు

శాసనసభ బడ్జెట్ సమావేశాలను ప్రారంభించే తేదీని కేబినెట్ ఖరారు చేయనుంది. సమావేశాల తొలిరోజున గవర్నర్ తమిళిసై చేయనున్న ప్రసంగాన్ని ఆమోదించనుంది. 8 నుంచి బడ్జెట్ సమావేశాలను ప్రారంభించాలని ప్రభుత్వంయోచి స్తోంది. 9న బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. జీఎస్టీ చట్ట సవరణ, పీఆర్ చట్ట సవరణ, సిటీ సివిల్ కోడ్ చట్ట సవరణ బిల్లులకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనుంది. ధరణిపై అధ్యయన కమిటీ సమర్పించిన మధ్యంతర నివేదికపై కూడా సమీక్షించి తదుపరి కార్యాచరణను ఖరారు చేయనుంది. రాష్ట్ర గవర్నర్ గతంలో నిలిపివేసిన బిల్లులను తిరిగి పరిశీలన కోసం పంపాలన్న అంశంపై చర్చించి నిర్ణయం తీసుకోనుంది.

కులగణనపై చర్చ..

రాష్ట్రంలో చేపట్టనున్న కులగణనకు చట్టబద్ధత కల్పించేందుకు వీలుగా శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టే అంశంపై మంత్రివర్గం చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. బడ్జెట్ కేటాయింపుల కోసం వివిధ శాఖల మంత్రులు చేసిన ప్రతిపాదనలను పరిశీలించనున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో భాగమైన రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ హామీలను అమల్లోకి తెచ్చే అంశంపై చర్చించనున్నారు. ఈ రెండు పథకాలను ఎప్పుడు ప్రారంభించాలి, ఏ మేర ఆర్థిక భారం పడుతుందన్నది పరిశీలించనున్నారు. ఇందిరమ్మ ఇళ్లపైనా చర్చించే అవకాశం ఉందని తెలిసింది.

ఏ రాష్ట్రమో తెలిపే 'కోడ్' అది..

వాహనాల నంబర్ ప్లేట్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ)లలో వాహనం ఏ రాష్ట్రంలో రిజిస్టర్ అయిందో తెలియజేసేలా కోడ్ ఉంటుంది. తెలంగాణ ఏర్పాటై, బీఆర్‌ఎస్ (టీఆర్‌ఎస్) ప్రభుత్వం ఏర్పాటు చేశాక.. వాహనాల నంబర్‌లో రాష్ట్ర కోడ్‌గా 'టీఎస్' అనే అక్షరాలను పొందుపర్చాలని నిర్ణయించింది. అప్పటి టీఆర్‌ఎస్ పార్టీ పేరును పోలినట్టుగా 'టీఎస్' అనే అక్షరాలను కోడ్‌గా ఖరారు చేశారంటూ కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు మండిపడ్డాయి. తాజాగా 'టీఎస్'కు బదులు 'టీజీ' అనే స్టేట్ కోడ్‌ను వినియోగించాలని నిర్ణయానికి వచ్చింది.

సీట్ల సర్దుబాటు కోసం త్రిసభ్య కమిటీ

సీపీఐ జాతీయ సమితి నిర్ణయం

- సభ్యులుగా డి.రాజా, కె.నారాయణ, రామకృష్ణ పాండా

సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికల్లో ఇండియా కూటమితో సీట్ల సర్దుబాటు కోసం సీపీఐ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు కె.నారాయణ, రామకృష్ణ పాండా సభ్యులుగా వ్యవహరిస్తారు. పార్టీ జాతీయ సమితి సమావేశాల్లో భాగంగా శనివారం మఖ్దూం భవన్‌లో జరిగిన భేటీలో సీపీఐ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కేంద్ర కార్మిక, సంయుక్త్ కిసాన్ మోర్చా ఈ నెల 16న చేపట్టనున్న గ్రామీణ బంద్‌కు మద్దతు ఇవ్వాలని జాతీయ కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సమావేశం ఆమోదించింది. ఈ మేరకు సీపీఐ కార్యాలయ కార్యదర్శి రాయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర బడ్జెట్ దేశ ప్రజలను తీవ్ర అసంతృప్తికి గురి చేసిందని, అసమానతలను తొలగించేందుకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదని పార్టీ జాతీయ సమితి ఆ ప్రకటనలో పేర్కొంది. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వం జాతీయ, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని దుయ్యబట్టింది. దేశాన్ని, ప్రజలను, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు జరుగుతున్న పోరాటంలో ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు మద్దతుగా నిలవాలని కోరింది. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత (2014- 2022 వరకు) 1,00,474 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు పేర్కొంది. కార్మికుల వేతనాలు పెరిగాయని కేంద్రం చెప్పడం అబద్ధమని, వాస్తవానికి వారి వేతనాలు తగ్గాయని, దేశంలో అత్యంత ప్రధానమైన నిరుద్యోగ సమస్యను బడ్జెట్ ప్రస్తావించలేదని విమర్శించింది. సమావేశానంతరం అమర్‌జీత్ కౌర్.. కె.నారాయణ, బాలచంద్ర కాంగోతో కలిసి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ఉద్యోగ, నిరుద్యోగ వ్యతిరేక నిర్ణయాలతో భారతదేశం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

క్షేత్రస్థాయి పరిశీలనకు కమిటీ

▶ మొదటి పేజీ తరువాయి

అందించాలని కమిటీ భావిస్తోంది.

మీ శాఖల్లో ఏం జరుగుతోంది?

సర్వే విభాగానికి సంబంధించి రికార్డుల జాబితా, ఖస్రా, సెస్లా పహాణీల నిర్వహణ, ధరణి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం, భూభారతి ప్రాజెక్టులో భాగంగా రూపొందించిన సర్వే పటాల ప్రస్తుత స్థితి, ధరణి పోర్టల్ సమాచారానికి, పటాలకు మధ్య వ్యత్యాసం తదితర అంశాలపై చర్చించారు. అదే విధంగా తమ భూమిని సబ్‌డివిజన్ చేయాలని రైతులు దరఖాస్తు చేసుకుంటే.. అందుకు అవలంబిస్తున్న పద్ధతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇక వక్ఫ్ బోర్డు అధికారులతో చర్చల్లో భాగంగా.. మొత్తం వక్ఫ్ బోర్డు కింద ఉన్న భూవిస్తీర్ణం ఎంత? అందులో ఎంత కబ్జాకు గురైంది? వక్ఫ్ భూముల రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు, ధరణి పోర్టల్‌లో ఈ భూముల విషయంలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. దేవాదాయ శాఖకు సంబంధించిన సమావేశంలో.. ఆ శాఖ అధీనంలో ఉన్న మొత్తం భూవిస్తీర్ణం, ఈ భూముల రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు, ధరణి పోర్టల్‌లో సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు ఎం.కోదండరెడ్డి, ఎం.సునీల్‌కుమార్, రేమండ్ పీటర్, నవీన్ మిత్తల్, మధుసూదన్, సీఎంఆర్వో పీడీ వి.లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకాలు, బదలాయింపు లేనందునే సమస్యలు: ఎం.కోదండరెడ్డి

శనివారం వివిధ వర్గాలతో సమావేశం తర్వాత 'ధరణి'కమిటీ సభ్యుడు ఎం.కోదండరెడ్డి మీడియాతో మాట్లాడారు. ధరణి పోర్టల్ సమస్యలపై తమ అధ్యయనం నిరంతరం కొనసాగుతుందన్నారు. అవసరమైనప్పుడు ప్రభుత్వానికి నివేదికలు ఇస్తామని చెప్పారు. ఇప్పటికే వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా, రైతు సంఘాలతో మాట్లాడామన్నారు. అందరితో సంప్రదింపులు పూర్తయిన తర్వాత ప్రాథమిక నివేదికను రూపొందించి, ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.

వేల ఎకరాల్లో తేడా.. భూములను జియోట్యాగింగ్ చేసుకోండి

దేవాదాయశాఖ, వక్ఫ్ బోర్డుతో చర్చల సందర్భంగా 'ధరణి' కమిటీ సభ్యులు పలు వివాదాస్పద అంశాలను గుర్తించారు. దేవాదాయ శాఖ గెజిట్‌లో, వక్ఫ్ బోర్డు పరిధిలో ఉన్న భూములకు, ఆయా శాఖల పేరిట ధరణి పోర్టల్‌లో నమోదైన భూముల విస్తీర్ణానికి వేల ఎకరాల్లో తేడా ఉందని తేల్చారు. ఆ భూములన్నీ ఎటు పోయాయని అధికారులను కమిటీ సభ్యులు ప్రశ్నించారు. ఇక ఆ శాఖ గెజిట్‌లో పేర్కొనని పట్టా భూములను కూడా ధరణి పోర్టల్‌లో నిషేధిత భూములుగా చేర్చారని.. వీటిని ఆ జాబితా నుంచి తొలగించేందుకు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి భూముల విషయంలో పరిష్కార మార్గాలను వెతకాలని సూచించారు. ముఖ్యంగా దేవాదాయ భూములన్నింటినీ జియోట్యాగింగ్ చేసుకోవాలని.. పట్టాదారులు తమ భూముల వివరాలను చెక్ చేసుకునే తరహాలోనే ఎప్పటికప్పుడు తమ భూముల స్థితిగతులను పరిశీలించుకోవాలని సూచించారు.

టీచర్లు సిటీకి.. చదువులు గాలికి!

▶ మొదటి పేజీ తరువాయి

మారుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నెల 2న యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఓ టీచర్‌ను ఏకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాగోల్ జెడ్పీ హైస్కూల్‌కు డిప్యుటేషన్‌పై పంపుతూ యాదాద్రి జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి అంతర్ జిల్లా డిప్యుటేషన్ ఇచ్చే అధికారం డీఈఓలకు ఉండదు. అయినా ఇలాంటి ఆదేశాలు రావడం గమనార్హం. అయితే రాష్ట్రంలో ఎక్కడా డిప్యుటేషన్లు ఇవ్వలేదని, పాఠశాల విద్య కమిషనరేట్ నుంచి అలాంటి ఉత్తర్వులేవీ జారీ చేయలేదని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ చెప్తుండటం గమనార్హం.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కొన్ని డిప్యుటేషన్లు ఇలా..

- రంగారెడ్డి జిల్లా మంచాల మండలం రంగాపూర్ జెడ్పీ హైస్కూల్ నుంచి ఓ ఉపాధ్యాయుడు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం రాగన్నగూడ జెడ్పీ హెచ్‌ఎస్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లారు.
- మాడ్గుల మండలం అవురుపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేయాల్సిన ఓ టీచర్.. చంపాపేట్ జెడ్పీహెచ్‌ఎస్‌లో డిప్యుటేషన్‌పైన విధులు నిర్వహిస్తున్నారు.
- మాడ్గుల మండలం పుట్టగడ్డతండా ప్రాథమిక పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. ఇదే మండలం అన్నబోయినపల్లి పాఠశాలకు చెందిన టీచర్.. శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ పాఠశాలకు డిప్యుటేషన్‌పై వెళ్లారు.
- ఇలా మాడ్గుల మండలానికి చెందిన సుమారు ఇరవై మంది టీచర్లు డిప్యుటేషన్లపైన ఇతర మండలాల్లో పనిచేస్తున్నట్టు సమాచారం.
- షాద్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని దాదాపు 60 మంది టీచర్లు.. గ్రేటర్ హైదరాబాద్ శివారు ప్రాంతాలైన రాజేంద్రనగర్, శంషాబాద్, శేరిలింగంపల్లి మండలాల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఈ సెగ్మెంట్ పరిధిలో దాదాపు 12 పాఠశాలల్లో టీచర్లెవరూ లేరని సమాచారం.

మానవతా దృక్పథంతో చేస్తున్నాం..



పక్షవాతం, కేన్సర్ తదితర వ్యాధుల బాధితులు, అఖిల భారత సర్వీసు ఉద్యోగుల జీవిత భాగస్వాములు వంటి వారి డిప్యుటేషన్లను అనుమతిస్తున్నాం. అలాంటి వారు ఎవరున్నా దరఖాస్తు చేసుకోవాలని కూడా చెప్తున్నాం. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం.. ఇలాంటి దరఖాస్తులను మానవతా దృక్పథంతో ఆమోదించి పోస్టింగ్‌లు ఇస్తున్నాం. విద్యాశాఖ కమిషనర్ నుంచి వస్తున్న ప్రతిపాదనలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నాం. – బుర్రా వెంకటేశం, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి

ఒక్క డిప్యుటేషన్ కూడా ఇవ్వలేదు..



డిప్యుటేషన్లు, బదిలీలకు సంబంధించి నేను ఎక్కడా సంతకాలు చేయలేదు. నాకు ఎలాంటి సంబంధం లేదు. గత మూడున్నరేళ్లలో నేను ఒక్క ఆర్డర్‌పై కూడా సంతకం చేయలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే అమలు చేస్తా. – దేవసేన, విద్యాశాఖ కమిషనర్

అమిత్ షాతో గవర్నర్ తమిళిసై భేటీ

తెలంగాణ, పుదుచ్చేరి అభివృద్ధి అంశాలపై చర్చ



అమిత్‌షాకు జ్ఞాపికను అందజేస్తున్న తమిళిసై

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ భేటీ అయ్యారు. శనివారం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకున్న తమిళిసై సాయంత్రం 5 గంటలకు అమిత్ షాను ఆయన నివాసంలో కలిశారు. సుమారు 30 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరు గురించి ఆమె అమిత్ షాకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, పాలనా విధానంసహా పలు రాజకీయ అంశాలపై అమిత్ షా ఆరా తీశారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపైనా వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. అయితే కేంద్ర మంత్రితో జరిగిన సమావేశంలో తెలంగాణ, పుదుచ్చేరికి సంబంధించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించినట్లు తమిళిసై ఎక్స్ వేదికగా వెల్లడించారు.

ఆర్థిక వనరులు పెంచుకోవడం ఎలా?

ఆర్థికవేత్త అహ్లూవాలియాతో సీఎం, డిప్యూటీ సీఎం చర్చలు



శనివారం అహ్లూవాలియాతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ ఆర్థికవేత్త మాంటెక్ సింగ్ అహ్లూవాలియా శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలకు అవసరమైన నిధుల సమీకరణ, అలాగే ప్రజలపై భారం పడకుండా ఏవిధంగా ఆర్థిక వనరులు పెంచుకోవాలన్న అంశంపై చర్చించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే రెండింటిని అమలు చేస్తున్నామని, అందులో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా ఛిన్నాభిన్నం చేసిందని, మిగులు నిధులు ఉన్న రాష్ట్రాన్ని లక్షల కోట్ల రూపాయల అప్పుల్లోకి నెట్టిందని అహ్లూవాలియాకు వివరించారు. ఈ నేపథ్యంలో ఆయన సలహాలు, సూచనలు కావాలని కోరా రు. ప్రజలపై ఎలాంటి భారం పడకుండా.. పన్నుల వసూళ్ల గురించి అహ్లూవాలియా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం విక్రమార్కకు వివరించారని సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఆయన నుంచి సూచనలు తీసుకున్నట్లు తెలిసింది.

ఉద్యోగ నియామకాల్లో మహిళలకు హారిజాంటల్ రిజర్వేషన్లు!

- నేడో, రేపో నిర్ణయం తీసుకోనున్న రాష్ట్ర ప్రభుత్వం
- సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు చేరిన ఫైలు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీలో మహిళలకు ఎలాంటి రిజర్వేషన్లు అమలు చేయాలనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నేడో, రేపో కీలక నిర్ణయం తీసుకోనుంది. పలు ఉద్యోగ నియామకాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఫలితాల ప్రకటనలో మహిళా రిజర్వేషన్ల అంశం జటిలంగా మారడంతో నియామక బోర్డులు సైతం ఎలాంటి చర్యలు తీసుకోకుండా వేచిచూస్తున్నాయి. ఇప్పటికే పరీక్షలు రాసిన అభ్యర్థులు ఆయా ఉద్యోగాలకు అర్హత సాధించామో లేదో తెలియక సతమతమవుతుండగా మహిళా రిజర్వేషన్ల అంశంపై కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో మహిళా రిజర్వేషన్లపై స్పష్టత ఇచ్చేందుకు సుప్రీంకోర్టు, హైకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు వేగవంతం చేసింది. సాధారణ పరిపాలనా విభాగం నుంచి, ఇతర ఉన్నతాధికారులు, నిపుణుల నుంచి సూచనలు తీసుకున్నట్లు తెలిసింది. మహిళా రిజర్వేషన్లను హారిజాంటల్ విధానంలో అమలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా అధికారుల సూచనలతో కూడిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయానికి సమర్పించినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ ఫైలు సీఎం వద్ద పెండింగ్‌లో ఉందని విశ్వసనీయంగా తెలిసింది. ఆయన ఆమోదం తెలిపితే వెంటనే ఉత్తర్వులు వెలువడతాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

పారిశ్రామిక భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

- కేటాయించిన భూములు వినియోగించకపోతే వెనక్కు తీసుకుంటాం
- ఈడీ కేసులు, ఇతరత్రా వ్యవహారాల్లో కోర్టులో ఉన్న భూములపై న్యాయ నిపుణులతో చర్చ
- టీఎస్ఐఐసీ సమీక్షా సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పారిశ్రామిక భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పరిశ్రమల విస్తరణ, అభివృద్ధి నేపథ్యంలో టీఎస్ఐఐసీ విభాగపు అధికారులతో మంత్రి శ్రీధర్‌బాబు బషీర్‌బాగ్‌లోని సంస్థ కార్యాలయంలో శనివారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంస్థ కార్యకలాపాలు, విభాగాల పనితీరు, ల్యాండ్ బ్యాంకు, భూ కేటాయింపులు, వాటి వినియోగం తదితర అంశాలపై పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, సంస్థ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, అధికారులతో కలిసి సమీక్షించారు. రాష్ట్ర విభజనకు ముందు, తర్వాత జరిగిన కేటాయింపులపై మంత్రి దృష్టిసారించారు. 2014 తర్వాత జరిగిన భూ కేటాయింపులు, ఏయే కంపెనీలు ఎంత మేర, ఏ అవసరాల కోసం భూమి పొందింది.. ప్రస్తుత వినియోగం ఎంత, నిరుపయోగంగా ఉన్న భూముల వ్యవహారాలపై మంత్రి ఆరా తీశారు. ఏళ్లు గడిచినా సంబంధిత కంపెనీలు భూములు వినియోగించుకోకపోవడం.. భూములు పొందిన సంస్థలు వారి ప్రయోజనాలకు కాకుండా థర్డ్ పార్టీలకు లీజుకు ఇచ్చిన అంశాలపై అధికారుల ద్వారా ఆరా తీశారు, అలా థర్డ్ పార్టీలకు జరిగిన లీజు అగ్రిమెంట్లు, పొందుతున్న ఆదాయం అంశాలపై నివేదిక సమర్పించాలని సంస్థ ఉన్నతాధికారులను ఆదేశించారు. గతంలో భూములు పొంది, ఈడీ , సీబీఐ లాంటి సంస్థలు జప్తు చేసిన భూములపై హక్కు తిరిగి పొందేలా న్యాయస్థానాల్లో పోరాటం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులకు సూచించారు. జాయింట్ వెంచర్‌లో భాగంగా పలు సంస్థలు, కంపెనీలు డివిడెండ్, షేర్ హోల్డ్ అమౌంట్ చెల్లించని అంశాలపై నివేదిక అందించాలని ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధిలో పరిశ్రమల శాఖ అధికారుల కృషి చాలా ఉందని, మరింతగా సంస్థ అభివృద్ధి కోసం సూచనలు, సలహాలతో పాటు సమస్యలు కూడా లిఖిత పూర్వకంగా ఇవ్వాలని ఉద్యోగులకు మంత్రి చెప్పారు. ప్రతి అధికారి ఫీల్డ్ విజిట్ చేసి సంబంధిత కంపెనీలకు సంబంధించిన భూములపై అన్ని వివరాలతో త్వరితగతిన నివేదిక అందించాలని సంస్థ ఎండీని మంత్రి ఆదేశించారు.

మరో రూ.2 వేల కోట్ల అప్పు

- ఈ నెల 6న ఆర్బీఐ ద్వారా సేకరించనున్న ప్రభుత్వం
- మొత్తం రూ.5,400 కోట్లకు చేరిన అప్పులు

సాక్షి, హైదరాబాద్: ఈ ఆర్థిక సంవత్సరం చివర్లో మరో రెండు వేల కోట్ల రూపాయల రుణసేకరణకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు సెక్యూరిటీలను వేలం వేయడం ద్వారా ఈ నెల ఆరో తేదీన రూ.2 వేల కోట్ల రుణం కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) షెడ్యూల్ జారీచేసింది. 11 ఏళ్ల కాలపరిమితిలో చెల్లించే విధంగా రూ.1,000 కోట్లకు, 21 ఏళ్లలో చెల్లించే విధంగా మరో రూ.1,000 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వ బాండ్లను వేలం వేయనున్నట్టు ఆర్‌బీఐ ఈ షెడ్యూల్‌లో ప్రకటించింది. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన గత డిసెంబర్‌లో బహిరంగ మార్కెట్ ద్వారా రూ.1,400 కోట్లను రుణంగా తీసుకోగా, గత జనవరిలో రెండు దఫాల్లో మరో రూ. 2 వేల కోట్లు సేకరించింది. మళ్లీ ఈ నెల మొదటి వారంలోనే తీసుకోనున్న రూ.2 వేల కోట్ల అప్పుతో కలిపి కాంగ్రెస్ ప్రభుత్వ అప్పు పద్దు రూ.5,400 కోట్లకు చేరనుంది.



సేవాలాల్ ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసి, తగిన నిధులు కేటాయించడంతోపాటు ప్రభుత్వమే సేవాలాల్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరుతూ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రం సమర్పించిన ఎమ్మెల్యే బాలు నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్.

హామీలు నెరవేర్చకుంటే ప్రజాఉద్యమమే

రాష్ట్ర ప్రభుత్వానికి మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరిక

- కాంగ్రెస్ పాలనలో రైతులు, ప్రజలు సంతోషంగా లేరు
- రైతు రుణమాఫీ అని ప్రకటించినా ఇంతవరకు అమలు కాలేదు
- తగినన్ని బస్సుల్లేకుండా మహిళలకు ఉచిత ప్రయాణం సరికాదు
- ఆటోడ్రైవర్లకు నెలకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించాలి
- కూకట్‌పల్లి, మేడ్చల్–మల్కాజిగిరి బీఆర్ఎస్ నేతలతో సమావేశం


కేటీఆర్‌తో సెల్ఫీ దిగుతున్న దివ్యాంగుడు

కూకట్‌పల్లి/సుభాష్‌నగర్: మోసపూరిత హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆ హామీలను నెరవేర్చకుండా పాలన సాగిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ఆరోపించారు. కాంగ్రెస్ హామీల అమలు కోసం తాము 100 రోజులపాటు వేచి చూస్తామని, అప్పటికీ హామీలను నెరవేర్చకపోతే ప్రజాఉద్యమం చేపడతామని హెచ్చరించారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంతోపాటు మేడ్చల్–మల్కాజిగిరి పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పల్లెల్లో రైతులు, పట్టణాల్లో ప్రజలు సంతోషంగా లేరని కేటీఆర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతేడాది డిసెంబర్ 9న రైతు రుణమాఫీ చేస్తామని చెప్పినా ఇంతవరకు అమలు కాలేదని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు పథకానికి తాము వ్యతిరేకం కాదని, కానీ తగినన్ని బస్సులు లేకుండా పథకం అమలు చేయడం వల్ల బస్సుల్లో ప్రయాణించే వారు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ పథకం వల్ల ఆటోడ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటి వరకు 16 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు ప్రతి నెలా రూ. 10 వేల ఆర్థిక సాయం అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

ఓటమితో కుంగిపోవద్దు..

అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓడిపోయామని... అందుకు కార్యకర్తలు నిరాశ చెందవద్దని కేటీఆర్ చెప్పారు. స్థానికంగా వార్డు సభ్యుల నుంచి మొదలుకొని ఎంపీల వరకు మనవాళ్లే ఉన్నారని... ఏదైనా సమస్యలుంటే వారిని కలవాలని భరోసా ఇచ్చారు. పార్లమెంటులో తెలంగాణ, హైదరాబాద్ హక్కులు, రాష్ట్రాభివృద్ధి కోసం మాట్లాడే ధైర్యం ఒక్క గులాబీ పార్టీకే ఉందని... అందుకే కాంగ్రెస్, బీజేపీలను నమ్మకుండా బీఆర్ఎస్ అభ్యర్థులను ఆదరించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కూకట్‌పల్లి నియోజకవర్గ పార్టీ కో–ఆర్డినేటర్ సతీష్ అరోరా, నిజాంపేట్ మేయర్, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై మాట్లాడటానికి సీఎంకు భయమెందుకు?

సాక్షి, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు స్పందించట్లేదని మాజీ మంత్రి కేటీఆర్ నిలదీశారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేశారు. 'తెలంగాణ గెట్స్ జీరో ఇన్ యూనియన్ బడ్జెట్'అంటూ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తన వ్యాఖ్యలతోపాటు జత చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా ముఖ్యమంత్రి ఒక్క మాట కూడా మాట్లాడకుండా నిశ్శబ్దంగా ఉన్నారని, తెలంగాణ ముఖ్యమంత్రి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాలను ఎందుకు పణంగా పెడుతున్నారని నిలదీశారు. కృష్ణా బోర్డుకు ప్రాజెక్టులను అప్పగించి రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు.

బీజేపీని ఎదిరించేది ప్రాంతీయ పార్టీలే

దేశంలో బీజేపీని అడ్డుకొనే శక్తి కేవలం ప్రాంతీయ రాజకీయ పార్టీలకే ఉందంటూ కేటీఆర్ 'ఎక్స్'లో మరో పోస్ట్ చేశారు. బీజేపీకి కాంగ్రెస్ ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 300 చోట్ల పోటీచేసినా కాంగ్రెస్‌కు 40 సీట్లు రావడం అనుమానమేనంటూ తృణమూల్ కాంగ్రెస్ చీఫ్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ వ్యవహారశైలి వల్లే విపక్ష ఇండియా కూటమి చెల్లాచెదురవుతోందని అభిప్రాయపడ్డారు.

కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండె: కేటీఆర్‌తో వృద్ధురాలు



కేసీఆర్ పాలనే బాగుండేదని.. పింఛన్ సొమ్ము సకాలంలో వచ్చేదంటూ ఓ వృద్ధురాలు కేటీఆర్‌తో పేర్కొంది. శనివారం కుత్బుల్లాపూర్‌లో జరిగిన కూకట్‌పల్లి బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆమె తన అభిప్రాయాన్ని వెల్లడించింది.

వారి సంభాషణ సాగింది ఇలా..

వృద్ధురాలు: మాకు కేసీఆర్ ఉన్నపుడే బాగుండె.. టయానికి పింఛన్ ఒస్తుండె. కరెంటు పోకుండా ఉంటుండె. ఇప్పుడు ఊకే కరెంటు పోతాంది. ఈ ప్రభుత్వం తీరు ఏం అర్థమైతలే.. మాకు కేసీఆరే బాగుండే.. మళ్లీ ఆయన వస్తేనే మంచిగుంటది.

కేటీఆర్: మళ్లీ అదే పాలనను తప్పకుండా తెచ్చుకుందాం. ఇప్పుడు 'విడాకులు' కావాల్నంటే ఐదేళ్లు ఓపిక పట్టాలి అమ్మా.

టెర్రరిస్టులకు, కాంగ్రెస్ నేతలకు తేడా ఏముంది?

- కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ వ్యాఖ్యలు దుర్మార్గం
- అద్వానీకి భారతరత్న రావడం సంతోషంగా ఉంది: బండి సంజయ్



కరీంనగర్‌టౌన్: దేశాన్ని విభజించాలంటూ కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతలకు, టెర్రరిస్టులకు తేడా ఏముందని ప్రశ్నించారు. కరీంనగర్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...కశ్మీర్ ప్రత్యేక దేశం కావాలని టెర్రరిస్టులు, పంజాబ్‌ను ఖలిస్తాన్‌గా ప్రకటించాలని తీవ్రవాదులు చెబుతున్నారని, ఇవాళ కాంగ్రెస్ ఎంపీ సురేశ్ భారత్‌ను దక్షిణ, ఉత్తరదేశాలుగా విభజించాలంటున్నారని మరీ వాళ్లకు, వీళ్లకు తేడా ఏమిటి?..అని ప్రశ్నించారు. గతంలో రాహుల్‌గాంధీ సైతం భారతీయుడిగా చెప్పుకునేందుకు సిగ్గు పడుతున్నానని దేశాన్ని కించపరిచేలా మాట్లాడారన్నారు. ఆయన బావ రాబర్ట్ వాద్రా సైతం భారతీయులను కించపరిచారని మండిపడ్డారు. భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడే నేతలపై దేశద్రోహం కేసు పెట్టాలని కోరారు. ఇండియా కూటమి చీలికలు పేలికలైందని..బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ఆ కూటమి నుంచి బయటకు రావడంతోపాటు, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కాంగ్రెస్‌పై చేసిన విమర్శలే ఇందుకు నిదర్శనమన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 40 ఎంపీ సీట్లు కూడా రావని మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. అద్వానీకి భారతరత్న పురస్కారం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలకతీతంగా వివిధ రంగాల్లో సేవ చేసిన వారికి పద్మ అవార్డులు ఇచ్చిన ఘనత బీజేపీదేనన్నారు. మోదీ హయాంలో పైరవీలు, అవినీతికి తావులేకుండా అర్హులైన వారినే అవార్డులు వరిస్తున్నాయన్నారు.

విలీన పాపం బీజేపీ, కాంగ్రెస్‌దే..

- బీజేపీతో కాంగ్రెస్ చీకటి దోస్తీ
- రాహుల్ గాంధీ ఎప్పటికీ ప్రధాని కాలేరు
- మాజీ మంత్రి హరీశ్‌రావు



భద్రాచలం: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో రాష్ట్రానికి చెందిన ఏడు మండలాలను ఏపీలో కలిపిన పాపం బీజేపీ, కాంగ్రెస్‌లదేనని మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం, పినపాక నియోజకవర్గం మణుగూరులో శనివారం జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశాల్లో ఆయన మాట్లాడారు. బీజేపీతో కాంగ్రెస్‌పార్టీ చీకటి దోస్తీ చేస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తేనే తెలంగాణలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ఆ పార్టీ పేర్కొనటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ కూటమిలో ఒక్కో పార్టీ చేజారుతున్నందున రాహుల్ గాంధీ ఎప్పటికీ ప్రధాని కాలేరన్నారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ చేసిన మోసాన్ని గమనించిన ప్రజలు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని హరీశ్ పేర్కొన్నారు. తప్పుడు అప్పుల లెక్కలతో అసెంబ్లీలో ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నేతలు.. ఈ రెండు నెలల కాలంలోనే రూ.14 వేల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఫిబ్రవరిలో జాబ్ కేలండర్ ప్రకటించకుండా మాట తప్పిన కాంగ్రెస్ పార్టీపై పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. సాగర్ నీటిలో 50 శాతం కోసం బీఆర్ఎస్ పోరాడితే, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను ఢిల్లీలో తాకట్టుపెట్టిందని మండిపడ్డారు. ఆరు లక్షల మంది ఆటోడ్రైవర్లు రోడ్డున పడ్డారని తెలిపారు. ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నందున ఇకనైనా వారి విషయంలో ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశాల్లో మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధు, రేగా కాంతారావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

'సుల్తానాబాద్'లో నెగ్గిన అవిశ్వాసం



ఆర్డీవో మధుమోహన్

సుల్తానాబాద్(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీతపై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. శనివారం సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల అధికారి, పెద్దపల్లి ఆర్డీవో మధుమోహన్ సమక్షంలో బలపరీక్ష నిర్వహించారు. బల్దియా లో 15 మందిసభ్యులు ఉండగా, వీరిలో 9 మంది బీఆర్ఎస్, ఆరుగురు కాంగ్రెస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇందులో ఒకరు మరణించగా ప్రస్తుతం 14 మంది కౌన్సిలర్లుగా ఉన్నారు. సమావేశానికి బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, కౌన్సిలర్ పారుపల్లి జ్ఞానేశ్వరి గైర్హాజరయ్యారని ఎన్నికల అధికారి తెలిపారు. సమావేశానికి హాజరైన 12 మంది అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తారని, ఈ మేరకు నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, కౌన్సిలర్లు గాజుల లక్ష్మి, పసేడ్ల మమత, కూకట్ల గోపి, గుర్రాల శ్రీనివాస్, రేవల్లి తిరుపతి, అనుమాల అరుణ, గొట్టం లక్ష్మి, దున్నపోతుల రాజయ్య, ఉట్ల వరప్రదీప్, నిషాదు రఫిక్, చింతల సునీత పాల్గొన్నారు.

ప్రాజెక్టుల అప్పగింతపై ఉద్యమం

▶ మొదటి పేజీ తరువాయి

సమావేశమవుదామని తెలిపారు. శనివారం కేసీఆర్ నందినగర్‌నివాసంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి మాజీ చీఫ్‌విప్‌వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య ఆయనతో సమావేశమయ్యారు.


'ది డెక్కన్‌పవర్‌ప్లే' పుస్తకాన్ని కేసీఆర్‌కు బహూకరిస్తున్న దేవులపల్లి అమర్. చిత్రంలో జ్వాలా నర్సింహారావు

ఎంత ఒత్తిడి చేసినా ఒప్పుకోలేదు: విశ్వసనీయ సమాచారం మేరకు.. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా కేంద్ర ప్రభుత్వం ఎంత ఒత్తిడి చేసినా రాష్ట్రంలోని ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడానికి ఒప్పుకోలేదని కేసీఆర్ స్పష్టం చేశారు. బలవంతంగా గెజిట్ అమలు చేయడానికి ప్రయత్నిస్తే కృష్ణాలో 50 శాతం వాటా కోసం పట్టుబట్టామని తెలిపారు. 2 రాష్ట్రాలకు 50:50 నిష్పత్తిలో నీటి పంపకాల విషయం అపెక్స్ కౌన్సిల్ తేల్చాలని కేఆర్ఎంబీ 17వ సమావేశంలో నిర్ణయించినా, ఆ తర్వాత అపెక్స్ కౌన్సిల్‌సమావేశమే జరగలేదని చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్.. శ్రీశైలం, నాగార్జున సాగర్‌ప్రాజెక్టుల్లోని పది ఔట్‌లెట్లను కేఆర్ఎంబీకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకుందని, అదే జరిగితే రాష్ట్ర హక్కులను కోల్పోతామని చెప్పారు. జల విద్యుత్‌ఉత్పత్తికి ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఏటా శ్రీశైలంలోకి ఇన్‌ఫ్లో మొదలవగానే టీఎస్‌జెన్ కో విద్యుదుత్పత్తి మొదలు పెట్టేదని, తద్వారా రాష్ట్రంలోని ఎత్తిపోతల ప్రాజెక్టులకు తక్కువ ఖర్చుతో కరెంట్‌ఉత్పత్తి చేసుకునే వారమని గుర్తుచేశారు. దీనిని వ్యతిరేకిస్తూ ఏపీ.. కృష్ణా బోర్డు మొదలు పార్లమెంట్‌వరకు అనేక రకాలుగా అడ్డుకునే ప్రయత్నం చేసిందని, సుప్రీం కోర్టులోనూ కేసు దాఖలు చేసిందని తెలిపారు. అధికారంలో ఉన్నా లేకున్నా తమకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని కేసీఆర్ స్పష్టం చేశారు.

కేసీఆర్‌ను కలిసిన ప్రముఖులు: కేసీఆర్‌ను శనివారం సినీ నిర్మాత దిల్‌రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. తన తమ్ముడు శిరీష్‌రెడ్డి కుమారుడు ఆశిష్‌రెడ్డి వివాహానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. కాగా సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్ ఏపీ రాజకీయాలపై తాను రాసిన 'ది డెక్కన్‌పవర్‌ప్లే' పుస్తకాన్ని కేసీఆర్‌కు అందజేశారు. మరో సీనియర్ జర్నలిస్ట్ వనం జ్వాలా నర్సింహారావు.. 'ఆంధ్రా వాల్మీకి రామాయణంలో చంద్ర ప్రయోగం'పుస్తకాన్ని బహూకరించారు.



ఈ (మామూలు) నీళ్లు త్రాగు ప్రతివాడునూ మరల దప్పిగొనును;
నేనిచ్చు నీళ్లు త్రాగు వాడెప్పుడునూ దప్పిగొనడు; నేను వానికిచ్చు నీళ్లు
నిత్యజీవమునకై వానిలో ఊరెడి నీటి బుగ్గగా ఉండునని (యేసు) చెప్పెను.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** బ.నవమి ప.12.50 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** అనూరాధ రా.3.40 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** ఉ.7.04 నుండి 8.43 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.21 నుండి 5.06 వరకు, **అమృతఘడియలు:** సా.4.56 నుండి 6.36 వరకు.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం : 5.53
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

రాహుల్ గాంధీ (కాంగ్రెస్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

భారత్ జోడో న్యాయ్ యాత్ర రఘునాథ్ గంజ్‌లో ఆగి ఉన్నప్పుడు మొహమ్మద్ సలీం, సుజన్ చక్రవర్తి, ఇంకా మరికొందరు కమ్యూనిస్టులు వచ్చి నన్ను కలిశారు. సలీమ్ సీపీఐ(ఎం) బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి. సుజన్ ఆ పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు.

"రాహుల్‌జీ! బీజేపీకి, ఆరెస్సెస్‌కి వ్యతిరేకంగా పోరాడేందుకు మనతో ఎవరైతే చేయి కలిపారో వారిలో ఒకరు ఇప్పుడు తమ సొంతంగా బీజేపీకి, ఆరెస్సెస్‌కి వ్యతిరేకంగా పోరాడటం కోసం మన చేయి వదిలించుకో బోతున్నారు. మన చేయి వదిలించుకోబోతు న్నారంటే వారి పోరాటం మన మీద కూడా..." అని అన్నారు కామ్రేడ్ సలీమ్!

సలీమ్ చెబుతున్నది మమతాజీ గురించే నని నేను అర్థం చేసుకోగలిగాను.

కమ్యూనిస్టులను అర్థం చేసుకోగలిగితే కనుక వారేం చెబుతున్నదీ మనకు చక్కగా అర్థమవుతుంది. మొదటే అత్యాశతో వారేం చెబుతున్నదీ అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తే మాత్రం మనం ఎప్పటికీ కమ్యూనిస్టులను అర్థం చేసుకోలేం. ఈ సుళువును నేను నానమ్మ



మాటల నుంచి గ్రహించాను.

"నీకేదైనా సలహా అవసరమైతే ఒక కమ్యూనిస్టును అడుగు. అలాగే నీకెవరైనా ఒక కమ్యూనిస్టు సలహా ఇవ్వాలని వస్తే వారే నీ నిజమైన సలహాదారు అని నమ్ము..." అని నానమ్మ అంటుండేవారు.

నా పన్నెండేళ్ల వయసులో ఒకరోజు – "నానమ్మా! కమ్యూనిస్టులంటే ఎవరు? ఎప్పుడూ వాళ్లు మనకు సలహాలు ఇవ్వడమేనా, మనం వాళ్లకు సలహాలు ఇవ్వకూడదా?" అని అడిగాను.

నానమ్మ మురిపెంగా నవ్వారు.

"దేశాన్ని పరిపాలించే వారికే సలహాలు అవసరం అవుతాయి నాన్నా..." అన్నారు

"ఒకవేళ కమ్యూనిస్టులు దేశాన్ని పరిపాలిస్తుంటే వారికీ సలహాలు అవసరం అవుతాయా నానమ్మా?" అని అడిగాను.

"సలహాలు ఇచ్చేవాళ్లకు సలహాలు తీసుకునే అవసరం, అవకాశం ఎప్పటికీ రావు నాన్నా..." అన్నారు నానమ్మ.

"అయితే నానమ్మా! మీ డాడీ కూడా కమ్యూనిస్టులను సలహాలు అడిగేవారా? ఆయన కూడా ప్రధానిగా ఉన్నారు కదా..." అని అడిగాను.

"అవును అడిగేవారు. నేనూ అడుగుతుంటాను. నా తర్వాత మీ డాడీ, మీ డాడీ తర్వాత నువ్వు... ఎవరు ప్రధాని అయినా మనం తీసుకోవలసింది కమ్యూనిస్టుల సలహాన్నే..." అన్నారు నానమ్మ.

నానమ్మ అన్నది నిజమే. పీవీజీ, మన్మోహన్ జీ కూడా అప్పుడప్పుడూ కమ్యూనిస్టుల సలహాలు తీసుకునేవారని విన్నాను.

"ఏమిటి ఆలోచిస్తున్నారు రాహుల్‌జీ?" అన్నారు కామ్రేడ్ సలీమ్.

"మమతాజీ గురించే ఆలోచిస్తున్నాను సలీమ్‌జీ. ఆమె వెళ్లిపోతానంటే వెళ్లిపోనివ్వండి. నితీశ్‌జీ వెళ్లిపోతే కూటమి ఏమైనా కుప్పకూలిపోయిందా?" అన్నాను.

"మీ నానమ్మ అయితే ఇలా ఆలోచిం చరు..." అన్నారు హఠాత్తుగా కామ్రేడ్ సలీమ్ పక్కనే ఉన్న కామ్రేడ్ సుజన్!

నానమ్మ ఎంత గ్రేట్! నేటి కామ్రేడ్‌లను కూడా ఆవిడ ఆత్మ ప్రభావితం చేస్తోంది!

"మరి ఎలా ఆలోచిస్తారు నానమ్మ?" అని కామ్రేడ్ సుజన్‌ను అడిగాను.

"వెళ్లేవాళ్లను వెళ్లనివ్వరు. వెళ్లిపోతాం అనే వాళ్లనూ వెళ్లనివ్వరు" అన్నారాయన!

"మరి?!" అన్నాను.

"వాళ్లు వెళ్లేలోపు నానమ్మే వాళ్లను పంపించేస్తారు" అన్నారు!!

"ఈ మాట కూడా మీరు వినాలి రాహుల్‌జీ! పొత్తు వద్దనుకుని ఈరోజు వెళ్లిపోయిన వారే, రేపు మనకు నాలుగు సీట్లు ఎక్కువ రాగానే పొత్తు కోసం మళ్లీ మన దగ్గరికే వస్తారు..." అన్నారు కామ్రేడ్ సలీమ్!

నానమ్మ చెప్పింది రైటే. కమ్యూనిస్టులు అత్యుత్తమ సలహాదారులు.

అక్షౌహిణులు సిద్ధం!

జనతంత్రం



వర్ధెల్లి మురళి



ఇసుకేస్తే రాలనట్టుగా, నేల ఈనినట్టుగా, ఆకాశానికి చిల్లులు పడి కుండపోతలు కురిసినట్టుగా జనం కనిపిస్తే... వారి సంఖ్యను లక్షల్లో చెబుతారు. అదే స్థాయిలో ఒక సైన్యం కనిపిస్తే... పూర్వకాలంలోనైతే అక్షౌహిణుల్లో కొలిచేవారు. ఇదిగో ఇప్పుడు దెందులూరు వైసీపీ సభలో కనుచూపు మేర చీమల దండులా కనిపిస్తున్న వారంతా సైన్యమే! కార్యకర్తల సైన్యం! ఎంతమంది ఉంటారు? రెండు అక్షౌహిణులు? అంతకంటే ఎక్కువ? రథ గజ తురగ పదాతి విభాగాలు కలిసిన ఒక అక్షౌహిణిలో సుమారు 2 లక్షల 20 వేలమంది ఉంటారు. ఇది మహాభారతం లెక్క. పోయిన వారం భీమిలిలో, ఇవ్వాళ దెందులూరులో కార్యకర్తలు ఎందుకిలా పోటెత్తారు? ప్రతి పల్లె నుంచి పదుల సంఖ్యలో ఎందుకు కదిలారు? ప్రభంజనంలా ఎందుకిలా సాగుతున్నారు? వారికేం లాభం? ఏం ఒరిగింది వారికి?... ఎందుకంటే సమాజానికి ఏదో లాభం జరుగుతున్నది. ప్రతి కుటుంబానికీ సంక్షేమం అందుతున్నది. తాము అభిమానిస్తున్న నాయకుని సారథ్యంలోని ప్రభుత్వ పనితీరును వారు గమనించారు. ఈ స్వల్పకాలంలోనే రాష్ట్రంలో మానవాభివృద్ధి సూచికలు చిగురించడం, మొగ్గ తొడగడం వారి అనుభవంలోకి వచ్చింది.

చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఆయన పార్టీ కార్యకర్తలు 'జన్మభూమి కమిటీ' పేరుతో జనాన్ని చెండుకు తిన్నారు. ప్రతి పనికీ రేటు కట్టి పిండుకున్నారు. ఇప్పుడా అవకాశం వైసీపీ కార్యకర్తలకు ఎంతమాత్రం లేదు. ప్రజాహిత కార్యక్రమాల్లో పార్టీ చొరబాట్లు లేవు. అర్హతే ప్రాతిపదికగా పారదర్శక పాలన ప్రతి గ్రామంలోనూ అందుబాటులోకి వచ్చింది. వ్యవస్థలో చోటుచేసుకుంటున్న అభ్యుదయ మార్పులే అధికార పార్టీ కార్యకర్తలను ఉత్తేజితం చేస్తున్నాయి. అందువల్లనే లక్షలాది మంది కార్యకర్తలు సొంత లాభం కోసం పాకులాడకుండా పార్టీ గెలుపు కోసం కెరటాలు కెరటాలుగా తరలివస్తున్నారు. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి 'సిద్ధం' సభల్లో కార్యకర్తలనుద్దేశించి ఒక మాట తప్పనిసరిగా చెబుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరి సమష్టి పార్టీ అని ఆయన చెబుతున్నారు. తనతో పాటు పార్టీ వారంతా ఇందులో భాగస్వాములేనని ప్రకటించారు. తొలి నుంచీ పరిశీలిస్తే ఆయన పార్టీని నడుపుతున్న తీరు కూడా ఇందుకు అనుగుణంగానే కనిపిస్తుంది. పార్టీని తన సొంత సంస్థగా, ప్రైవేట్ ఎంటర్‌ప్రైజ్‌గా భావించి ఉంటే తన కుటుంబసభ్యులకే అధికారిక పదవుల్లో కీలక బాధ్యతలు అప్పగించి ఉండేవారేమో! ఆయన ఆ పని చేయలేదు. విస్తృత ప్రజా పునాదితోనే జగన్ పార్టీని నిర్మిస్తున్నారు. అందువల్లనే బహుళ ప్రజానీకపు ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించే విధంగా పార్టీ ఆశయాలను, కర్తవ్యాలను రూపొందించుకున్నారు. ఇవాళ ప్రభుత్వ పాలనలోనూ ఆ ఆశయాలే మార్గదర్శకాలుగా మారాయి.

కుటుంబానికి పెద్దపీట వేయకపోవడం వల్ల కొందరు నొచ్చుకొని ఉండవచ్చు. కొందరికి నచ్చకపోవచ్చు. ఆ పరిణామం ఆయనకు కొంత అసౌకర్యాన్ని కలిగించవచ్చు. అయినా సరే తన ఆశయపథం నుంచి పక్కకు జరగలేదు. అదేవిధంగా తన పార్టీ కార్యకర్తల అక్రమార్జనకు అవకాశం కల్పించే అడ్డదారులూ తొక్కలేదు. అధికారంలోకి వచ్చిన తర్వాత తాను ఆకాంక్షించిన లక్ష్యాల పట్ల జగన్‌మోహన్‌రెడ్డి ఎంత నిబద్ధతతో ఉంటారో రాష్ట్ర ప్రజలకు పూర్తిగా అవగతమైంది. 'మీ ఇంట్లో మేలు జరిగితేనే నాకు ఓటు వేయండ'ని గతంలో ఏ నాయకుడైనా అనగలిగాడా? అలా అనడానికి ఎంత నైతిక బలం ఉండాలి! లక్ష్యాల పట్ల తనకున్న నిబద్ధత వల్లనే ఆ నైతిక బలం ఆయనకు సమకూరింది.

వెనుకబాటుతనం కారణంగా సమాజంలోని దగాపడిన తమ్ముళ్లూ, చెల్లెమ్మలూ రాజ్యాంగబద్ధమైన అవకాశాలను అందిపుచ్చుకోలేకపోతున్నారనేది అందరికీ తెలిసిన విషయమే. ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ రిజర్వేషన్లు ఉన్నందువల్ల ఎంతో కొంత ప్రాతినిధ్యం చట్టసభల్లో లభిస్తున్నది. సగం జనాభా ఉన్న బీసీలు మాత్రం ధనస్వామ్యంగా మారిన ఎన్నికల పోరాటంలో నెగ్గుకురాలేకపోతున్నారు. కంటితుడుపుగా ఒకటీ అరా సీట్ల కేటాయింపులకే గతంలో పార్టీలన్నీ పరిమితమయ్యేవి. కార్మిక – కర్షక పార్టీలుగా తమను తాము చెప్పుకునే కమ్యూనిస్టుల కంటే, బీసీల నాయకత్వంలో ఉన్న ప్రాంతీయ పార్టీల కంటే మిన్నగా జగన్‌మోహన్‌రెడ్డి ఈ వర్గాలకు రాజకీయ అవకాశాలను కల్పిస్తున్నారు. లోక్‌సభ స్థానాలకు పార్టీ ప్రకటించిన 16 సీట్లలో తొమ్మిదింటిని బీసీలకు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు స్థానాలు పోను మిగిలిన వాటిలో నికరంగా బీసీలకు సగం సీట్లు దక్కనున్నాయి. ఇలా జరుగుతుందని ఎవరైనా ఊహించారా? ఛాన్సే లేదు! కానీ అది జగన్ మోహన్‌రెడ్డి నిబద్ధత. ఊకదంపుడు ఉపన్యాసాల్లో కాకుండా అభ్యుదయాన్ని ఆచరణలో చూపించిన తొలి రాజకీయవేత్త జగన్ మోహన్‌రెడ్డి.

'ఎమ్మెల్యే టిక్కెట్టిస్తాం... ఎన్ని కోట్లు ఖర్చు పెడతావ్, పార్టీకెంత చందా ఇస్తావ'ని ఒక పక్క తెలుగుదేశం నాయకులు అడుగుతున్న రోజులివి. ఉపాధి హామీ కూలీగా పనిచేసే ఒక సాధారణ వ్యక్తిని మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేయగల సాహసం ఒక్క జగన్‌కు తప్ప ఇంకెవరికి ఉంటుంది? పార్టీ కార్యకర్త కావడం, పార్టీ పట్ల విధేయత అతని అర్హతలు. సూపర్ రిచ్ సామాజిక వర్గాలు పెద్ద సంఖ్యలో ఉండే ప్రాంతాలైన రాజమండ్రి, నర్సాపురం లోక్‌సభ స్థానాలను బీసీ సామాజిక వర్గమైన శెట్టి బలిజలకు కేటాయించవచ్చని ఎవరి ఊహకైనా ఎప్పుడైనా తట్టి వుంటుందా? ఏలూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి, నరసరావుపేట లోక్‌సభా స్థానం నుంచి యాదవ కులానికి చెందిన బీసీ అభ్యర్థులను నిలబెట్టే ఔదార్యం ఎవరైనా కనబరిచారా? విజయవాడ నగర శివార్లలో కమ్మ సామాజిక వర్గం బలంగా ఉండే పెనమలూరులో గౌడ అభ్యర్థిని, మైలవరంలో యాదవ అభ్యర్థిని నిలబెట్టగలగడం ఒక్క జగన్‌కు మాత్రమే సాధ్యమైన విషయం.

రాజకీయ రంగంపై పెత్తందారీ వర్గ ఆధిపత్యాన్ని సవాల్ చేసే విధంగా పేద వర్గాలను సాయుధం చేస్తున్న జగన్‌మోహన్ రెడ్డి విధానాలు ఆ వర్గాలను ఉత్తేజితం చేస్తున్నాయి. కనుకనే ప్రతిఫలాపేక్ష లేకుండా పార్టీ గెలుపు కోసం పనిచేయడానికి వారు ముందుకొస్తున్నారు. శ్రీమంతుల పిల్లలతో సమానంగా నాణ్యమైన విద్యను, నాణ్యమైన వైద్యాన్ని పేదవర్గాలకు అందుబాటులోకి తేవడం రాష్ట్ర ప్రజలను అమితంగా ప్రభావితం చేసింది. వ్యవసాయం దండగనే నాయకుడికి చెంపపెట్టు మాదిరిగా ప్రస్తుత ప్రభుత్వ విధానాలున్నాయి. చిన్న, సన్నకారు రైతులను చేయిపట్టుకొని ముందుకు నడిపించే బాధ్యతను ఆర్బీకే సెంటర్లు చేపట్టాయి. ప్రభుత్వ చేయూత నందుకొని ఈ స్వల్పకాలంలోనే సుమారు రెండు లక్షల సూక్ష్మ పరిశ్రమలు ఏర్పడి 16 లక్షల మందికి ఉపాధినందించాయి.

ఏ ప్రమాణాల ప్రకారం చూసినా... పారిశ్రామిక వృద్ధిలో గానీ, మౌలికరంగ అభివృద్ధిలోగాని, మానవాభివృద్ధిలోగానీ, ప్రజల ఆస్తుల కల్పనలోగానీ, సంక్షేమ రంగంలోగానీ ఈ ఐదేళ్ల కాలంతో పోల్చదగిన మరో పదవీకాలం ఈ రాష్ట్రంలో కాదు, దేశంలోనే లేదు. ఇది వాస్తవ పరిస్థితి. కానీ చంద్రబాబు – రామోజీ ముఠా ఈ వాస్తవాన్ని వక్రీకరించడానికీ, తలకిందులుగా చూపడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నది. చేతిలో ఉన్న యెల్లో మీడియా సాయంతో ఉన్నది లేనట్టుగా, లేనిది ఉన్నట్టుగా చూపెట్టే పాతకాలపు కనికట్టు విద్యల్ని ప్రదర్శిస్తున్నది. యెల్లో మీడియా రాతలు, మాటలు ఉన్మాద స్థాయికి చేరుకున్నాయి. ఏరకంగానైనా జగన్ ప్రభుత్వాన్ని ఓడించడానికి పెత్తందారీ శక్తులు పడరాని పాట్లు పడుతున్నాయి. మరోపక్కన అవకాశవాద పొత్తుతో కుట్రలు పన్నుతున్నాయి. పవన్ కల్యాణ్ పార్టీ అనే తమ బినామీ పార్టీని ఇప్పటికే ముడివేసుకున్నారు. ఇద్దరూ కలిసి బీజేపీ కోసం ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్‌తో పరోక్ష పొత్తు కుదిరింది. వైసీపీ ఓట్లను ఎంతోకొంత చీల్చాలన్న ఏకైక టార్గెట్‌ను రాష్ట్ర కాంగ్రెస్‌కు చంద్రబాబు అప్పగించారు. బాబు టార్గెట్‌ను శిరసావహిస్తూ పీసీసీ అధ్యక్ష బాధ్యతలను స్వీకరించిన షర్మిల తన క్యాంపెయిన్‌ను కూడా ప్రారంభించారు. జగన్ వ్యతిరేక ప్రచారాన్ని మరింత రక్తి కట్టించడం కోసం ఆమె తన కజిన్ సోదరి సునీత సహాయాన్ని కూడా తీసుకుంటున్నారు. చంద్రబాబు సహాయ సహకారాలు సరేసరి! రాష్ట్రంలో పెత్తందారీ శక్తుల ప్రతినిధులు జగన్ ప్రభుత్వంపై యుద్ధానికి సన్నాహాలు పూర్తి చేస్తున్నారు.

పేదల ప్రభుత్వం తరఫున వైసీపీ కార్యకర్తలు ఉరిమే ఉత్సాహంతో ముందుకు కదులుతున్నారు. భీమిలిలో, దెందులూరులో జరిగినవి కార్యకర్తల సభలు మాత్రమే. జనసభలు కావు. కార్యకర్తలే లక్షల సంఖ్యలో పాల్గొనడం చిన్న విషయం కాదు. 'జన్మభూమి కమిటీ'ల పేరుతో చంద్రబాబు మాదిరిగా జగన్ దోచిపెట్టలేదు కనుక ఈ ఎన్నికల్లో వైసీపీ కార్యకర్తలు పెద్దగా కష్టపడకపోవచ్చని కలలు కన్నవారి కడుపు మండేలా ఈ సభలు జరిగాయి. సభల్లో పాల్గొనడమే కాదు, యుద్ధానికి తాము సిద్ధమేనంటూ సమరనాదాలు కూడా కార్యకర్తలు చేశారు. 'ఈ పార్టీ నాదీ, నా కుటుంబానిదీ కాదు... ఇది మీది, కార్యకర్తలందరిదీ' అన్న జగన్ మాటను మంత్రంగా స్వీకరించారు.

'ఈ యుద్ధంలో అర్జునుడి పాత్ర నాది. సారథ్యం వహించే కృష్ణపరమాత్ములు మీరే'నని కార్యకర్తలను ఆయన ఉత్సాహపరిచారు. 'పార్టీ మీదే, పదవులూ మీవే... ముందు ముందు మరిన్ని పదవులు పార్టీకి విశ్వాసపాత్రులైన కార్యకర్తలకే లభిస్తాయ'ని ఆయన స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ జన్మభూమి కమిటీల మాదిరిగా ఆదాయం కోసం పనిచేసే కార్యకర్తలం కాదనీ, ఆశయం కోసం పనిచేసేవారమని ఇప్పటికే రుజువు చేసుకున్న వైసీపీ కేడర్ నాయకుని భరోసాతో మరింత స్ఫూర్తిని పొందింది. ప్రాంతాల వారీగా పెత్తందార్లపై ఎన్నికల యుద్ధానికి వైసీపీ అక్షౌహిణులు సిద్ధమవుతున్నాయి. ఈ కార్యకర్తల సమరశీలత లోపించడం ప్రతిపక్ష శిబిరానికి అతిపెద్ద మైనస్ పాయింట్. మీడియా మాయాజాలంతో, కుట్రలతో ఈ మైనస్‌ను ప్లస్‌గా మార్చుకోవడం సాధ్యమయ్యే పని కాదు.

vardhelli1959@gmail.com

ఏ ప్రమాణాల ప్రకారం చూసినా... పారిశ్రామిక వృద్ధిలో గానీ, మౌలికరంగ అభివృద్ధిలోగాని, మానవాభివృద్ధిలో గానీ, ప్రజల ఆస్తుల కల్పనలోగానీ, సంక్షేమ రంగంలో గానీ ఈ ఐదేళ్ల కాలంతో పోల్చదగిన మరో పదవీ కాలం ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాదు, దేశంలోనే లేదు. ఇది వాస్తవ పరిస్థితి. కానీ చంద్రబాబు – రామోజీ ముఠా ఈ వాస్తవాన్ని వక్రీకరించడానికీ, తలకిందులుగా చూపడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నది. చేతిలో ఉన్న యెల్లో మీడియా సాయంతో ఉన్నది లేనట్టుగా, లేనిది ఉన్నట్టుగా చూపెట్టే పాతకాలపు కనికట్టు విద్యల్ని ప్రదర్శిస్తున్నది. యెల్లో మీడియా రాతలు, మాటలు ఉన్మాద స్థాయికి చేరుకున్నాయి. ఏరకంగానైనా జగన్ ప్రభుత్వాన్ని ఓడించడానికి పెత్తందారీ శక్తులు పడరాని పాట్లు పడుతున్నాయి. మరోపక్కన అవకాశవాద పొత్తుతో కుట్రలు పన్నుతున్నాయి. పవన్ కల్యాణ్ పార్టీ అనే తమ బినామీ పార్టీని ఇప్పటికే ముడివేసుకున్నారు. ఇద్దరూ కలిసి బీజేపీ కోసం ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్‌తో పరోక్ష పొత్తు కుదిరింది. వైసీపీ ఓట్లను ఎంతో కొంత చీల్చాలన్న ఏకైక టార్గెట్‌ను రాష్ట్ర కాంగ్రెస్‌కు చంద్రబాబు అప్పగించారు. బాబు టార్గెట్‌ను శిరసా వహిస్తూ పీసీసీ అధ్యక్ష బాధ్యతలను స్వీకరించిన షర్మిల తన క్యాంపెయిన్‌ను కూడా ప్రారంభించారు. జగన్ వ్యతిరేక ప్రచారాన్ని మరింత రక్తి కట్టించడం కోసం ఆమె తన కజిన్ సోదరి సునీత సహాయాన్ని కూడా తీసుకుంటున్నారు. చంద్రబాబు సహాయ సహకారాలు సరేసరి! రాష్ట్రంలో పెత్తందారీ శక్తుల ప్రతినిధులు జగన్ ప్రభుత్వంపై యుద్ధానికి సన్నాహాలు పూర్తి చేస్తున్నారు.

వెనుకబాటుతనం కారణంగా సమాజంలోని దగా పడిన తమ్ముళ్లూ, చెల్లెమ్మలూ రాజ్యాంగబద్ధమైన అవకాశాలను అందిపుచ్చుకోలేకపోతున్నారనేది అందరికీ తెలిసిన విషయమే. ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ రిజర్వేషన్లు ఉన్నందువల్ల ఎంతోకొంత ప్రాతినిధ్యం చట్టసభల్లో లభిస్తున్నది. సగం జనాభా ఉన్న బీసీలు మాత్రం ధనస్వామ్యంగా మారిన ఎన్నికల పోరాటంలో నెగ్గుకురాలేకపోతున్నారు. కంటితుడుపుగా ఒకటీ అరా సీట్ల కేటాయింపులకే గతంలో పార్టీలన్నీ పరిమిత మయ్యేవి. కార్మిక – కర్షక పార్టీలుగా తమను తాము చెప్పుకునే కమ్యూనిస్టుల కంటే, బీసీల నాయకత్వంలో ఉన్న ప్రాంతీయ పార్టీల కంటే మిన్నగా జగన్‌మోహన్‌రెడ్డి ఈ వర్గాలకు రాజకీయ అవకాశాలను కల్పిస్తున్నారు. లోక్‌సభ స్థానాలకు పార్టీ ప్రకటించిన 16 సీట్లలో తొమ్మిదింటిని బీసీలకు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు స్థానాలు పోను మిగిలిన వాటిలో నికరంగా బీసీలకు సగం సీట్లు దక్కనున్నాయి. ఇలా జరుగుతుందని ఎవరైనా ఊహించారా? ఛాన్సే లేదు! కానీ అది జగన్‌మోహన్‌రెడ్డి నిబద్ధత. ఊకదంపుడు ఉపన్యాసాల్లో కాకుండా అభ్యుదయాన్ని ఆచరణలో చూపించిన తొలి రాజకీయవేత్త జగన్‌మోహన్‌రెడ్డి.
'ఎమ్మెల్యే టిక్కెట్టిస్తాం... ఎన్ని కోట్లు ఖర్చు పెడతావ్, పార్టీకెంత చందా ఇస్తావ'ని ఒక పక్క తెలుగుదేశం నాయకులు అడుగుతున్న రోజులివి. ఉపాధి హామీ కూలీగా పనిచేసే ఒక సాధారణ వ్యక్తిని మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేయగల సాహసం ఒక్క జగన్‌కు తప్ప ఇంకెవరికి ఉంటుంది? పార్టీ కార్యకర్త కావడం, పార్టీ పట్ల విధేయత అతని అర్హతలు.

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

పీడితుల కోసమే జీవితం అంకితం

సందర్భం



ఎమ్.డి. మునీర్

తెలుగు నేలపై జన్మించి ప్రజలకొరకు జీవితాన్ని అర్పించిన అరుదైన కమ్యూనిస్ట్ నేత కామ్రేడ్ మఖ్దూమ్. సింగరేణిలో ఆయన చాలా కాలం ఏఐటీయూసీ బాధ్యుడు. ఆయన కుమారుడు కూడా ఉద్యోగం చేసేవాడు. సింగరేణితో ఆయన అనుబంధం విడదీయరానిది. బొగ్గు బావుల్లో దిగి కార్మికుల సమస్యలను ఆయన తెలుసుకునే వారు. ఆయన కవితలు ఇక్కడ ఇప్పటికీ పలు కార్యక్రమాల్లో వినిపిస్తుంటాయి. ప్రముఖ కార్మిక నాయకుడు, ఉర్దూ కవి, హైదరాబాదు సంస్థానంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ఒకడైన ఆయన మెదక్ జిల్లా ఆందోల్‌లో 1908, ఫిబ్రవరి 4 న జన్మించాడు. మఖ్దూమ్ పూర్తిపేరు అబూ సయీద్ మహ్మద్ మఖ్దూమ్ మొహియుద్దీన్ ఖాద్రి. వీరి పూర్వీకులు ఉత్తర ప్రదేశ్ నుండి తెలంగాణకు వచ్చి స్థిరపడ్డారు.

తండ్రి గౌస్ మొహియుద్దీన్ నిజాం ప్రభుత్వంలో సూపరింటెండెంటుగా పనిచేసేవాడు. మఖ్దూమ్ చిన్నతనంలోనే (నాలుగేళ్ళయినా రాకముందే) తండ్రి చనిపోయాడు. తల్లి మరో పెళ్ళి చేసుకోవడంతో ఆయన తన బాబాయి బషీరుద్దీన్ వద్ద పెరిగాడు. 1929లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరాడు. బతకడానికి పెయింటింగ్స్, సినిమా తారల ఫొటోలు అమ్మాడు. ట్యూషన్లు చెప్పాడు, పత్రికల్లో పనిచేశాడు. ఆయన రాసిన 'గోథే ప్రేమ లేఖల'ను 'మక్తబా' అనే స్థానిక ఉర్దూ పత్రిక అచ్చేసింది.

మఖ్దూమ్ కవిగా, నాటక రచయితగా, నటుడిగా ప్రసిద్ధుడయ్యాడు. 1934లో బెర్నార్డ్ షా నాటకానికి 'హోష్ కె నా ఖూన్' అనే ఉర్దూ అనుసరణ రాసి హైద్రాబాద్‌లో రవీంద్రనాథ్ ఠాగూర్ సమక్షంలో ప్రదర్శించాడు. గురుదేవులు ఆ నాటకం చూసి ఆనందం పట్టలేక, నాటక ప్రదర్శన అయిపోగానే స్టేజిపైకి వెళ్ళి మఖ్దూమ్‌ని అభినందించి, తన శాంతినికేతన్‌కు వచ్చి చదువుకోవాల్సిందిగా ఆహ్వానించాడు. హైకోర్టు పక్కన గల సిటీ కాలేజీలో అధ్యాపకుడిగా ఉద్యోగం దొరికింది. కమ్యూనిస్టు రహస్య పత్రిక 'నేషనల్ ఫ్రంట్' సంపాదించి చదివేవాడు.

నాగపూర్ కామ్రేడ్ల సహాయంతో 1930–40లలో హైదరాబాదులో 'స్టూడెంట్స్ యూనియన్' ప్రారంభించాడు. 1940లో తన సహచరులతో కలిసి కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. చంద్ర రాజేశ్వరరావు, గులామ్ హైదర్, రాజ బహుదూర్ గౌర్, హమీదలీ ఖాద్రీ లాంటి నాయకులతో కలిసి



మఖ్దూమ్ మొహియుద్దీన్

పనిచేస్తుండేవాడు. 'రైతుకు రొట్టె నివ్వని పొలమెందుకు, కాల్చేయండి ప్రతి గోధుమ కంకిని!' అనే ఇక్బాల్ కవితను నినదించేవాడు. అక్తర్ హుస్సేన్ రాయ్‌పురి, సిబ్తె హసన్‌లతో కలిసి హైద్రాబాదులో 'అభ్యుదయ రచయితల సంఘం' స్థాపించాడు.

చార్మినార్ సిగరెట్ ఫ్యాక్టరీ, బట్టల గిర్నీ, ఆల్విన్, షాబాద్ సిమెంట్ వంటి అనేక కంపెనీల్లోని కార్మిక సంఘాలకు మఖ్దూమ్ అధ్యక్షుడయ్యాడు. అహోరాత్రులూ వారి సంక్షేమం కోసం కృషి చేశాడు. స్టేట్ అసెంబ్లీలో మాట్లాడినా, బయట కార్మిక సంఘాలలో మాట్లాడినా ఆయన వాగ్ధాటికి ఎదురుం డేది కాదు. నల్లగొండ జిల్లా హుజూర్ నగర్ నుండి శాసనసభకు ఎన్నికయ్యాడు. 1957లో మెదక్ నుండి పార్లమెంట్‌కు పోటీ చేసి ఓడిపోయాడు. శాసనమండలికి ఎన్నికై 1969లో కన్నుమూసే దాకా కమ్యూనిస్టు నేతగా ఆ పదవిలో కొనసాగాడు.

మఖ్దూమ్ బాల్యమంతా మతవిశ్వాసాలకు అనుగుణంగానూ, కష్టాల కడలిగానూ సాగింది. మజీద్‌ను శుభ్రం చేయడం, నీళ్ళు పట్టడం, క్రమం తప్పకుండా ఐదుసార్లు నమాజు చేయడం ఆయన దినచర్యల్లో భాగాలయ్యాయి. మఖ్దూమ్ ప్రతీ ఉదయం ఒక్క పైసాతో తందూరీ రొట్టె తిని సాయంత్రం వరకు గడిపేవాడు. ఆయన మతాన్నీ, మత విశ్వాసాలనూ గౌరవించాడు. మత దురహంకారాన్ని నిరసించాడు. తన చిన్ననాటి కష్టాలను గుర్తుంచుకొని ఆ బాధలు మరెవరికీ రాకూడదనీ, శ్రమజీవుల రాజ్యంతోనే అది సఫలమౌతుందనీ భావించాడు. అందరూ కలిసి భోజనం చేసే 'దస్తర్‌ఖాన్'ల గురించి కల గన్నాడు. హైదరాబాదు రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ శాఖకు తొలి కార్యదర్శి ఆయన. నిజామ్ పాలనకు వ్యతిరేకంగా సాగిన ప్రపంచ ప్రసిద్ధ తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్య పాత్రధారి. సాయుధ పోరాటానికి ముందు కారాగార శిక్షలు, పోరాటం తర్వాత అజ్ఞాత వాసం అనుభవించాడు.

1969 ఆగస్టు 25వ తేదీన గుండెపోటుతో ఢిల్లీలో తుది శ్వాస విడిచాడు. హైదరాబాదు లోని సి.పి.ఐ. తెలంగాణ రాష్ట్ర కార్యాలయానికి 'మఖ్దూమ్ భవన్' అంటూ ఆయన పేరే పెట్టారు. సింగరేణిలో ఏఐటీయూసీ అనుబంధంగా యూనియన్ నిర్మించడంలో మఖ్దూమ్ కీలకంగా వ్యవహరించాడు. మరో యోధుడు దేవూరి శేషగిరి, రాజ్ బహద్దూర్ గౌర్ తదితరులతో కలిసి 'ఎర్రజెండా యూనియన్' నిర్మించాడు. మఖ్దూమ్ సేవలు చిరస్మరణీయం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 99518 65223

(నేడు మఖ్దూమ్ జయంతి)

అసలైన ఆస్తిపాస్తులు



జ్యోతిర్మయం

ఆస్తిపాస్తులు అనగానే మనకు మామూలుగా ధన కనక వస్తు వాహనాలూ, ఇళ్ళూ వాకిళ్లూ, పొలాలూ పుట్రలూ స్ఫురిస్తాయి. కానీ ఆస్తులన్నీ రూపాయలలో విలువకట్టడానికి వీలైన స్థిర చరాస్తుల రూపంలోనే ఉండవు. ఉదాహరణకు, తల్లితండ్రుల పట్ల ప్రేమాదరాలూ, కృతజ్ఞతా చూపిస్తూ, తల్లితండ్రుల సేవ ఒక ముఖ్య కర్తవ్యంగా భావించే సత్సంతానం ఎంత గొప్ప ఆస్తి! అలాంటి సంతానం ఉన్న భాగ్యశాలురకు ఇతర ఆస్తులు వేటితోనూ పని ఉండదు. అలాగే, ఏ ప్రతిఫలమూ ఆశించకుండా, బిడ్డ కోసం తమ సర్వస్వమూ అర్పించేందుకు సర్వదా సిద్ధంగా ఉండే మమతామూర్తులైన తల్లితండ్రులు, బిడ్డలకు దొడ్డ ఆస్తి. అనుకూలంగా ఉండే భర్త (భార్య) నిస్సారమైన జీవితంలో సారం నింపి, జీవితాన్ని జీవించదగ్గ అనుభవంగా మలచిపెట్టే అమూల్యమైన ఆస్తి.

ఆరోగ్యం మహాభాగ్యం. ఆరోగ్యమనే ఆస్తి లేకపోతే, ఇతర ఆస్తులు అన్నీ కలిసి కూడా సంతోషాన్ని సమకూర్చలేవు. అలాగే, విద్య 'నిగూఢ గుప్తమగు విత్తము' అన్నారు. అది కూడా ఉపయోగకరమైన ఆస్తే కదా? ఆ మాట కొస్తే జన్మ సిద్ధమైన మేధాశక్తి ఆస్తి. సౌందర్యం ఆస్తి. ధైర్యం, దయ, దాతృత్వం, శరీర దారుఢ్యం, ప్రతిభా విశేషాలూ, నైపుణ్యాలూ ఇవన్నీ మనిషికి ఆస్తులే అవుతాయి. సహనమూ, శాంతమూ, ప్రియ భాషిత్వమూ, సౌమ్యతా, నిరాడంబరతా లాంటి సద్గుణ సంపత్తి ఎంత విలువైన ఆస్తులో లెక్క గట్టాలంటే... ఇవి లేని వాళ్ళు ఎన్ని ఇతర ఆస్తులున్నా, జీవితంలో తరచుగా అనుభవించే ఘర్షణలూ, యాతనలూ, కడుపు మంటలూ గమనించాలి. కేవలం స్థిర చరాస్తుల మీదే కాదు, సద్గుణ సంపద అనే ఆస్తి మీద కూడా దృష్టి పెట్టి, ఆ సంపద కూడా పెంపు చేసుకొమ్మని పెద్దలు పదే పదే చెప్పేది ఇందుకే!

పైన ప్రస్తావించిన అన్ని రకాల ఆస్తులూ ఎవరికీ ఉండవు. అలాగే, ఏవో కొన్ని ఆస్తులన్నా లేనివాళ్లు కూడా ఎవరూ ఉండరు. ఇదొక సృష్టి వైచిత్రి. లేని ఆస్తుల గురించి ఎప్పుడూ బెంగపడే బదులు, అప్పుడప్పుడూ ఉన్న ఆస్తులను గుర్తించుకొని, కృతజ్ఞత ప్రకటించుకోగలిగితే మనసు చల్లగా ఉంటుంది. ఆ ప్రయత్నం చేయకపోతే, ఆస్తి ఎలా ఉన్నా, ఆనందం మాత్రం 'నాస్తి' అయ్యే ప్రమాదం ఉంది.

– ఎం. మారుతిశాస్త్రి

మీరే సారథులు


సభలో మాట్లాడుతున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

పింఛన్ అందుకునే ప్రతి ఇంటి నుంచీ ఓ స్టార్ క్యాంపెయినర్ రావాలి

దెందులూరు సిద్ధం సభలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: 'రాష్ట్రంలో మరో చారిత్రక విజయాన్ని అందుకునేందుకు మీరంతా సిద్ధమేనా? ఇంటింటి చరిత్రను, పేదింటి భవిష్యత్‌ను మరింత గొప్పగా మార్చే పరిపాలన అందించేందుకు, మన పార్టీని మరోసారి గెలిపించుకునేందుకు మీరంతా సిద్ధమా? పేదల భవిష్యత్‌ను, పేదలని కాటేసే ఎల్లో వైరస్ మీద కనిపిస్తున్న కరోనా లాంటి ఆ దుష్టచతుష్టయం మీద యుద్ధానికి, ఓ మహా సంగ్రామానికి ప్రతి ఒక్కరూ సిద్ధమేనా?' అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల్లోని 50 నియోజకవర్గాల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అశేష జనవాహినిని ప్రశ్నించారు. పేదల భవిష్యత్తును, సంక్షేమాన్ని నిర్దేశించే ఈ ఎన్నికలు ఎంత ముఖ్యమో ప్రతి గడపకూ వెళ్లి వివరించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోను మనం ఒక బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావించి, అందులో చెప్పిన 99 శాతం హామీలు నెరవేర్చిన తరుణంలో ఈ ఎన్నికల సంగ్రామానికి మీరే సారథులు అని స్పష్టం చేశారు. మంచి కొనసాగాలంటే మళ్లీ మనందరి ప్రభుత్వాన్ని తెచ్చుకోవాలన్నారు. శనివారం ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో ఎన్నికల శంఖారావం 'సిద్ధం' సభలో పాల్గొని ప్రసంగించారు. రామాయణం, మహాభారతం..ఈ రెండింటిలో ఉన్న విలన్లంతా.. ఓ చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5, దత్తపుత్రుడి రూపంలో, ఇతర పార్టీల్లో ఉన్న చంద్రబాబు కోవర్టుల రూపంలో ఉన్నారన్నారు. ఇంత మంది తోడేళ్లలా ఏకమై మీ జగన్ చుట్టూ బాణాలు పట్టుకుని రెడీగా ఉన్నారని చెప్పారు. 'వారి వైపు నుంచి చూస్తే ఈ సీను ఎలా కనిపిస్తుందంటే.. ఇన్ని తోడేళ్ల మధ్య జగన్ ఒంటరి వాడిలా కనిపిస్తాడు. కానీ ఇన్ని కోట్ల మంది హృదయాలలో మీ జగన్‌కు మీరు స్థానమిచ్చి, మీ ఇంటి బిడ్డగా మీ గుండెల్లో ఉంచుకున్నారన్నదే నిజం. జగన్ ఏనాడూ ఒంటరి కాదు. వారికి ఎల్లో పత్రికలు, టీవీలు, పొత్తుల సైన్యం తోడుగా ఉంటే నాకున్న తోడు, నా ధైర్యం, నా బలం.. పైనున్న ఆ దేవుడు, నన్ను గుండెల్లో పెట్టుకున్న మీరు. ఇది నాయకుడి మీద ఉన్న నమ్మకంతో పుట్టిన సైన్యం. ఒక నాయకుడిని ప్రజలు నమ్మారు అంటే వాళ్ల స్పందన, ప్రేమ ఎలా ఉంటుందో చెప్పడానికి ఇక్కడ కనిపిస్తున్న నా అన్నదమ్ములు, అవ్వాతాతలు, నా కుటుంబ సైన్యమే నిదర్శనం' అని అన్నారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

మీ జగన్‌కు ఉన్న సైన్యం, బలం.. దేవుడు, ప్రజలే

- 57 నెలల్లో జరిగిన మంచిపై పెత్తందారులు దాడి చేస్తున్నారు
- సంక్షేమాభివృద్ధిపై దండయాత్ర చేస్తున్నారు
- 14 ఏళ్లలో చంద్రబాబు ఏం చేశాడని ప్రతి ఇంటికీ వెళ్లి అడగండి
- ఎన్నికల మేనిఫెస్టోకు విశ్వసనీయత మన హయాంలోనే
- ప్రతిపక్షాలకు ఓటు వేస్తే మళ్లీ లంచాల వ్యవస్థ వస్తుంది

14 ఏళ్లు సీఎంగా ఉండీ ఏం చేశారని అడగండి

- గోదారమ్మ సీమలో నిలబడి మనకు, ప్రతిపక్షానికి మధ్య ఉన్న తేడాను, ప్రతి కుటుంబానికి మనం చేసిన మంచిని వివరించడానికి మీ వద్దకు వచ్చాను. ఇంటింటా మనం చేసిన అభివృద్ధి, గ్రామంలో మనం తెచ్చిన మార్పు, లంచాలు, వివక్షకు తావు లేకుండా తెచ్చిన వ్యవస్థ, చరిత్రలో ఎప్పుడూ, ఎక్కడా చూడని విధంగా జరిగిన సామాజిక న్యాయం.. వీటన్నింటికీ మనందరి ప్రభుత్వమే కేరాఫ్ అడ్రస్. ఈ మాటను ప్రతి అభిమాని, ప్రతి కార్యకర్త కాలర్ ఎగరేసి చెప్పడానికి, కావాల్సినన్ని అంశాలు పంచుకోవడానికి, తిరుగులేని ఆత్మవిశ్వాసంతో 175కు 175 ఎమ్మెల్యేలు.. 25కు 25 ఎంపీలు గెలవాల్సిన అవసరాన్ని వివరించేందుకు మీ వాడిగా, మీ ముందుకు వచ్చి నా మనసు పంచుకుంటున్నా. నా మాటలు అన్నింటినీ ప్రతి ఇంటికీ తీసుకువెళ్లి ప్రతి ఒక్కరితో పంచుకోవాలి.
- 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రజల కోసం ఏం చేశాడు? అని గ్రామాల్లోకి వెళ్లినప్పుడు అమ్మ, అక్క, అన్న, తమ్ముళ్లను అడగండి. గత 10 ఏళ్లుగా వారి బ్యాంకు అకౌంటు వివరాలను వారినే చూడమని చెప్పి అడగండి. ఆ పదేళ్లు.. అంటే చంద్రబాబు 5 సంవత్సరాలు, మీ బిడ్డ జగన్ పాలనలో 5 ఏళ్లు.. బ్యాంకు అకౌంటు వివరాల్లో అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో ఎంత డబ్బులు పడిందన్నది వారినే చూడమనండి. 1994, 1999, 2014లో ఇచ్చిన టీడీపీ మేనిఫెస్టోలో ఏనాడైనా 10% అమలు చేశాడా అని అడగండి.

ఈ మార్పును ప్రతి ఇంటా వివరించాలి

- మీ బిడ్డ జగన్ 57 నెలల్లో ఏం చేశారనేది ప్రతి ఇంట్లో వివరించండి. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ఏ గ్రామం తీసుకున్నా, అభివృద్ధి కళ్లకు కనిపిస్తుంది. ప్రతి నెలా 1వ తేదీ ఉదయాన్నే ఇంటికే వచ్చి చిక్కటి చిరునవ్వులతో తలుపుతట్టి.. అవ్వాతాతలు, వితంతువులు, వికలాంగులు.. ఇలా ఏకంగా 66 లక్షల కుటుంబాలను ఆప్యాయంగా పలకరించి, వారి చేతిలో 3 వేల పెన్షన్ పెడుతున్నది మన ప్రభుత్వమే.
- లంచాలు, వివక్షకు నాటి జన్మభూమి కమిటీలు మారుపేరు. ఈ రోజు ఏ గ్రామంలో కూడా అలా లంచాలు, వివక్ష లేకుండా సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ తెచ్చింది మీ జగనే. డీబీటీ ద్వారా నేరుగా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి డబ్బులు పంపుతున్నదీ మీ జగన్, మీ ప్రభుత్వమే.
- మీ గ్రామంలో గవర్నమెంట్ బడి, ప్రభుత్వ ఆస్పత్రి మారటానికి నాడు-నేడు చేసినది, చేస్తున్నది మీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. గవర్నమెంట్ బడిలో ఇంగ్లిషు మీడియం, బైలింగ్వల్ టెక్స్ట్ బుక్కులు, చిన్నారుల చేతుల్లో ట్యాబ్‌లు, డిజిటల్ బోధన, క్లాస్ రూముల్లో ఐఎఫ్‌పీలు, సీబీఎస్‌ఈ, ఐబీ వరకు ప్రయాణం అంటే గుర్తుకొచ్చేది మీ జగనే.
- రైతు భరోసా, ఆర్బీకేల ద్వారా రైతన్నను చేయి పట్టుకుని నడిపించేదీ మీ వైఎస్సార్‌సీపీనే. పేదలు, రైతన్నలకు మంచి చేస్తూ అసైన్డ్ భూముల మీద, 22ఏ భూములు 35 లక్షల ఎకరాల మీద శాశ్వత భూ హక్కులు ఇచ్చింది మీ జగనే. నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అంటూ ఈ 57 నెలల్లో అందించిన రూ.2.55 లక్షల కోట్లలో ఏకంగా 75% పైగా ఈ వర్గాలకే అందించి దేశంలోనే రికార్డు సృష్టించింది మీ జగన్ ప్రభుత్వమే.


2.13 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం

- గత ప్రభుత్వ హయాంలో 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలుంటే.. మీ బిడ్డ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2.13 లక్షల ఉద్యోగాలు ఇచ్చాడు. అందులోనూ 80 శాతం నేను నా.. నా.. అని పిలుచుకొనే నా చెల్లెమ్మలు, తమ్ముళ్లు కనిపిస్తున్నారు. అక్కచెల్లెమ్మలను లక్షాధికారులుగా చేయాలని, వారికి గూడు ఉండాలని ఏకంగా 31 లక్షల ఇళ్లపట్టాలు ఇచ్చిందీ మీ జగనే. అందులో 22 లక్షల ఇళ్లు కడుతున్నదీ మన ప్రభుత్వమే. అమ్మ ఒడి, పిల్లలకు అండగా ఉంటూ విద్యా దీవెన, వసతి దీవెన, అక్కచెల్లెమ్మలకు ఆసరా, చేయూత, సున్నా వడ్డీ.. కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, దిశ యాప్.. మొత్తంగా మహిళా సాధికారత.. ఇవన్నీ మన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే.
- ప్రతి గ్రామంలో ఇవాళ ఒక మహిళా పోలీస్, విలేజ్ క్లినిక్ కనిపిస్తుంది. ఆ గ్రామానికి ఫ్యామిలీ డాక్టర్ వచ్చారు. ప్రతి ఇంట్లోనూ జల్లెడ పడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేస్తూ, వైద్యం చేసి, మందులిస్తున్నది మీ బిడ్డ పాలనలోనే. 108, 104, ఆరోగ్యశ్రీ, రైతన్నలకు ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు తీసుకొచ్చింది మహానేత దివంగత నేత వైయస్ రాజశేఖరరెడ్డి అయితే, వాటిని మరో నాలుగు అడుగులు ముందుకు వేయిస్తున్నది మీ బిడ్డ హయాంలోనే.

ప్రతి ఇంటి నుంచి స్టార్ క్యాంపెయినర్

- ఈ ఎన్నికలు ఎంత ముఖ్యం అనేది ప్రతి అవ్వాతాతకు, అక్కాచెల్లెమ్మకు, అన్నదమ్ములందరికీ చెప్పాలి. ప్రతి కుటుంబం, ప్రతి సామాజిక వర్గం, ప్రతి ప్రాంతం భవిష్యత్, రైతన్న భవిష్యత్, అక్కచెల్లెమ్మల సంక్షేమం, ఇంటింటా అభివృద్ధి, పిల్లల భవిష్యత్ అన్నీ ఈ ఎన్నికలతో ముడిపడి ఉన్నాయని ప్రతి ఒక్కరూ గమనించండి. చదువు, వైద్యం కోసం పేదవాడు అప్పులపాలు కాకుండా ఉండాలన్నా అది మనందరి ప్రభుత్వం మాత్రమే ఆ పని చేయగలదని ఇంటింటికీ వెళ్లి చెప్పండి.
- అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులు, వైద్య సేవలు అందుకుంటున్న వారు, ఇలా ప్రతి ఇంట్లో నుంచి ఒకరు స్టార్ క్యాంపెయినర్లుగా రావాలని చెప్పండి. బయటకొచ్చి ప్రతి ఒక్కరూ కనీసం 100 మందితో జరుగుతున్న మంచి గురించి చెప్పాలని వివరించండి. మంచి కొనసాగాలంటే జగనన్న ఉంటేనే సాధ్యం అని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పాలి. అమ్మ ఒడి, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, సున్నా వడ్డీ, సొంతిల్లు.. ఇవన్నీ కొనసాగాలంటే అక్కచెల్లెమ్మలే స్టార్ క్యాంపెయినర్లుగా బయటకు రావాలని చెప్పండి. పిల్లల తల్లిదండ్రులంతా మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా ఉండాలని చెప్పండి. రైతు భరోసా కొనసాగాలన్నా, ప్రతి రైతన్నకూ మెరుగైన ఆర్బీకే సేవలు అందాలన్నా, ఉచితంగా ఇన్సూరెన్స్ రావాలన్నా, ఇన్‌పుట్ సబ్సిడీ దొరకాలన్నా, పగటిపూటే ఉచిత విద్యుత్, దళారీ వ్యవస్థ పోయి రైతన్నకు మద్దతు ధర అందాలన్నా.. కేవలం జగనన్న మాత్రమే చేయగలడని.. ప్రతి రైతన్న స్టార్ క్యాంపెయినర్ కావాలని చెప్పండి.

భువనగిరిలో ఇద్దరు
టెన్త్ విద్యార్థినుల ఆత్మహత్య
హాస్టల్ గదిలో ఉరేసుకున్న స్నేహితులు


విద్యార్థులు రాసిన సూసైడ్ నోట్

సాక్షి, యాదాద్రి, భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని హబ్సిగూడకు చెందిన భవ్య (15), వైష్ణవి (15) భువనగిరిలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఉంటూ భువనగిరి పట్టణంలోని బీచ్ మహల్లా ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నారు. స్నేహితులైన వీరిద్దరూ తమను వేధింపులకు గురి చేశారంటూ అదే హాస్టల్‌లో ఉంటున్న 7వ తరగతి విద్యార్థినులు నలుగురు.. పాఠశాల పీఈటీకి ఫిర్యాదు చేశారు. ఆమె హాస్టల్ వార్డెన్ శైలజకు సమాచారం ఇచ్చారు. ఆమె భవ్య, వైష్ణవిలను మందలించడంతో పాటు హాస్టల్‌లో జూనియర్, సీనియర్ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అంతేగాకుండా భవ్య, వైష్ణవిల తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం చేరవేశారు. విషయం బయటకి తెలియడంతో భయాందోళనలకు గురయ్యారు. శనివారం సాయంత్రం వీరి గదిలో ఉండే ఇతర విద్యార్థినులు ట్యూషన్‌కి వెళ్లగా .. భవ్య, వైష్ణవి మాత్రం తర్వాత వస్తామని చెప్పి గదిలోనే ఉండిపోయారు. అయితే వారిని తీసుకురావాలని ట్యూషన్ టీచర్ తోటి విద్యార్థినులను గదికి పంపించారు.

యూనిఫాం చున్నీలతో ఉరేసుకుని..

గదికి వెళ్లిన విద్యార్థినులు తలుపు తెరుచుకోకపోవడంతో కిటికీ నుంచి చూడగా భవ్య, వైష్ణవి ఫ్యాన్‌కు పాఠశాల యూనిఫాం చున్నీలతో ఉరి వేసుకుని కన్పించారు. వారు వెంటనే ట్యూషన్ టీచర్ విషయం చెప్పారు. వార్డెన్, ఇతర సిబ్బంది తలుపు బలవంతంగా తీసి ఇద్దర్నీ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే వారు మరణించారని వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం మార్చురీకి తరలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పట్టణ సీఐ సురేష్ కుమార్ తెలిపారు.

మమ్మల్ని ఒకే దగ్గర సమాధి చేయాలి

టెన్త్ విద్యార్థినుల గదిలో దొరికిన సూసైడ్ నోట్‌ను తోటి విద్యార్థినులు పోలీసులకు అప్పగించారు. 'మేము వెళ్లిపోతున్నందుకు అందరూ మమ్మల్ని క్షమించండి. మేము చేయని తప్పుకు అందరూ మమ్మల్ని అంటుంటే ఆ మాటలు పడలేక పోతున్నాం. మా శైలజ మేడం తప్ప ఎవ్వరూ మమ్మల్ని నమ్మలేదు. మా బాధ ఎవరికీ చెప్పుకోలేక వెళ్లిపోతున్నాం. మా ఇద్దరినీ ఒకేచోట సమాధి చేయండి. మా ఆఖరి కోరిక ఇది..' అంటూ భవ్య, వైష్ణవి నోట్ రాశారు. భవ్య 3 వతరగతి నుంచి ఇదే వసతి గృహంలో ఉంటున్నట్లు తెలిసింది. ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన వీరి తల్లిదండ్రులు హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. ఏడవ తరగతి విద్యార్థినులు ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో భవ్య, వైష్ణవికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వార్డెన్ శైలజ తెలిపారు. కాగా ఈ ఘటనపై వసతి గృహంలోని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య గొడవలు జరిగాయని తెలుస్తోంది.

శ్రీ వేంకటేశ్వర ధార్మిక సదస్సు ప్రారంభం



తిరుమల: తిరుమల ఆస్థాన మండపంలో శనివారం శ్రీ వేంకటేశ్వర ధార్మిక సదస్సు ఘనంగా ప్రారంభమైంది. ఫిబ్రవరి 5 వరకు ఈ సదస్సు జరుగనుంది. తొలి రోజు సదస్సులో 25 మంది పీఠాధిపతులు, మఠాధిపతులు, స్వామీజీలు పాల్గొన్నారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ప్రారంభోపన్యాసం చేయగా..ఈవో ఏవీ ధర్మారెడ్డి కార్యక్రమ సందర్భ పరిచయం చేశారు. టీటీడీ ధార్మిక కార్యక్రమాలపై ఎస్వీబీసీ రూపొందించిన 40 నిమిషాల ఆడియో విజువల్‌ను ప్రదర్శించారు.

బాల్యం గుర్తొచ్చింది
స్పోర్ట్స్, గేమ్ మీట్‌లో డీజీపీ రవి గుప్తా



గచ్చిబౌలి (హైదరాబాద్): క్రీడా పోటీలను చూస్తుంటే తన చిన్ననాటి రోజులు గుర్తుకు వచ్చాయని డీజీపీ రవి గుప్తా పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో శనివారం నిర్వహించిన 6వ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్ మీట్ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు.. క్రీడలు ఒత్తిడిని దూరం చేస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌ను ఆయన అభినందించారు. సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి మాట్లాడుతూ క్రీడలు నాయకత్వ లక్షణాలు, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయన్నారు. మొత్తం 33 ఈవెంట్లలో 9 టీమ్‌లు పాల్గొన్నాయి. విజేతలకు డీజీపీ బహుమతులను అందజేశారు. అంతకు ముందు క్రికెట్ ప్రాక్టీస్ నెట్, ఓపెన్ జిమ్‌లను ఆయన ప్రారంభించారు.

ఎయిర్‌క్రాఫ్ట్‌లో మంటలంటుకుని
అధికారి మృతి

అల్వాల్ (హైదరాబాద్): హకీంపేట ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో ఎయిర్‌క్రాఫ్ట్‌కు రిపేర్ చేస్తుండగా మంటలు అంటుకొని ఆఫీసర్ మృతిచెందిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చెందిన ఆఫీసర్ హర్‌వీర్ చౌదరి(సీపీఎల్ ర్యాంక్) స్టేషన్‌లో మధ్యాహ్నం యూ-736 కిరణ్ ఎయిర్‌క్రాఫ్ట్‌కు రిపేర్ చేస్తుండగా ఒక్కసారిగా దానికి మంటలు అంటుకున్నాయి. ప్రమాదంలో హర్‌వీర్ చౌదరి తలకు తీవ్రగాయాలై మృతి చెందాడు. ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధిలో రెవెన్యూ పాత్ర కీలకం
సచివాలయంలో సమావేశమైన పొంగులేటి, కేరళ మంత్రి రాజన్



సాక్షి, హైదరాబాద్: కేరళ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి కె.రాజన్, తెలంగాణ రెవెన్యూ, హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం సచివాలయంలో భేటీ అయ్యారు. రెండు రాష్ట్రాల్లో ఆయా శాఖల పనితీరుపై వారిద్దరూ చర్చించారు. కేరళలో అమలవుతోన్న హౌసింగ్ స్కీంలతో పాటు ఆ రాష్ట్రంలోని రెవెన్యూ శాఖ పనితీరు గురించి మంత్రి పొంగులేటి అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత తెలంగాణలోని హౌసింగ్, రెవెన్యూ శాఖల పనితీరును రాజన్‌కు వివరించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో రెవెన్యూ పాత్ర కీలకమైందని, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఈ శాఖ వారధిగా ఉంటుందని ఇరువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో తెలంగాణ రెవెన్యూ వ్యవస్థ గాడితప్పిందని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పులను సరిచేసి, రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే దిశలో ముందుకెళుతున్నామని రాజన్‌కు వివరించారు.

గ్యాస్ సిలిండర్‌లో నీళ్లు!
కంగుతిన్న వినియోగదారుడు


గ్యాస్ సిలిండర్ నుంచి బయటకు వస్తున్న నీళ్లు

మొయినాబాద్: వంటగ్యాస్ సిలిండర్‌లో గ్యాస్‌కు బదులు నీళ్లు ఉండటంతో ఓ వినియోగదారుడు కంగుతిన్నాడు. సిలిండర్ తీసుకుని ఏజెన్సీ కార్యాలయానికి వచ్చి నిర్వాహకులను నిలదీశాడు. మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లికి చెందిన పల్లె శేఖర్ వారం క్రితం గ్రామానికి వచ్చిన గ్యాస్ ఏజెన్సీ ఆటో నుంచి సిలిండర్ తీసుకున్నాడు. శనివారం స్టవ్ వెలిగించేందుకు ప్రయత్నించగా మంటరాలేదు. దీంతో బండను ఊపి చూడగా అందులో నీళ్లు ఉన్నట్లు శబ్దం వచ్చింది. దీంతో మొయినాబాద్‌లోని ఇండేన్ గ్యాస్ ఆఫీసుకు సిలిండర్ తీసుకువచ్చి, అందులో నీళ్లు ఉన్నాయని నిర్వాహకులను నిలదీశాడు. వారి ముందే అందులోంచి నీళ్లను బయటకు తీసి చూపించాడు. సిలిండర్‌లోకి నీళ్లు ఎలా వచ్చాయో తమకు తెలియదని, గ్యాస్ రీఫిల్లింగ్ చేసే కంపెనీలోనే ఏదైనా పొరపాటు జరిగి ఉండవచ్చని నిర్వాహకులు అతనికి సర్ది చెప్పి మరో గ్యాస్‌బండ ఇచ్చారు. సిలిండర్ నుంచి నీళ్లు వస్తున్న వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది.

17 సీట్లు.. 306 దరఖాస్తులు
కాంగ్రెస్ ఎంపీ టికెట్ల కోసం భారీ డిమాండ్

- కుటుంబ సభ్యులు, సన్నిహితులను రంగంలోకి దించిన ముఖ్య నేతలు
- చివరిరోజు మల్లు నందిని, కుసుమకుమార్ సహా పలువురు ప్రముఖుల దరఖాస్తు
- దరఖాస్తుల గడువు పూర్తి.. ఈనెల 6లోగా షార్ట్‌లిస్ట్ కానున్న జాబితా


హైదరాబాద్ శివార్లలో మల్లు నందినికి స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

సాక్షి, హైదరాబాద్: అధికార కాంగ్రెస్‌లో లోక్‌సభ టికెట్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. టికెట్ల కోసం టీపీసీసీ దరఖాస్తులను ఆహ్వానించగా గడువు ముగిసే సమయానికి 306 దరఖాస్తులు వచ్చినట్లు గాంధీ భవన్ వర్గాలు వెల్లడించాయి. తొలి రెండు రోజుల్లో 41 దరఖాస్తులు రాగా శుక్రవారం 100 దరఖాస్తులు, శనివారం ఏకంగా 165 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చినప్పటికీ భువనగిరి, నల్లగొండ, ఖమ్మం, మహబూబాబాద్, పెద్దపల్లి, వరంగల్, నల్లగొండ స్థానాలకు ఎక్కువ డిమాండ్ కనిపిస్తోంది. శనివారం దరఖాస్తు చేసుకున్న ప్రముఖుల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్ (ఖమ్మం), చెన్నూరు ఎమ్మెల్యే జి. వివేక్ కుమారుడు గడ్డం వంశీకృష్ణ, రేవంత్‌రెడ్డి సన్నిహితుడు పటేల్ రమేశ్ రెడ్డి (నల్లగొండ), టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ (భువనగిరి), రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అనుచరుడు పిడమర్తి రవి (వరంగల్), టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు (మెదక్), సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం (కరీంనగర్) తదితరులున్నారు.

బరిలోకి బంధుగణం..

గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న లోక్‌సభ స్థానాలకు పార్టీలోని ముఖ్య నేతలు దరఖాస్తు చేసుకున్నారు. ఆయా స్థానాల్లో మంత్రులు, ఇతర ముఖ్య నేతల బంధువులు, వారి సన్నిహితులు రంగంలోకి దిగారు. దరఖాస్తుదారుల్లో గడ్డం వంశీ, ఊట్ల వరప్రసాద్, గోమాస శ్రీనివాస్, పెరిక శ్యామ్ (పెద్దపల్లి), సిరిసిల్ల రాజయ్య, మోత్కుపల్లి నర్సింహులు, సర్వే సత్యనారాయణ, నమిండ్ల శ్రీనివాస్ (వరంగల్), మల్లు రవి, ఎస్. సంపత్ కుమార్ (నాగర్‌కర్నూల్), కుందూరు రఘువీర్, పటేల్ రమేశ్‌రెడ్డి (నల్లగొండ), చామల కిరణ్, కోమటిరెడ్డి పవన్, కుంభం కీర్తిరెడ్డి, చనగాని దయాకర్, పున్నా కైలాశ్‌నేత (భువనగిరి), జగ్గారెడ్డి, సోమేశ్వరరెడ్డి (మెదక్), బండ్ల గణేశ్, దిలీప్ కుమార్, హరివర్ధన్‌రెడ్డి, సర్వే సత్యనారాయణ (మల్కాజిగిరి), బలరాం నాయక్, బెల్లయ్య నాయక్ (మహబూబాబాద్), వి. హనుమంతరావు, రేణుకాచౌదరి, మల్లు నందిని, పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, వి.వి. రాజేంద్రప్రసాద్ (ఖమ్మం) ఉన్నారు. దరఖాస్తుల గడువు ముగియడంతో ఈ నెల 6లోగా టీపీసీసీ ఎన్నికల కమిటీ సమావేశమై వాటిని షార్ట్‌లిస్టు చేస్తుందని, ఆ జాబితాను ఏఐసీసీ నియమించిన తెలంగాణ స్క్రీనింగ్ కమిటీకి అందజేస్తుందని గాంధీ భవన్ వర్గాలు తెలిపాయి.

నిర్లక్ష్యపు డ్రైవింగ్ కేసులో
స్టే ఇవ్వలేం
సాహిల్ కేసుపై తేల్చిచెప్పిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్‌పై నమోదైన నిర్లక్ష్యపు డ్రైవింగ్ కేసులో ఎలాంటి స్టే ఇవ్వలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. గత నెల ప్రగతిభవన్ ఎదురుగా ఉన్న బారికేడ్లను ఢీకొన్న కేసులో సాహిల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి అతనితోపాటు మరికొందరు పరారీలోనే ఉన్నారు. వారు దుబాయ్ పారిపోయి ఉంటారనే అనుమానాల నేపథ్యంలో లుక్‌ఔట్ నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో తమపై పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ నిందితుడు అబ్దుల్ ఆసిఫ్, మరో ఐదుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎలాంటి సాక్ష్యాలు లేకున్నా తమపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున వివేకానంద వాదనలు వినిపిస్తూ.. అరెస్టు సహా ఎలాంటి కఠిన చర్యలు చేపట్టకుండా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పీపీ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లకు ఎలాంటి ఉపశమనం ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పోలీసులు, మరికొందరు అధికారుల సాయంతో వారు దుబాయ్ పారిపోయారని, అక్కడి నుంచి పిటిషన్లు వేయడాన్ని అనుమతించవద్దని కోరారు. దుబాయ్ ఎంబసీ అనుమతి లేకుండా వేసిన వీరి పిటిషన్లపై కూడా అనుమానాలున్నాయని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. విచారణపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 9కి వాయిదా వేసింది.

యూరప్‌లోనూ రోడ్డెక్కిన రైతు

పలు దేశాల్లో ఆందోళనలు | నానా సమస్యలతో సతమతం | పరిష్కారం కోసం పోరాటపథం

సాగు గిట్టుబాటు కావడం లేదంటూ రైతులు పెద్ద ఎత్తున ఆందోళన బాట పట్టారు. భారత్‌లో కాదు, యూరప్‌లో! అవును. రైతుల నిరసనలు, ఆందోళనలతో కొద్ది వారాలుగా యూరప్ దేశాలన్నీ ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. రెండేళ్లుగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధంతో యూరప్ దేశాల్లో అసలే జీవన వ్యయం ఊహించనంతగా పెరిగిపోయింది. దీనికి తోడు గాజాపై ఇజ్రాయెల్ యుద్ధంతో కొద్ది నెలలుగా పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఇవి చాలవన్నట్టు సాగు వ్యయం విపరీతంగా పెరిగిపోయింది. పన్నుల భారం మోయలేనంతగా మారింది. ఇలాంటి అనేకానేక సమస్యలు యూరప్ వ్యాప్తంగా రైతులను కుంగదీస్తున్నాయి. ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలే సమస్యకు ప్రధాన కారణమంటూ వారు గగ్గోలు పెడుతున్నారు. ఉక్రెయిన్‌ను కాపాడే ప్రయత్నంలో తమ ఉసురు తీస్తున్నారంటూ మండి పడుతున్నారు. పరిష్కారం కోసం ప్రాధేయపడ్డా ఫలితం లేకపోవడంతో పలు దేశాల్లో రైతులు వేలాదిగా ఆందోళన బాట పట్టారు. ఏకంగా వేల కొద్దీ ట్రక్కులు, ట్రాక్టర్లతో రోడ్డెక్కుతున్నారు. పట్టణాలు, రాజధానులను దిగ్బంధిస్తున్నారు. నడిరోడ్లపై టైర్లను, గడ్డి మోపులను కాలబెడుతున్నారు. ప్రభుత్వాల తీరు తమ పొట్ట కొడుతోందంటూ నిరసనలు, నినాదాలతో హోరెత్తిస్తున్నారు. కొద్ది వారాలుగా పారిస్, బెర్లిన్ మొదలుకుని ఏ నగరంలో చూసినా, ఏ ఐరోపా దేశంలో చూసినా ఇవే దృశ్యాలు!! ఫిబ్రవరి 1న రైతులు ఏకంగా యూరోపియన్ పార్లమెంటు భవనంపైకి గుడ్లు విసరడం, రాళ్లు రువ్వారు! పలు దేశాల్లో పరిస్థితులు రైతుల అరెస్టుల దాకా వెళ్తున్నాయి...

– సాక్షి, నేషనల్ డెస్క్

రైతుల సమస్యలు ఇవీ...

- యూరప్ దేశాలన్నింట్లోనూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్లో ప్రధానమైనది గిట్టుబాటు ధర లేమి.
- దీనికి తోడు ఏడాదిగా వారిపై పన్నుల భారం బాగా పెరిగిపోయింది. ఆకాశాన్నంటుతున్న పంట బీమా ప్రీమియాలు దీనికి తోడయ్యాయి.
- విదేశాల నుంచి, ముఖ్యంగా ఉక్రెయిన్ నుంచి చౌకగా దిగుమతవుతున్న ఆహారోత్పత్తులతో వారి ఉత్పత్తులకు గిరాకీ పడిపోతోంది.
- దక్షిణ అమెరికా దేశాల నుంచి చక్కెర, ఆహార ధాన్యాలతో పాటు మాంసం తదితరాల దిగుమతిని మరింతగా పెంచుకునేందుకు ఈయూ తాజాగా ఒప్పందం కుదుర్చుకుంది.
- అధికారుల అవినీతి, సకాలంలో సాయం చేయడంలో అలసత్వం మరింత సమస్యగా మారుతోంది.
- ఈయూ విధిస్తున్న పర్యావరణ నిబంధనలు మరీ శ్రుతి మించుతున్నాయన్న భావన అన్ని దేశాల రైతుల్లోనూ నెలకొంది.
- పర్యావరణ పరిరక్షణకు ప్రతి రైతూ 4 శాతం సాగు భూమిని నిర్ణీత కాలం ఖాళీగా వదిలేయాలన్న నిబంధనను యూరప్ దేశాలన్నీ అమలు చేస్తున్నాయి.
- పైగా పలు దేశాలు ఏటా పంట మార్పిడినీ తప్పనిసరి చేశాయి. రసాయన ఎరువుల వాడకాన్ని 20 శాతం తగ్గించాలంటూ రైతులపై ఒత్తిడి తీవ్రతరమవుతోంది.
- సాగు అవసరాలకు వినియోగిస్తున్న పెట్రోల్, డీజిల్‌పై సబ్సిడీ ఎత్తేయాలన్న నిర్ణయం. దీంతో సాగు వ్యయం విపరీతంగా పెరుగుతోందంటూ చాలా యూరప్ దేశాల్లో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ముఖ్యంగా యూరప్‌లో అతి పెద్ద వ్యవసాయ ఉత్పత్తిదారులైన జర్మనీ, ఫ్రాన్స్ రైతులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.
- పోర్చుగల్ నుంచి చౌకగా వచ్చి పడుతున్న వ్యవసాయోత్పత్తులు తమ పుట్టి ముంచుతున్నాయంటూ స్పెయిన్ రైతులు వాపోతున్నారు.
- నిధుల లేమి కారణంగా ఈయూ సబ్సిడీలు సకాలంలో అందకపోవడం రైతులకు మరింత సమస్యగా మారింది.



జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో శనివారం ట్రాక్టర్లతో రైతుల ర్యాలీ

ఇవీ డిమాండ్లు...

- ఆహారోత్పత్తుల దిగుమతులకు ఈయూ అడ్డుకట్ట వేయాలి.
- ఉక్రెయిన్ ఆహారోత్పత్తులను ప్రధానంగా ఆసియా దేశాలకు మళ్లించేలా చూడాలి.
- ముఖ్యంగా ఉక్రెయిన్ నుంచి పౌల్ట్రీ, గుడ్లు, చక్కెర దిగుమతులను నిలిపేయాలి.
- సాగుపై ప్రభుత్వపరంగా పన్నుల భారాన్ని తగ్గించాలి.
- 4% భూమిని ఖాళీగా వదలాలన్న నిబంధనను ఎత్తేయాలి.
- పలు పర్యావరణ నిబంధనలను వీలైనంతగా సడలించాలి.
- పెట్రోల్, డీజిల్‌పై సాగు సబ్సిడీలను కొనసాగించాలి.

ఆందోళనలు ఏయే దేశాల్లో...

జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, బెల్జియం, పోలండ్, స్పెయిన్, రొమేనియా, గ్రీస్, పోర్చుగల్, హంగరీ, స్లొవేకియా, లిథువేనియా, బల్గేరియా

ఇమ్రాన్, ఆయన భార్యకు ఏడేళ్ల జైలు



ఇస్లామాబాద్: అతి త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న వేళ పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్(71)కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇస్లామ్ నిబంధనలకు విరుద్ధంగా పెళ్లి చేసుకున్న ఆరోపణలపై ఇమ్రాన్‌కు, ఆయన భార్య బుష్రా బీబీ(49)కి ఓ కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. రెండు పెళ్లిళ్ల మధ్య విరామం పాటించాలనే నిబంధనకు విరుద్ధంగా బుష్రా బీబీ ఇమ్రాన్ ఖాన్‌ను రెండో పెళ్లి చేసుకుందని ఆరోపిస్తూ ఆమె మాజీ భర్త ఖవార్ ఫరీద్ మనేకా కేసు పెట్టారు. వివాహానికి ముందు నుంచే వారిద్దరి మధ్య అక్రమ సంబంధం నడిచిందని కూడా ఆయన పేర్కొన్నారు. ఈ కేసుపై ప్రస్తుతం ఇమ్రాన్, బుష్రా బీబీ ఉన్న అడియాలా జైలులోనే 14 గంటలపాటు విచారణ జరిపిన సీనియర్ సివిల్ జడ్జి ఖుద్రతుల్లా.. ఏడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ శనివారం తీర్పు వెలువరించినట్లు జియో న్యూస్ పేర్కొంది. తోషఖానా కేసులో 14 ఏళ్లు, రహస్య పత్రాల కేసులో 10 ఏళ్ల జైలు శిక్షను ఇమ్రాన్‌కు విధిస్తూ ఇటీవలే కోర్టులు తీర్పిచ్చిన విషయం తెలిసిందే. ఫెయిత్ హీలర్‌గా పేరున్న బుష్రాబీబీ వద్దకు తరచూ ఇమ్రాన్ వెళుతుండేవారు. అలా మొదలైన వారిద్దరి మధ్య పరిచయం పరిణయానికి దారి తీసింది. 2018 జనవరి ఒకటో తేదీన ఇమ్రాన్, బుష్రాబీబీల వివాహం ఘనంగా జరిగింది.

ఇరాక్, సిరియాల్లోని లక్ష్యాలపై అమెరికా దాడులు

వాషింగ్టన్: ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, అనుబంధ మిలీషియా గ్రూపులే లక్ష్యంగా ఇరాన్, సిరియాల్లోని 85 లక్ష్యాలపై వైమానిక దాడులు జరిపినట్లు అమెరికా ప్రకటించింది. గత ఆదివారం జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరంపై జరిగిన డ్రోన్ దాడిలో ముగ్గురు సైనికులు మృతి చెందగా మరో 40 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనను అగ్రరాజ్యం తీవ్రంగా పరిగణించింది. ఇరాన్ అనుకూల మిలీషియా గ్రూపులే కారణమని ఆరోపిస్తూ ఇందుకు ప్రతీకారం తీవ్ర స్థాయిలో ఉంటుందని హెచ్చరించింది. శుక్రవారం అమెరికా నుంచి బయలుదేరిన బీ1- లాంగ్‌రేంజ్ బాంబర్ విమానాలు ఇరాన్‌లోని సరిహద్దు పట్టణం అల్-క్వయిమ్ కేంద్రంగా పనిచేసే ఇరాన్ అనుకూల 'హష్ద్-అల్- షబి', కతాయిబ్ హెజ్బొల్లా సంస్థల స్థావరాలతోపాటు మొత్తం ఏడు ప్రాంతాల్లోని 85 లక్ష్యాలపై బాంబులతో ధ్వంసం చేసినట్లు అధ్యక్షుడు బైడెన్ చెప్పారు.

జార్ఖండ్ ప్రభుత్వంపై... బీజేపీ కుట్ర: రాహుల్

డియోహర్(జార్ఖండ్): జార్ఖండ్‌లో ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు బీజేపీ కుట్ర పన్నిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా శనివారం జార్ఖండ్‌లోని గొడ్డాలో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. అనంతరం దేవగఢ్‌లో ప్రఖ్యాత బైద్యనాథ్ ఆలయంలో రుద్రాభిషేకం చేశారు. స్థానిక ర్యాలీలో మాట్లాడారు. ''యువత ఉద్యోగాలు కోరుతుంటే ప్రధాని మోదీ మాత్రం దేశంలో నిరుద్యోగమనే వ్యాధిని వ్యాప్తి చేస్తున్నారు. ఈ వ్యాధి సోకిన యువత భవిష్యత్తును నాశనం చేసుకుంటోంది'' అని రాహుల్ అన్నారు. దేశంలో గిరిజన, దళిత, వెనుకబడిన వర్గాల ప్రజల సంఖ్యను కచ్చితంగా తేల్చేందుకు కులగణన అవసరం ఎంతో ఉందని ఆయన చెప్పారు. దేశంలో అన్యాయాలకు గురవుతున్న వారిలో ఈ వర్గాల ప్రజల సంఖ్య పెరుగుతూ పోతోందని తెలిపారు.

దేశాల సమన్వయంతోనే న్యాయ వితరణ

కామన్వెల్త్ దేశాల అటార్నీలు, సొలిసిటర్ జనరళ్ల సదస్సులో మోదీ

న్యూఢిల్లీ: నేరగాళ్లు ఖండాంతరాల్లో నేరసామ్రాజ్యాన్ని విస్తరించేందుకు సాంకేతికతను దుర్వినియోగం చేస్తున్న వేళ దేశాలు సత్వర న్యాయ వితరణ కోసం మరింతగా సహకరించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. శనివారం ఢిల్లీలో కామన్వెల్త్ లీగల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 'కామన్వెల్త్ దేశాల అటార్నీలు, సొలిసిటర్ జనరళ్ల సమావేశం'లో ఆయన ప్రసంగించారు. ''ఒక దేశ న్యాయస్థానాన్ని మరో దేశం గౌరవించిన నాడే ఈ సహకారం సాధ్యం. అప్పుడే సత్వర న్యాయం జరుగుతుంది. క్రిప్టోకరెన్సీ, సైబర్ దాడుల విజృంభిస్తున్న ఈ తరుణంలో ఒక దేశ న్యాయస్థానం ఇచ్చే తీర్పులు, ఉత్తర్వులు మరో దేశంలోనూ అమలుకు సాధ్యమయ్యేలా సంస్కరణలు తేవాలి. అప్పుడే బాధితులకు తక్షణ న్యాయం అందుతుంది. ఇప్పటికే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, నౌకాయానంలో ఇది సాధ్యమైంది. ఇకపై ఈ ఉమ్మడి విధానాన్ని కేసుల దర్యాప్తు, న్యాయవ్యవస్థలకూ విస్తరింపజేయాలి'' అని అభిలషించారు. ఒక దేశంలో జరిగిన ఆర్థిక నేరాలు ఇంకొక దేశంలో అలాంటి కార్యకలాపాలకు నిధులు సమకూరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. లా స్కూళ్లలో మహిళల అడ్మిషన్లు పెరగాలని, అప్పుడే న్యాయవ్యవస్థలో మహిళా ప్రాతినిధ్యం ఎక్కువ అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.




కార్యక్రమంలో జస్టిస్ డీవై చంద్రచూడ్, ప్రధాని మోదీ

న్యాయవ్యవస్థకు టెక్నాలజీ బలం: సీజేఐ

న్యాయ వితరణలో న్యాయస్థానాలకు సాంకేతికత అనేది శక్తివంతమైన పరికరంగా ఎదిగిందని సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. అటార్నీల సదస్సులో సీజేఐ పాల్గొని ప్రసంగించారు. ''సత్వర న్యాయం అందించేందుకు న్యాయవ్యవస్థ సాంకేతికతను శక్తివంతమైన ఉపకరణంగా వాడుతూ సద్వినియోగం చేస్తోంది. సాంకేతికతలను ఎల్లప్పుడూ సమానత్వం, సమ్మిళితత్వాన్ని దృష్టిలో ఉంచుకునే అభివృద్ధిచేయాలి. న్యాయం అందించేందుకు కామన్వెల్త్ దేశాలు ఉమ్మడిగా కట్టుబడి ఉండాలి. న్యాయ వితరణలో రాజకీయాలకు ఏమాత్ర జోక్యం లేకుండా చూడాల్సిన బాధ్యత న్యాయాధికారులైన అటార్నీలు, సొలిసిటర్ జనరళ్లదే. అప్పుడే న్యాయవ్యవస్థ నైతికత నిలబడుతుంది. సత్వర న్యాయం అందించడంలో న్యాయవ్యవస్థకు టెక్నాలజీ బలం తోడైంది. ప్రభుత్వాధికారులకు అనవసరంగా సమన్లు జారీ చేసే సంస్కృతి పోవాలి'' అని సీజేఐ అన్నారు.

పంజాబ్ గవర్నర్ బన్వారీలాల్ రాజీనామా



చండీగఢ్: పంజాబ్ గవర్నర్, కేంద్రపాలిత ప్రాంతం చండీగఢ్ పరిపాలనాధికారిగా ఉన్న బన్వారీలాల్ పురోహిత్ పదవులకు రాజీనామా చేశారు. శనివారం ఆయన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు సమర్పించారు. ''వ్యక్తిగత కారణాలతో పాటు కొన్ని ఇతర బాధ్యతలను నెరవేర్చాల్సిన దృష్ట్యా పంజాబ్ గవర్నర్ పదవితోపాటు, చండీగఢ్ పరిపాలనాధికారి బాధ్యతలకు రాజీనామా సమర్పిస్తున్నాను'' అని ఆ లేఖలో పేర్కొన్నారు. ఢిల్లీలో హోం మంత్రి అమిత్‌షాతో భేటీ అయిన మరునాడే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. పంజాబ్ గవర్నర్, చండీగఢ్ పాలనాధికారిగా 2021లో బన్వారీలాల్ బాధ్యతలు చేపట్టారు.

బలపరీక్షలో సోరెన్ పాల్గొనవచ్చు

రాంచీ: జార్ఖండ్‌లో కొత్తగా ఏర్పాటైన చంపయ్ సోరెన్ ప్రభుత్వం బలపరీక్షకు సిద్ధమైన వేళ ప్రభుత్వ సానుకూల ఉత్తర్వును రాంచీ కోర్టు వెలువరించింది. ఫిబ్రవరి ఐదో తేదీన అసెంబ్లీలో చంపయ్ సర్కార్ చేపట్టే బలపరీక్షలో పాల్గొనేందుకు ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి హేమంత్‌సోరెన్‌కు అనుమతినిస్తూ రాంచీలోని ప్రత్యేక కోర్టు ఉత్తర్వులిచ్చింది. జార్ఖండ్ భూకుంభకోణం ఉదంతంలో మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారని ఆరోపిస్తూ హేమంత్‌ను ఈడీ అరెస్ట్‌చేసిన సంగతి తెల్సిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలోనే ఉన్నారు.

అడ్వాణీకి భారతరత్న

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. ''సమకాలీన రాజకీయవేత్తల్లో అత్యంత గౌరవనీయుడు అడ్వాణీ. దేశాభివృద్ధిలో ఆయనది అత్యంత కీలక పాత్ర. అచంచలమైన చిత్తశుద్ధి, అంకితభావంతో దేశానికి దశాబ్దాల పాటు సేవ చేశారు. ప్రజాస్వామ్యానికి జాతీయవాద విలువలను కూర్చిన గొప్ప నాయకుడు. అత్యంత కింది స్థాయి నుంచి మొదలై ఉప ప్రధానిగా ఎదిగారు. రాజకీయాల్లో నైతిక విలువలకు నూతన ప్రమాణాలు నెలకొల్పారు'' అంటూ ప్రశంసించారు. ''ఇది నాకెంతో భావోద్వేగపూరిత క్షణం. అడ్వాణీతో అత్యంత సన్నిహితంగా మెలిగి ఎంతగానో నేర్చుకునే అవకాశం నాకు దక్కింది'' అని ఈ సందర్భంగా మోదీ అన్నారు. ప్రకటన అనంతరం అడ్వాణీకి మోదీ ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. తనకు అత్యున్నత పౌర పురస్కారం లభించడం పట్ల అడ్వాణీ హర్షం వెలిబుచ్చారు. ''దేశం కోసమే నా జీవితమంతా ధారపోశా. నా ఆశయాలకు సిద్ధాంతాలకు దక్కిన గౌరవమిది. నాకెంతో ఆనందంగా ఉంది'' అన్నారు. ప్రధాని మోదీకి, దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు దేశవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తాయి. పది రోజుల క్రితమే బిహార్ దివంగత ముఖ్యమంత్రి, ప్రఖ్యాత సామాజికవేత్త కర్పూరి ఠాకూర్‌కు కేంద్రం భారతరత్న ప్రకటించడం తెలిసిందే. ఇప్పటిదాకా 50 మందికి ఈ పురస్కారం దక్కింది. ఏడాదిలో గరిష్ఠంగా ముగ్గురికి ఈ పురస్కారం ఇవ్వవచ్చు. 1999లో మాత్రం నలుగురికి భారతరత్న ప్రకటించారు.

నేను ఆచరించిన విలువలకు, నా సేవలకు గుర్తింపు

''భారతరత్న పురస్కారం నాకు అత్యున్నత గౌరవం మాత్రమే కాదు. నేను జీవితాంతం ఆచరించిన విలువలకు, శక్తివంచన లేకుండా అందించిన సేవలకు గుర్తింపు కూడా. దీన్ని అత్యంత వినమ్రతతో, కృతజ్ఞతతో స్వీకరిస్తున్నా. 14 ఏళ్ల వయసులో కార్యకర్తగా ఆరెస్సెస్‌లో చేరిన రోజు నుంచి భరతమాతకు నిస్వార్థంగా సేవ చేయడమే లక్ష్యంగా బతికా. ఈ జీవితం నాది కాదు, దేశానిదేనన్న భావనే నన్ను ముందుకు నడిపింది. ఈ సందర్భంగా పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయిలను కృతజ్ఞతతో గుర్తు చేసుకుంటున్నా. ఈ ఇద్దరు మహనీయులతో కలిసి పని చేసే అదృష్టం నాకు దక్కింది. సుదీర్ఘ ప్రజా జీవితంలో నాతో పాటు కలిసి పని చేసిన లక్షలాది బీజేపీ, ఆరెస్సెస్ కార్యకర్తలు తదితరులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నాకు భారతరత్న ప్రకటించినందుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు. నాకు అడుగడుగునా అంతులేని ప్రేరణ శక్తిగా నిలిచిన నా కుటుంబీకులను, ముఖ్యంగా నన్ను వీడి వెళ్లిన నా భార్య కమలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నా. నా దేశం మరిన్ని ఘనతలు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నా''

– భారతరత్న ప్రకటన అనంతరం విడుదల చేసిన ప్రకటనలో అడ్వాణీ



శనివారం అడ్వాణీని అభినందిస్తున్న బీజేపీ నేత మురళీ మనోహర్ జోషీ

కుటుంబ రాజకీయాలను సవాలు చేసిన అడ్వాణీ: మోదీ

సంబల్‌పూర్ (ఒడిశా): అడ్వాణీ ఆజన్మాంతం కుటుంబ రాజకీయాలను సవాలు చేశారని మోదీ అన్నారు. బీజేపీపై అంటరాని పార్టీ ముద్రను పోగొట్టి ప్రపంచంలోకెల్లా అతి పెద్ద రాజకీయ వేదికగా తీర్చిదిద్దారని కొనియాడారు. ''వాజ్‌పేయితోకలిసి భారత ప్రజాస్వామ్యానికి అడ్వాణీ జాతీయ విలువలద్దారు. దేశ ప్రజాస్వామ్యాన్ని ఒక కుటుంబ గుత్తాధిపత్యం నుంచి విముక్తం చేసేందుకు నిరంతరం పోరాడారు'' అని ఒడిశాలోని సంబల్‌పూర్ ర్యాలీలో మోదీ పేర్కొన్నారు. మరోవైపు కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, అనురాగ్ ఠాకూర్ తదితరులతో పాటు పలు పార్టీల నాయకులు కూడా అడ్వాణీకి అభినందనలు తెలిపారు. దేశానికి, బీజేపీకి, పార్టీ సిద్ధాంతానికి ఆయన చేసిన నిస్వార్థ సేవలను వర్ణించేందుకు మాటలు చాలవని షా అన్నారు. తన గురువైన అడ్వాణీకి ఇంతటి గౌరవం దక్కడం ఆనందంగా ఉందని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు.

గమ్యం చేరని రథ యాత్రికుడు

లాల్‌కృష్ణ అడ్వాణీ. 1990ల నుంచి రెండు దశాబ్దాల పాటు దేశమంతటా మారుమోగిపోయిన పేరు. ముఖ్యంగా జాతీయ స్థాయిలో రాజకీయ రథయాత్రలకు పర్యాయపదంగా మారిన పేరు. ఆయన చేపట్టిన ఆరు యాత్రల్లో అయోధ్య రథయాత్ర దేశ రాజకీయ ముఖచిత్రాన్నే శాశ్వతంగా మార్చేసింది. జాతీయ రాజకీయాల్లో బీజేపీపై 'అంటరాని పార్టీ' ముద్రను చెరిపేసింది. బీజేపీని కేవలం రెండు లోక్‌సభ సీట్ల స్థాయి నుంచి తిరుగులేని రాజకీయ శక్తిగా తీర్చిదిద్దడంలో వాజ్‌పేయితో పాటు అడ్వాణీది కీలకపాత్ర. వాజ్‌పేయిని భారతరత్న వరించిన తొమ్మిదేళ్లకు తాజాగా ఆయనకూ ఆ గౌరవం దక్కింది. బీజేపీకి సుదీర్ఘ కాలం అధ్యక్షునిగా కొనసాగిన రికార్డు కూడా అడ్వాణీదే. జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్‌కు చెక్ పెట్టేందుకు నేషనల్ డెమొక్రటికల్ అలయన్స్ (ఎన్డీఏ)కు ఊపిరి పోసిందీ ఆయనే.

కరాచీ నుంచి కరాచీ దాకా...

అడ్వాణీ నేటి పాకిస్తాన్‌లోని కరాచీలో 1927 నవంబర్ 8న జన్మించారు. 14 ఏళ్లప్పుడే ఆరెస్సెస్‌లో చేరారు. అనంతరం జనసంఘ్ నేతగా ఎదిగారు. సహచర నేత వాజ్‌పేయితో పాటు దేశవ్యాప్త క్రేజ్ సంపాదించుకున్నారు. హిందూ హృదయ సమ్రాట్‌గా గుర్తింపు పొందారు. వాజ్‌పేయిది మితవాద ఇమేజీ కాగా అడ్వాణీ మాత్రం హిందుత్వకు పోస్టర్ బోయ్‌గా ముద్ర పడ్డారు. ఇద్దరూ కలిసి జోడెద్దులుగా బీజేపీ ప్రస్థానంలో కీలక పాత్ర పోషించారు. 1983లో కేవలం రెండు లోక్‌సభ సీట్లకు పరిమితమైన కాలంలో అడ్వాణీ బీజేపీ అధ్యక్ష పగ్గాలను అందుకున్నారు. అయోధ్యలో బాబ్రీ మసీదు స్థానంలో రామాలయం నిర్మించాలనే డిమాండ్‌తో దేశవ్యాప్త రామ రథయాత్ర తలపెట్టారు. 1990 సెప్టెంబర్లో గుజరాత్‌లోని సోమనాథ్ నుంచి మొదలు పెట్టిన ఈ యాత్రకు బ్రహ్మాండమైన స్పందన లభించింది. అరెస్టుతో యాత్ర మధ్యలోనే ఆగినా బీజేపీకి అదెంతగానో కలిసొచ్చింది. 1991 లోక్‌సభ ఎన్నికల్లో రెండో అతి పెద్ద పార్టీగా అవతరించింది. 1992లో బాబ్రీ మసీదు విధ్వంసానికి తోడు 1993 నుంచి అడ్వాణీ చేపట్టిన జనాదేశ్, స్వర్ణజయంతి, భారత్ ఉదయ్, భారత్ సురక్ష వంటి రథయాత్రలు బీజేపీని కేంద్రంలో అధికారానికి చేరువ చేశాయి. చివరికి 1996లో బీజేపీ తొలిసారిగా కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. కానీ వాజ్‌పేయి ప్రధాని కావడంతో అడ్వాణీ కల నెరవేరలేదు. దాంతో మితవాద ముద్ర కోసం విఫలయత్నాలు చేశారు. ఆ క్రమంలో 2005లో కరాచీ వెళ్లి మరీ జిన్నాను లౌకికవాది అంటూ పొగడటం ఆయనకు మరింత చేటు చేయడమే గాక ఆరెస్సెస్ కన్నెర్రకూ కారణమైంది. ఆ దెబ్బకు సంఘ్‌తో అడ్వాణీ సంబంధాలు పూర్తిగా చెడిపోయాయి. 2009 ఎన్నికల్లో బీజేపీ తరఫున ప్రధాని అభ్యర్థిగా నిలిచినా పార్టీ పరాజయం పాలైంది. యూపీఏ ప్రభుత్వ అవినీతిపై 2011లో చివరిసారి చేసిన జనచేతన యాత్రా అడ్వాణీకి అంతగా లాభించలేదు.

– సాక్షి, నేషనల్ డెస్క్

నేవీ చేతికి ఐఎన్ఎస్ సంధాయక్

విశాఖపట్నం: సముద్ర మార్గంలో స్మగ్లింగ్, వాణిజ్య నౌకలకు పొంచి ఉన్న సముద్ర దొంగల బెడద నుంచి నావికాదళాలను అప్రమత్తం చేసే అతపెద్ద సర్వే నౌక.. ఐఎన్ఎస్ సంధాయక్‌ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ శనివారం జాతికి అంకితమిచ్చారు. ఆధునాతన ఈ నౌకను భారత నావికాదళంలోకి చేర్చేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమం విశాఖపట్నం నావల్ డాక్‌యార్డ్‌లో జరిగింది. పోర్టులు, హార్బర్‌లు, సముద్ర మార్గాలు, తీర ప్రాంతాలు, నౌకల సురక్షిత ప్రయాణానికి అనువైన లోతైన సముద్ర జలాల పరిస్థితులు వంటి వాటిపై హైడ్రోగ్రాఫిక్ సర్వేలు చేస్తూ నౌకల రాకపోకలకు ఐఎన్ఎస్ సంధాయక్ నౌక సాయపడుతుంది. నౌకల మార్గాల్లో సముద్ర దొంగల సంచారాన్ని కనిపెట్టి అప్రమత్తంచేస్తుంది. 110 మీటర్ల పొడవైన ఈ నౌక సామర్థ్యం 3,400 టన్నులు. దీని తయారీలో వాడిన విడిభాగాలు 80 శాతం భారత్‌లో తయారైనవే.

ఆర్‌టీఐ నుంచి సీబీఐకి మినహాయింపు లేదు

అవినీతి తదితర సమాచారం వెల్లడించాల్సిందే: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: సమాచార హక్కు (ఆర్‌టీఐ) చట్టం పరిధి నుంచి సీబీఐకి పూర్తిగా మినహాయింపు లేదని, అవినీతి, మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు చట్టం అనుమతినిస్తుందని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. అవినీతి, మానవ హక్కుల ఉల్లంఘన ఆరోపణల సమాచారాన్ని దరఖాస్తుదారుకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేసింది.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు నక్సల్స్ మృతి

నారాయణ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లా భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారు. నెల్నార్ ఏరియా కమిటీ కార్యదర్శి అరబ్ అలియాస్ కమ్లేశ్, లోకల్ ఆర్గనైజేషన్ స్క్వాడ్(ఎల్‌వోఎస్)కమాండర్ సోంధు సారథ్యంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు భద్రతా బలగాలు ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని గోమగల్ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం గాలింపు చేపట్టారు. సాయంత్రం రెండు వర్గాల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. కాల్పుల అనంతరం ఆ ప్రాంతంలో పరిశీలించగా ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు, రెండు తుపాకులు లభ్యమైనట్లు ఒక అధికారి తెలిపారు. మృతులను గుర్తించాల్సి ఉందన్నారు.

కేంద్రం బకాయిలను మేమే ఇస్తాం: మమత

కోల్‌కతా: వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి కేంద్రప్రభుత్వం నుంచి పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి రావాల్సిన బకాయిలపై ఇక ఎవరినీ అడిగేదిలేదని, తామే చెల్లిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలపై కోల్‌కతాలో శుక్రవారం నుంచి 48 గంటల ధర్నాకు దిగిన మమత శనివారం మాట్లాడారు. ''ఇకపై మేం బీజేపీ ప్రభుత్వాన్ని దేహీ అని అడుక్కోవాలనుకోవట్లేదు. వాళ్ల భిక్ష మాకు అక్కర్లేదు. రాష్ట్రంలో ఉపాధి హామీ పనులు చేసి కేంద్రం నుంచి బకాయిల కోసం ఎదురుచూస్తున్న 21 లక్షల మంది కార్మికుల ఖాతాలకు ఆ మొత్తాలను ఫిబ్రవరి 21కల్లా మా ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఆవాస్ యోజన పథకంపైనా త్వరలో నిర్ణయం తీసుకుంటాం'' అన్నారు.

ధర్నా వద్దే మమత రాత్రి బస

ధర్నాకు దిగిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం రాత్రంతా ధర్నా స్థలి వద్దే గడిపారు. అక్కడే నిద్రించి ఉదయం మార్నింగ్‌వాక్‌కు వెళ్లారు.

కేజ్రీవాల్‌కు ఢిల్లీ పోలీసుల నోటీసులు

ఢిల్లీ: ఆప్ ఎమ్మెల్యేలకు ఎర వేసేందుకు బీజేపీ ప్రయత్నించిందంటూ చేసిన ఆరోపణలకు గాను ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు శనివారం పోలీసులు నోటీసులిచ్చారు. ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను మూడు రోజుల్లో అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా ఐదు గంటలు హైడ్రామా జరిగింది. కేజ్రీవాల్ నివాసంలో అధికారులు తాము నోటీసులు తీసుకుంటామని చెప్పగా పోలీసులు నిరాకరించారు. సీఎంకే ఇస్తామన్నారు. చివరికి కేజ్రీవాల్ బయటకు రాగా నోటీసులిచ్చారు. మరోవైపు ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో తామిచ్చిన ఐదు నోటీసులకు కేజ్రీవాల్ స్పందించలేదంటూ ఈడీ అధికారులు శనివారం అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దివ్యా మల్హోత్రాకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈ నెల 7వ తేదీన విచారణ చేపడతామని మేజిస్ట్రేట్ చెప్పారు.



బాధితుడు

ఎమ్మెల్యే

పోలీస్ స్టేషన్లో మహేశ్ తదితరులపై కాల్పులు జరుపుతున్న ఎమ్మెల్యే గణపత్ గైక్వాడ్

పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ ఎమ్మెల్యే బుల్లెట్ల వర్షం

ప్రాణాపాయ స్థితిలో శివసేన నేత మహేశ్ గైక్వాడ్ • పోలీసుల అదుపులో ఎమ్మెల్యే గణపత్ గైక్వాడ్

థానె/ముంబై: మహారాష్ట్రలోని ఓ పోలీస్‌స్టేషన్ బీజేపీ ఎమ్మెల్యే కాల్పుల ఉదంతానికి కేంద్ర బిందువైంది. సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఛాంబర్‌లోనే శివసేన నేత మహేశ్ గైక్వాడ్‌పై బీజేపీ ఎమ్మెల్యే గణపత్ గైక్వాడ్ కాల్పుల వర్షం కురిపించారు. బుల్లెట్ల గాయాలతో రక్తమోడుతున్న మహేశ్‌కు ఆపరేషన్ చేసినా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు ప్రకటించారు. పదేళ్ల క్రితం ఎమ్మెల్యే కొనుగోలు చేసిన భూమిని శివసేన నేత మహేశ్ కబ్జా చేశాడని ఆరోపణలున్నాయి. దీనిపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన తన కుమారుడితో మహేశ్ మనుషులు దారుణంగా ప్రవర్తించారని ఎమ్మెల్యే ఆరోపించారు. శుక్రవారం అర్ధరాత్రి థానె జిల్లా ఉల్హాస్‌నగర్ హిల్‌లైన్ పోలీస్‌స్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. ''తమ భూమి కబ్జాకు గురైందని ఫిర్యాదుచేసేందుకు ఎమ్మెల్యే కుమారుడు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. అదే సమయానికి మహేశ్ తన మనుషులతో వచ్చారు. గణపత్ రాకతో గొడవ పెద్దదై కాల్పులకు దారి తీసింది''అని అదనపు పోలీస్ కమిషనర్ షిండే వెల్లడించారు. కాల్పుల వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

అస్సలు బాధ లేదు: ఎమ్మెల్యే

కాల్పులు జరిపినందుకు అస్సలు బాధపడటం లేదని ఎమ్మెల్యే చెప్పారు. పోలీస్‌స్టేషన్‌లోనే నా ముందే నా కొడుకును అన్యాయంగా చితకబాదుతుంటే చూస్తూ ఊరుకోవాలా? అందుకే ఐదు రౌండ్లు కాల్చా. శివసేనను చీల్చి బీజేపీతో అంటకాగుతున్న ఏక్‌నాథ్ షిండే మహారాష్ట్రలో నేర సామ్రాజ్యం సృష్టించారు'' అని అరెస్టుకు ముందు చెప్పారు. రాహుల్ పాటిల్ అనే వ్యక్తికీ బుల్లెట్లు తగిలాయి. కాల్పుల ఘటనలో ఎమ్మెల్యేతోపాటు మరో ఇద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

దర్యాప్తునకు ఆదేశించిన ఫడ్నవిస్

మొత్తం వివాదంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ శనివారం చెప్పారు. ఆయనది తప్పుందని తేలితే చర్యలు తీసుకుంటామని బీజేపీ పేర్కొంది. ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకోకూడదని ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అన్నారు. అధికార పార్టీల నేతల ఆగడాలతో రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని రుజువైందని కాంగ్రెస్ పేర్కొంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహేశ్‌ను ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ కలిసి పరామర్శించారు.



వైద్యరంగంలో ముందంజ

కరీంనగర్ వైద్యరంగంలో హైదరాబాద్ తర్వాతి స్థానంలో నిలిచిందని, ఇందుకు ఇక్కడి వైద్యుల కృషి ఎంతో ఉందని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. 8లో▸



ఎస్‌యూలో అవగాహన సదస్సు

కరీంనగర్‌సిటీ: శాతవాహన విశ్వవిద్యాలయంలోని సైన్స్ కళాశాలలో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, కెరియర్ గైడెన్స్‌పై సదస్సు నిర్వహించారు. వీసీ ఎస్.మల్లేశ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

గరిష్టం/కనిష్టం
31.0/19.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో ఎండ తీవ్రత స్వల్పంగా పెరుగుతుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.



మన పీవీ భారతరత్నం కాదా?

ఉమ్మడి జిల్లా ముద్దుబిడ్డ, ఆర్థిక సంస్కరణల కర్త మాజీప్రధాని పీవీ నరసింహారావు. దేశ ఆర్థిక వ్యవస్థను సుస్థిర మార్గంలో ప్రయాణింపజేసిన ఆయనకు భారతరత్న ఇంకా రాకపోవడంపై జిల్లావాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షిప్రతినిధి, కరీంనగర్ 10లో▸



కారుచౌక జర్నీ

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న 'కార్ పూలింగ్' కల్చర్

సండే స్పెషల్

- తక్కువ చార్జీకే ప్రయాణం
- రాజధాని, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు యాప్‌లో సీటు బుకింగ్
- ఉద్యోగుల ప్రాధాన్యం దీనికే..
- నచ్చిన చోట పికప్, డ్రాప్ సదుపాయం
- ఇంధనం, డబ్బు ఆదా

నగరానికి చెందిన అఖిల్ అత్యవసరంగా హైదరాబాద్ వెళ్లాల్సి ఉంది. బస్సుల్లో రద్దీ చాలా ఉంది. రిజర్వేషన్ లోనూ సీట్లు లేవు. వెంటనే తన వద్ద ఉన్న ఓ కార్‌పూలింగ్ యాప్ ఓపెన్ చేసి, సీటు బుక్ చేసుకుని రాజధానికి వెళ్లిపోయాడు అఖిల్.

బదిలీల అనంతరం ప్రభుత్వ ఉద్యోగులు సైతం నలుగురు లేదా ఐదుగురు ఎంప్లాయిస్ కలిసి కార్ పూలింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఒకే ఆఫీసులో పనిచేయడం, కారు అయితే స్టాపుల్లేకుండా నేరుగా ఆఫీసుకే వెళ్లే వీలుండటంతో కార్ పూలింగ్‌కు మొగ్గు చూపుతున్నారు.





అద్దెకారు జర్నీ ఖరీదైంది. ఇద్దరు.. నలుగురు కలిసి కరీంనగర్ నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వెళ్లాలంటే రూ.5వేలకు తక్కువ ఖర్చవడం లేదు. పెరిగిన ఇంధన ధరలు, ఖర్చుల నేపథ్యంలో అంతకన్నా తక్కువ తీసుకుంటే తమకు గిట్టుబాటు కాదని కారు నిర్వాహకులు చెప్పేస్తున్నారు. బస్సుల్లో రద్దీ, సమయం వృథా, సిటీలో ట్రాఫిక్ జామ్ నేపథ్యంలో సరే అని కారులో వెళ్లిపోతున్నారు. అయితే అందుబాటులోకి వచ్చిన టెక్నాలజీ కారు ప్రయాణాన్ని చౌకకే అందిస్తోంది. కార్ పూలింగ్‌కు కొన్నియాప్‌లు అందుబాటులో ఉండగా ఉమ్మడి జిల్లా నుంచి చాలామంది సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లేవారు.. అక్కడి నుంచి ఇక్కడికి వచ్చేవారు కార్ పూలింగ్ ద్వారా ప్రయాణం చేస్తున్నారు. తక్కువ ధరకే షేరింగ్ జర్నీ చేస్తూ సమయాన్ని ఆదా చేసుకుంటున్నారు. కారు నిర్వాహకులకు సైతం ఇం'ధన'ం ఆదా అవుతోంది. అసలేంటీ 'కారు'చౌక జర్నీ అనుకుంటున్నారా..? చదవండీ సండే స్పెషల్..!!

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి జిల్లాలో కార్ పూలింగ్ కల్చర్ పెరిగిపోతోంది. పెరిగిన రద్దీతో ఉద్యోగులు, విద్యార్థులు ఈ విధమైన ప్రయాణానికి పెద్దపీట వేస్తున్నారు. జిల్లా కేంద్రాలైన కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల నుంచి ప్రతీరోజు రాజధానితో పాటు వరంగల్, మంచిర్యాల, గోదావరిఖని, నిజామాబాద్ ఇలా ఏ ప్రాంతానికైనా కార్ పూలింగ్‌కే జై కొడుతున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్ తరువాత ఆ స్థాయిలో అభివృద్ధి చెందుతున్న నగరం కరీంనగర్. ఉమ్మడి జిల్లాకు చెందిన వేలాదిమంది హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, ముంబై, చెన్నై తదితర ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, కార్పొరేట్ తదితర మల్టీనేషనల్ కంపెనీల్లో కొలువు చేస్తున్నారు. వీరంతా వారాంతానికి ఉమ్మడి జిల్లాకు రావడం, తిరిగి సోమవారం ఉదయానికి వారి ఉద్యోగస్థానాలకు వెళ్లడం రివాజుగా మారింది. దీనికి తోడు ప్రతిరోజూ కోర్టు కేసులు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు, రకరకాల అవసరాల రీత్యా రాజధానికి వెళ్లేవారి సంఖ్య లెక్కేలేదు.

ఉమ్మడి జిల్లాలో కార్ల సంఖ్య ఇలా

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కార్ల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. బ్యాంకుల సులభ వాయిదా రుణాలు, మార్కెట్‌లోకి కొత్త కార్లు వస్తుండటం, కరోనా తరువాత భౌతిక దూరానికి ప్రాధాన్యం పెరగడంతో సెకండ్ హ్యాండ్ కార్ల మార్కెట్ కూడా ఊపందుకుంది. ఇందుకు ఉమ్మడి జిల్లాలో రిజిష్టర్ అయిన కార్ల వివరాలే నిదర్శనం.

కరీంనగర్:	47,023
సిరిసిల్ల:	11,911
జగిత్యాల:	12,824
పెద్దపల్లి:	10,400

టోల్‌గేట్‌ల వద్ద తాకిడి

పాత జిల్లాలో రెండు ప్రధాన టోల్‌గేట్లు ఉన్నాయి. ఇందులో ఒకటి కరీంనగర్ జిల్లా రేణికుంట వద్ద కాగా, పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ వద్ద రెండోది ఉంది. ఈ టోల్‌గేట్ల మీదుగా ప్రతిరోజూ రాకపోకలు సాగించే కార్ల వివరాలు ఇలా ఉన్నాయి.

టోల్‌గేట్	హైదరాబాద్ వైపు	హైదరాబాద్ నుంచి
రేణికుంట	5,500 సుమారు	5,000 సుమారు
బసంత్‌నగర్	1,500 సుమారు	1,100 సుమారు

ఓనర్, రైడర్‌కు మేలు

ఈ యాప్‌లు కార్లు లేని వారికే కాదు సొంత వాహనాలు ఉన్న వారికీ సౌకర్యంగా ఉంటుంది. చాలా మంది ఉమ్మడి జిల్లాకు వివిధ పనులు, పండుగలు, సెలవులకు వచ్చి, కుటుంబ సభ్యులను దింపి తిరిగి ఒంటరిగా వెళ్తుంటారు. అంటే దాదాపు గంటల కొద్దీ ప్రయాణం ఒంటరిగా చేయాలి. అదే సమయంలో కరీంనగర్ నుంచి పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు వెళ్లే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు తమ కొలీగ్స్ రానప్పుడు ఈ యాప్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ఎవరికైనా పెట్రోల్ ఖర్చు ఆదానే కదా. అందుకే, బ్లాబ్లా కార్, క్విక్‌రైడ్ యాప్‌లో రైడ్ వివరాలు పోస్టు చేస్తున్నారు. క్షణాల్లో కారు ఖాళీ సీట్లు నిండిపోతున్నాయి. కారు ఓనరూ ఆర్టీసీచార్జీలే తీసుకుంటుండటంతో జర్నీలో టైంపాస్, పెట్రోల్ చార్జీలు కలిసి వస్తున్నాయి.

నచ్చిన చోట పికప్.. డ్రాప్

ఈ యాప్‌తో మరో సదుపాయం ఏంటంటే.. హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లినప్పుడు ముందు రైల్వేస్టేషన్/బస్టాండ్‌లో దిగుతాం. అక్కడి నుంచి మనం అనుకున్న స్థానాలకు వెళ్లాలంటే క్యాబ్‌లకు రూ.200, 300 పెట్టాలి. ట్రాఫిక్‌తో గంటలపాటు ఇరుక్కుపోతుంటారు. కానీ, ఈ యాప్ ద్వారా ఓనరు ప్రయాణించే మార్గంలో మనకు నచ్చిన చోట దిగవచ్చు. ఉదా: నిమ్స్ వెళ్లాలనుకుంటే మెహదీపట్నం వెళ్లే కారును ఎంచుకోవచ్చు. హైటెక్ సిటీ వెళ్లాలనుకుంటే కొండాపూర్ వెళ్లే కారును సెలెక్ట్ చేసుకుని, అక్కడే దిగిపోవచ్చు. చాలా కార్లు ఓఆర్ఆర్ మీదుగా వెళ్తుండటంతో సమయం, డబ్బు ఆదా అవుతున్నాయి.

సమయానికి చేరుకోవచ్చు



హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు కార్ పూలింగ్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని ప్రయాణించడం ద్వారా సమయం, డబ్బులు ఆదా అవుతున్నాయి. ఎలాంటి ఆలస్యం లేకుండా గమ్యానికి అనుకున్న సమయంలోనే చేరుకునే వెసులుబాటు ఉంది. వివిధ వ్యాపారాల రీత్యా దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కార్ పూలింగ్ యాప్‌ను ఎక్కువగా వినియోగించుకుంటున్నారు.

– శనిగరపు రవీందర్, ప్రభుత్వ ఉద్యోగి

న్యూస్‌రీల్

ఏడాదిలోగా పెండింగ్ పనులు పూర్తి



కరీంనగర్ కార్పొరేషన్: ఏడాదికాలంలో నగరంలోని పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. 14వ డివిజన్ వెంకటేశ్వరకాలనీలో రూ.54 లక్షలతో చేపట్టిన ఎస్‌డబ్ల్యూజీ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు స్థానిక కార్పొరేటర్ దిండిగాల మహేష్‌తో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. మేయర్ మాట్లాడుతూ.. తమ నాలుగేళ్ల హయాంలో నగర రూపురేఖలు మార్చామన్నారు. ఏడాదికాలంలో మిగిలిన పనులు పూర్తిచేసి, అద్భుతమైన నగరాన్ని ప్రజలకు అందిస్తామన్నారు. నగరవ్యాప్తంగా 50పార్కులు గుర్తించామని, 40 పార్కులు ఇప్పటికే అభివృద్ధి పరిచామని అన్నారు. రాంనగర్ ప్రాంతంలో రోడ్ల మధ్యలో విద్యుత్ పోల్స్ ఉన్న కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని తొలగించామన్నారు. డీఈ లచ్చిరెడ్డి, ఏఈ నిఖిత, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

పారదర్శకంగా సదరం సర్టిఫికెట్ల జారీ



కరీంనగర్‌టౌన్: సదరం సర్టిఫికెట్ల జారీ పారదర్శకంగా జరగాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కమిటీ సమావేశానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు పెన్షన్, పలు రాయితీల అమలుకు ప్రామాణికంగా నిలిచే సదరం సర్టిఫికెట్లజారీలో లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన స్లాట్ బుకింగ్ ఫీజు కన్నా ఎక్కువ వసూలు చేసే కేంద్రాలపై చర్యలు తీసుకోవాలన్నారు. సర్టిఫికెట్లు అనర్హులకు అందకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాల ద్వారా రికార్డు చేయించాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు, అపార్ట్‌మెంట్లలో దివ్యాంగుల కోసం ర్యాంపులు, లిఫ్ట్ సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. దివ్యాంగులకు జిల్లా సెంట్రల్ లైబ్రరీలో ప్రత్యేక గది ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందించాలని కోరారు. డీడబ్ల్యూవో సరస్వతి, డీఎంహెచ్‌వో కె.లలితాదేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి, డీఆర్డీవో శ్రీలత, జెడ్పీ సీఈవో పవన్ కుమార్, ఎల్డీఎం ఆంజనేయులు, మెప్మా పీడీ రవీందర్, సీఐ సరిలాల్ పాల్గొన్నారు.

5 నుంచి మొదటి దశ ఈవీఎంల తనిఖీ

కరీంనగర్ అర్బన్: ఈవీఎం, వీవీప్యాట్‌ల మొదటి స్థాయి తనిఖీ (ఎఫ్ఎల్‌సీ) ఈ నెల 5 నుంచి నిర్వహిస్తామని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. ఎస్సారార్ కళాశాలలో శనివారం ఈవీఎంల గదులను పరిశీలించారు. కరీంనగర్, మానకొండూర్, చొప్పదండిల ఈవీఎంలు, వీవీప్యాట్లను వేర్‌హౌజ్‌లకు మార్చడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 5 నుంచి ఫస్ట్ లెవల్ చెకింగ్‌ను కలెక్టరేట్ వెనుకాల గల వేర్‌హౌస్‌లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. డీఆర్‌వో పవన్ కుమార్, బీఆర్ఎస్ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, కాంగ్రెస్ ప్రతినిధి మడుపు మోహన్, బీజేపీ ప్రతినిధి బండ రమణారెడ్డి, తెలుగుదేశం ప్రతినిధి కల్యాడపు ఆగయ్య పాల్గొన్నారు.



● కంగ్రాట్స్ మేడమ్

కరీంనగర్ అర్బన్: పనితీరులో ప్రతిభ కనబర్చిన కలెక్టర్ పమేలా సత్పతిని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ చాంబర్‌లో కలిసి పూల మొక్కను అందించి శాలువాతో సన్మానించారు. ఉమెన్ సివిల్ సర్వెంట్ల విభాగంలో బ్యూరోక్రాట్స్ ఇండియా రిలీజ్ చేసిన జాబితాలో కలెక్టర్ ఉండటం హర్షణీయమని కొనియాడారు. టీఎన్జీవోల సంఘం జిల్లా 2024 డైరీని అందించారు. సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, రాగి శ్రీనివాస్, మన్మిత్, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్‌సింగ్, కార్యదర్శి సుమంత్‌రావు, రూరల్ అధ్యక్ష కార్యదర్శులు మారుపాక రాజేశ్ భరద్వాజ్, నేరెళ్ల కిషన్, శారద, కోట రామస్వామి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



● వామనావతార గోవులు

కరీంనగర్‌లోని జ్యోతినగర్‌కు చెందిన గోలి వాణి– అశోక్‌కుమార్ దంపతులకు ఆవుల పెంపకం అంటే ఇష్టం. 19 నెలల వయసున్న వామనావతార గోవులను రెండు నెలల క్రితం తీసుకొచ్చి పెంచుకుంటున్నారు. వీటి వయసు పెరిగినా ఆకారం పెరగదు. అప్పుడే పుట్టిన లేగదూడలా ఉంటాయి. రాజమండ్రి కొవ్వూరుకు చెందిన దేవరాజ్ వద్ద నుంచి ఆవుకు రూ.1.70 లక్షలు, ఎద్దుకు రూ.లక్ష వెచ్చించి, కొనుగోలు చేశారు. ఆవుకు లక్ష్మి అని, ఎద్దుకు నారాయణ అని పేరు పెట్టారు. ఒక్కగానొక్క కూతురికి పెళ్లి చేయగా ఇప్పుడు ఈ గోవులే వారి బిడ్డలయ్యాయి. వాటిని చూడటానికి చాలామంది వస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్



కథ చెబుతాం..

యువత కులవృత్తుల్లోనే ఉపాధి వెతుక్కుంటున్నారు. ఒక వైపు చదువుకుంటూనే.. మరోవైపు ఒగ్గుకథలు చెబుతున్నారు. మల్లన్నపట్నాలు, భీరప్ప పూజలు చేస్తూ పల్లెల్లో ఆధ్యాత్మికతను నింపుతున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని పల్లెల్లో ఒగ్గుకథలు చెబుతున్న యువకులపై ఈ సండే స్పెషల్..

– వేములవాడఅర్బన్ 8లో▸

నేను పక్కా లోకల్

- మోదీ చేసిన అభివృద్ధితోనే జనంలోకి వెళ్తా
- సొంత పార్టీ కార్యకర్తలనే గుర్తుపట్టని మేధావి వినోద్ కుమార్
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్
- ఎంపీ నిధులతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

కరీంనగర్‌టౌన్: 'నేను పక్కా లోకల్.. నరేంద్రమోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను చెప్పి జనంలోకి వెళ్లి ఓట్లు అడుగుతా. దమ్ముంటే మీరు ఎంపీగా చేసినప్పుడు తెచ్చిన నిధులేమిటో.. మీరు చేసిన అభివృద్ధి ఏమిటో.. చెప్పి ఓట్లడిగే దమ్ముందా?' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. శనివారం కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి కోదండ రామాలయం సమీపంలో రూ.10లక్షల ఎంపీ నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కరీంనగర్ జిల్లాజైలు వద్ద రూ.15 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులతో కొనుగోలు చేసిన అంబులెన్స్, వైద్య పరికరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలనే పట్టించుకోని మేధావి వినోద్ కుమార్ అని, ప్రజలను ఎలా గుర్తుపడతారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందం ఏమిటో కరీంనగర్ ప్రజలకు తెలుసని, తనపై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను జనం పట్టించుకోవడం లేదని అన్నారు. గ్రామాల్లోకి వెళితే మోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటో తెలుస్తుందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.12వేల కోట్లకు పైగా నిధులు తీసుకొచ్చానని స్పష్టంచేశారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో బీజేపీ కార్యకర్తలు, జైలు అధికారులు పాల్గొన్నారు.



జిల్లా జైలుకు అందించిన అంబులెన్స్ వద్ద ఎంపీ

ఐదేళ్లలో ఐదు పైసలు కూడా తేలేదు

- ఎన్నికలప్పుడే సంజయ్‌కి గ్రామాలు గుర్తొస్తాయి
- కాంగ్రెస్ ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చింది
- మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత బోయినపల్లి వినోద్ కుమార్

హుజూరాబాద్: ఐదేళ్లకాలంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ ఐదుపైసలు కూడా కేంద్రం నుంచి తేలేదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. శనివారం హుజూరాబాద్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృతజ్ఞతసభకు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయతో కలిసి హాజరయ్యారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి ఇచ్చే నిధులు కూడా తానే తెచ్చానని సంజయ్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికలు రాగానే సంజయ్‌కి గ్రామాలు గుర్తొస్తాయని అన్నారు. ఎంపీగా ఒక్క నవోదయపాఠశాల, ట్రిపుల్ ఐటీ కూడా తేలేకపోయాడన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ హోదా తెచ్చి రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయించినట్లు వివరించారు. బీఆర్ఎస్‌ను బొందపెడతామని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతున్నారని, వీరి గురువులైన చంద్రబాబు, వైఎస్ రాజశేఖరరెడ్డిలతోనే అదిసాధ్యం కాలేదని అన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ సర్కారు చేసిన అభివృద్ధి చూసి ఓర్వలేక బీజేపీ, కాంగ్రెస్ అబద్ధాలు ప్రచారం చేసి ప్రజలను మాయ చేశాయని పేర్కొన్నారు. అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైందన్నారు. గత ఎన్నికల్లో హుజూరాబాద్ ప్రజలు 50వేల మెజారిటీ ఇచ్చారని, రాబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీ ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు.



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలి

- ఈనెల 14 నుంచి 21 వరకు వెంకన్న సప్తమ వార్షిక ఉత్సవాలు
- పారదర్శకంగా వేడుకలు.. ఇంటింటికీ ఆహ్వాన పత్రికలు
- రాజకీయాలకు అతీతంగా ఏర్పాట్లు
- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని మార్కెట్ రోడ్డులో ఉన్న వేంకటేశ్వరస్వామి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా, పారదర్శకంగా నిర్వహించాలని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఫిబ్రవరి 14 నుంచి 21వరకు జరిగే లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులు, నిర్వాహకులతో శనివారం సమీక్షించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. నగరంలోని మార్కెట్‌రోడ్డులో ఉన్న వేంకటేశ్వరుని ఆలయ బ్రహ్మోత్సవాలు రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని ఇంటింటికీ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తనవంతుగా రూ.5లక్షల విరాళం అందించానని, భక్తులు అందించే విరాళాలు, కానుకల వివరాలు, బ్రహ్మోత్సవాలకు జరిగే ఖర్చు వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. స్వామివారి సేవకు వచ్చేవారికి డ్రెస్‌కోడ్, ఐడీకార్డులు ఇవ్వాలన్నారు. 14వ తేదీన ప్రారంభమయ్యే అధ్యయనోత్సవం నుంచి 21వ తేదీరోజున జరిగే శోభాయాత్ర వరకు ఎక్కడా అవాంతరాలు తలెత్తకూడదని తెలిపారు. ఆలయం నుంచి వన్‌టౌన్, బస్‌స్టాండ్ మీదుగా కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుంచి ఆలయం వరకు నిర్వహించే శోభాయాత్ర సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఆలయ ఆవరణలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. కచ్చితమైన ప్రొటోకాల్ పాటించాలని సూచించారు. బ్రహ్మోత్సవాల మరుసటి రోజు నుంచి జరిగే సమ్మక్క– సారలమ్మ జాతరకు శాశ్వత ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, రూ.5లక్షల విరాళం అందించారు. ఈ సమీక్షలో కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, డీఆర్‌వో పవన్‌కుమార్, డీఎఫ్‌వో బాలామణి, ఆర్డీవో మహేశ్వర్, డీఎంహెచ్‌వో లలితాదేవి, ట్రాన్స్‌కో ఎస్ఈ గంగాధర్, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, టౌన్ ఏసీపీ నరేందర్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఏసీ విజయసారథి

కరీంనగర్‌ అర్బన్‌: తూకంలో మోసాలు, నిబంధనలను విస్మరించే బియ్యం దుకాణాలపై తూనికలు, కొలతలశాఖ దాడులు కొనసాగిస్తోంది. శనివారం తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్‌ కంట్రోలర్‌ కె.విజయసారథి అధ్వర్యంలో నగరంలోని పీవీఎస్‌ ట్రేడర్స్‌, అన్నపూర్ణ రైస్‌ స్టోర్స్‌, సూర్య రైస్‌ దుకాణాలతోపాటు పెట్రోల్‌ బంకులు తనిఖీ చేశారు. కొలతల్లో తేడాలు లేవని తెలుపగా బియ్యం బస్తాల తూకం తక్కువగా ఉండటంతో పీవీఎస్‌ ట్రేడర్స్‌పై కేసు నమోదు చేశారు. నిబంధనలను విస్మరించిన అన్నపూర్ణ రైస్‌స్టోర్స్‌, సూర్య రైస్‌పై రెండు కేసులు నమోదు చేసినట్లు ఏసీ వివరించారు. జిల్లా తూనికలు, కొలతల అధికారి భూలక్ష్మి పాల్గొన్నారు.

వారధి సొసైటీ రద్దు చేయాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

కరీంనగర్‌ కార్పొరేషన్‌: ప్రభుత్వ సంస్థల్లో ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగ కల్పన పేరుతో అవినీతి అక్రమాలకు నిలయంగా మారిన వారధి సొసైటీని రద్దు చేయాలని కాంగ్రెస్‌ డిమాండ్‌ చేసింది. శనివారం పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్‌ ఆధ్వర్యంలో కలెక్టర్‌ పమేలా సత్పతిని కలిసి పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. పదేళ్లనుంచి అక్రమాలకు పాల్పడుతున్న వారధి సొసైటీ కార్యదర్శిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఔట్‌సోర్సింగ్‌ పద్ధతిన నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేసిన వారధి అక్రమాలకు నిలయంగా మారిందని ఆరోపించారు. సొసైటీ కార్యదర్శిని తొలగించి, ఆయన అభియోగాలపై విచారణ జరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు మడుపు మోహన్‌, బోనాల శ్రీనివాస్‌, ఎస్‌.ఎ.మోసిన్‌, అబ్దుల్‌ రెహమాన్‌, మహమ్మద్‌ అమీర్‌ తదితరులు పాల్గొన్నారు.

రేపు రేకుర్తి ఆస్పత్రికి మెల్లకన్ను చికిత్స వైద్యుల రాక

కొత్తపల్లి: రేకుర్తిలోని లయన్స్‌ కంటి ఆసుపత్రికి ఈ నెల 5వ తేదీన మెల్లకన్ను, చిన్న పిల్లల్లో కంటి సమస్యలు, శుక్లం (మోతె బిందు)కు సంబంధించిన ప్రత్యేక వైద్యులు రానున్నట్లు ఆసుపత్రి ట్రస్టుబోర్డు సభ్యుడు, ఇంజినీర్‌ కోల అన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో దొరికే సేవలు తక్కువ ఖర్చుతో రేకుర్తిలో పొందేందుకు 7673983940 సెల్‌నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

కథ చెబుతాం..

- ఒగ్గుకథలు చెబుతున్న యువకులు
- చదువు.. ఉద్యోగం.. కులవృత్తి
- తండ్రుల బాటలో తనయులు
- ఆదివారం, సోమవారం పూజా కార్యక్రమాలు
- మిగతా రోజులు సాధారణ పనులు



మల్లన్న పట్నం వేస్తున్న యువ ఒగ్గు కళాకారులు

వేములవాడఅర్బన్‌: అవును.. వాళ్లు కథలు చెబుతున్నారు. ఊ కొట్టే కథలు కావు. పెద్దల నుంచి వారసత్వంగా వచ్చిన కథలు. పల్లెల్లో ఆధ్యాత్మిక భావాలు నింపే ఒగ్గుకథలు. దశాబ్దం క్రితం కులవృత్తి అంటే చిన్నచూపు చూడడంతో జానపదుల కళలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈక్రమంలోనే నేటి యువత ఇటు చదువుతోపాటు అటు కులవృత్తిని ఉపాధిరంగంగా ఎంచుకుంటుంది. బీటెక్‌, బీఈడీ, డిగ్రీలు, పీజీలు చదువుతూనే ఒగ్గుకథలు, మల్లన్న పట్నాల కథలు చెబుతున్నారు. కులవృత్తిని కాపాడుతూనే ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఒకప్పుడు మల్లన్నపట్నాలు అంటేనే కథకులు పెద్ద వయసు వారు వచ్చేవారు. కానీ నేడు పరిస్థితులు మారాయి. పాతికేళ్లు కూడా నిండని యువత మల్లన్నపట్నాల బాధ్యతలు తమ బుజాలపై వేసుకుంటున్నారు. కథలు చెబుతూ పల్లెప్రజల మన్ననలు అందుకుంటున్నారు.

మూడు నెలలు కథలు చెబుతూ..

తాతలు.. తండ్రుల నుంచి వచ్చిన కులవృత్తిని ఉపాధిరంగంగా ఎంచుకున్న నేటి యువత డిసెంబర్‌, జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే కథలు చెబుతున్నారు. ఈ మూడునెలల్లో ప్రతీ ఆదివారం మల్లన్న పట్నాల పూజలు చేస్తూ బిజీగా ఉంటున్నారు. ఒకరి ఇంట్లో మల్లన్నపట్నాల పూజలకు ముగ్గురు యువకులు వెళ్లి దిగ్విజయంగా పూర్తి చేస్తున్నారు.

కులవృత్తిపై మమకారంతో..

కులవృత్తిపై మమకారంతో ఇటీవల యువత మల్లన్నపట్నాలు, బీరప్ప కథలు చెప్పేందుకు ముందుకొస్తున్నారు. బోయినపల్లి మండలం విలాసాగర్‌ గ్రామంలో దాదాపు 50 మంది ఒగ్గుకథ కళాకారులు ఉన్నారు. ఇందులో 20 మంది వరకు పాతికేళ్లు కూడా నిండని యువతే. డిసెంబర్‌, జనవరి, ఫిబ్రవరి మూడు నెలల్లో ప్రతీ ఆదివారం, సోమవారం మల్లన్న పట్నాల పూజలకు వెళ్తుంటారు. కులవృత్తిని గౌరవిస్తూనే ఉన్నత చదువులు అభ్యసిస్తున్నారు. బోయినపల్లి మండలానికి చెందిన కళాకారులు వేములవాడ, బావుపేట, కందికట్కూర్‌, వాసంపల్లి, అయ్యోరుపల్లి గ్రామల మధ్యలో విస్తరించి ఉన్న ప్రాంతంలో మల్లన్నపట్నాల పూజలు చేస్తుంటారు. వివిధ దేవుళ్ల, జానపదల కథలు చెబుతుంటారు.



మల్లన్న పట్నాలలో ఆడ వేషధారణలో కథలు చెబుతున్న యువ కళాకారుడు

చదువుకుంటూనే..



నేను ఆరేళ్లుగా మల్లన్న పట్నాలకు వెళ్తున్నాను. ఇప్పుడు బీటెక్‌ ఫైనలియర్‌ చదువుతున్నాను. ఈ సీజన్‌లో పట్నాల పూజలకు తీరిక లేకుండా వెళ్తున్న. అక్కడ కథలు కూడా చెబుతుంటాను.

– అక్షయ్‌, బీటెక్‌ విద్యార్థి

ఉద్యోగంతోపాటు కథలు



నేను 12 ఏళ్లుగా మల్లన్నపట్నాల పూజలకు వెళ్తున్నాను. చదువుకుంటూ కథలకు వెళ్లేవాడిని. ఇప్పుడు కోనరావుపేట మండలంలో ఔట్‌సోర్సింగ్‌లో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. ఆది, సోమవారాల్లో మల్లన్నపట్నాల పూజలకు వెళ్తున్నాను.

– మహేశ్‌, ఒగ్గు కళాకారుడు

మా నాన్నతోపాటు వెళ్తున్నాను



నేను గత 8 ఏళ్లుగా మల్లన్న పట్నాలకు వెళ్తున్నాను. ఇంటర్‌ పూర్తి చేశాను. ప్రస్తుతం మా నాన్నతో కలిసి మల్లన్న పట్నాలకు వెళ్తున్నాను. కథలలో ఆడవేషాలు కూడా వేస్తున్నాను. ఈ సీజన్‌లో మేము మల్లన్న పట్నాలు ఎక్కువగా చేశాం.

– ప్రవీణ్‌, ఒగ్గు కళాకారుడు

కాంగ్రెస్‌ 50 రోజుల్లో 50 వేషాలు వేసింది

- 56 ఏళ్లు పాలించిన కాంగ్రెస్‌ ప్రజలకేం చేసింది
- మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి ప్రశ్న
- కొండగట్టు అంజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు



అంజన్న సన్నిధిలో ప్రసాదం తీసుకుంటున్న మాజీ మంత్రి మల్లారెడ్డి

కొండగట్టు(చొప్పదండి): కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన 50 రోజుల్లో 50 వేషాలు వేసిందని మాజీమంత్రి, మేడ్చల్‌ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి విమర్శించారు. దేశాన్ని 56 ఏళ్లపాటు పాలించిన కాంగ్రెస్‌ ప్రజలకేమీ చేయలేదని తెలిపారు. జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయ స్వామివారిని ఆయన శనివారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఏఈవో బుద్ధి శ్రీనివాస్‌ వారిని శాలువాతో సన్మానించారు. అనంతరం మల్లారెడ్డి విలేకరులతో మాట్లాడారు. అంజన్న ఆశీర్వాదంతోనే ఎమ్మెల్యే, మంత్రిని అయ్యానన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ చొరవతోనే తెలంగాణలో ఆలయాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. కొండగట్టు అంజన్న అభివృద్ధికి రూ.500కోట్లు విడుదల చేసిన ఘనత కేసీఆర్‌దేనని వివరించారు. రానున్న పార్లమెంట్‌ ఎన్నికల్లో 16సీట్లు గెలవాలని స్వామివారిని మొక్కుకున్నట్లు తెలిపారు.

ఆయుధంతో ఆలయంలోకి..

మల్లారెడ్డి స్వామివారి అంతరాలయంలో పూజలు చేస్తున్న సమయంలో మల్లారెడ్డి గన్‌మన్‌ ఆయుధంతో ఆలయంలోకి వచ్చాడు. నిబంధనల ప్రకారం ఆలయంలోకి ఆయుధాలు నిషేధం. గన్‌మన్‌ ఆయుధంతో రావడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైద్యరంగంలో ముందంజలో కరీంనగర్‌



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌

- ఆర్థోపెడిక్‌ వైద్యుల సేవలు వెలకట్టలేనివి
- కరీంనగర్‌ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌

కరీంనగర్‌టౌన్‌: తెలంగాణ ఏర్పడ్డాక కరీంనగర్‌ వైద్యరంగంలో హైదరాబాద్‌ తర్వాత స్థానంలో నిలిచిందని, ఇందుకు ఇక్కడి వైద్యుల కృషి ఎంతో ఉందని మాజీ మంత్రి, కరీంనగర్‌ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ అన్నారు. శనివారం వీ–కన్వెన్షన్‌ హాల్‌లో జరుగుతున్న 9వ రాష్ట్ర ఆర్థోపెడిక్‌ వైద్యుల సదస్సు మూడో రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒకప్పుడు రోడ్డు ప్రమాదం జరిగినా, మోకాలి చిప్ప మార్పిడి చేయించుకోవాలన్నా హైదరాబాద్‌ పరిగెత్తాల్సి వచ్చేదని, అలాంటి పరిస్థితుల నుంచి కరీంనగర్‌తోపాటు ప్రతి జిల్లా కేంద్రంలో ఆర్థోపెడిక్‌ వైద్యుల సేవల కారణంగా ఎక్కడికక్కడ ట్రామాకేర్‌ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలైన వారిని కాపాడుతున్నారని కొనియాడారు. మోకాలి చిప్ప మార్పిడి, స్పైన్‌సర్జరీలను అత్యాధునిక పద్ధతులు, అధునాతన రోబోటిక్‌ వైద్య విధానం ద్వారా అందుబాటులోకి తేవడం వల్ల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని అన్నారు. తెలంగాణ తెలంగాణ ఆర్థోపెడిక్‌ సర్జన్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు డాక్టర్‌ విజయభాస్కర్‌, కరీంనగర్‌ అధ్యక్షుడు డాక్టర్‌ మోతిలాల్‌, ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ బంగారు స్వామి, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ఆర్థోపెడిక్‌ సర్జన్‌లు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో విజయం సాధ్యం



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్‌ గంగయ్య

చొప్పదండి: చదువుపై ఏకాగ్రత సాధిస్తే విజయం బానిసగా మారుతుందని డిప్యూటీ కలెక్టర్‌ బొద్దుల గంగయ్య అన్నారు. పట్టణంలోని సాంఘిక, సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో ప్రిన్సిపాల్‌ స్వాతి అధ్యక్షతన శనివారం విద్యార్థులు, భవిష్యత్తుకు మార్గాలు అనే అంశంపై జరిగిన సమావేశానికి హాజరై మాట్లాడారు. నేటి ఆధునిక సాంకేతిక రంగంలో రాణించాలంటే అన్ని అంశాలపై విద్యార్థులకు పట్టు ఉండాల్సిన ఆవశ్యకత ఉందని, సమయాన్ని సద్వినియోగం చేసుకున్నవారు చరిత్రకారులుగా మిగులుతారని పేర్కొన్నారు. నిర్దిష్టమైన ప్రణాళికతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. కష్టంతోకాకుండా ఇష్టంతో చదివితే విజయాలు సొంతమవుతాయన్నారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ అలివేలు దీప్తి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆమె పరీక్ష రాస్తే ఉద్యోగమే..

- మూడు ఉద్యోగాలు సాధించిన లాస్య
- తాజాగా నర్సింగ్‌ ఉద్యోగ పరీక్షలో ర్యాంకు
- సీఎం చేతులమీదుగా నియామక పత్రం



లాస్య

మెట్‌పల్లి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం ఒక్కటి సాధించడమే కష్టం. అలాంటిది ఈ యువతి ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలిచారు. నిర్మల్‌ జిల్లాకేంద్రానికి చెందిన లాస్యకు మెట్‌పల్లిలోని దుబ్బవాడకు చెందిన జెట్టి నరేందర్‌తో వివాహమైంది. చదువులో చురుకుగా ఉన్న లాస్య ఇంటర్‌ వరకు నిర్మల్‌లోనే పూర్తి చేశారు. నిజామాబాద్‌ సమీపంలోని ఓ నర్సింగ్‌ కళాశాలలో బీఎస్సీ చదివారు. 2022 జనవరిలో సింగరేణి సంస్థ నిర్వహించిన నర్సింగ్‌లో ప్రతిభ చూపారు. అందులో ఉద్యోగానికి ఎంపికైన ఆమె రామకృష్ణాపూర్‌లోని సంస్థకు చెందిన ఆసుపత్రిలో పోస్టింగ్‌ ఇచ్చారు. అనంతరం అఖిల భారతీయ వైద్యవిజ్ఞాన సంస్థ నిర్వహించిన పరీక్షలోను మంచి మార్కులు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యారు. కొద్దిరోజులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన నర్సింగ్‌ ఉద్యోగ పరీక్షలో బాసర జోన్‌లో మొదటిర్యాంకు, రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు సాధించి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకున్నారు. భర్త నరేందర్‌, కుటుంబ సభ్యుల సహకారంతో విజయం సాధ్యమైందని లాస్య పేర్కొన్నారు. సింగరేణి ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తున్న ఆమె.. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పోస్టింగ్‌లో జాయిన్‌ అవుతానని తెలిపారు.

ప్రాణం తీసిన ర్యాష్‌ డ్రైవింగ్‌

- ఎదురెదురుగా బైక్‌లు ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం
- మరో వ్యక్తికి తీవ్రగాయాలు.. పరిస్థితి విషమం



అభిలాష్‌(ఫైల్‌)



అవినాశ్‌కుమార్‌(ఫైల్‌)

ఎలిగేడు/జూలపల్లి(పెద్దపల్లి): అజాగ్రత్తగా బైక్‌లు నడపడంతో ఎదురెదురుగా ఢీకొని వేల్పుల అవినాశ్‌కుమార్‌(16), పూరెళ్ల అభిలాశ్‌(18) దుర్మరణం చెందారు. మిత్రులతో సర్కస్‌ తిలకించేందుకు వెళ్లిన వీరిద్దరూ అనూహ్యంగా మృతిచెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ప్రమాదం శుక్రవారం అర్ధరాత్రి పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం లోకపేటలో చోటుచేసుకుంది. జూలపల్లి ఎస్సై వెంటకృష్ణ కథనం ప్రకారం.. జూలపల్లి మండలం కాచాపూర్‌కు చెందిన అవినాశ్‌కుమార్‌, పెద్దపల్లికి చెందిన అభిలాశ్‌, వేల్పుల రమేశ్‌, పంబాల మనోజ్‌, దాడి రామ్‌చరణ్‌, కొలిపార రాంచరణ్‌ మిత్రులు. ఎలిగేడు మండలం ముప్పిరితోటలో ప్రదర్శిస్తున్న సర్కస్‌ చూసేందుకు ఈ ఆరుగురు మిత్రులు రెండు బైక్‌లపైరాత్రి బయలుదేరి వెళ్లారు. సర్కస్‌ తిలకించాక అవే బైక్‌లపై ఇంటిదారి పట్టారు. ఈక్రమంలో ఎలిగేడు మండలం లోకపేట శివారులోని వంతెన వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన ఓ బైక్‌ అవినాశ్‌కుమార్‌, అభిలాశ్‌ బైక్‌ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో అవినాశ్‌కుమార్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. అభిలాశ్‌ను హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. వీరిని ఢీకొన్న మరోబైక్‌ నడుపుతున్న ముప్పిరితోటకు చెందిన మాదారపు వెంకట్రావు తీవ్రంగా గాయపడగా, కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఇతడి పరిస్థితి విషమంగా ఉంది. మిగతా స్నేహితులు ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. అవినాశ్‌ తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెండు కుటుంబాల్లో తీరని విషాదం..

పెద్దపల్లికి చెందిన పూరెళ్ల శ్రీనివాస్‌ – కవిత దంపతుల చిన్నకుమారుడు అభిలాశ్‌. వీరిది నిరుపేద కుటుంబం. అభిలాశ్‌ ఇంటర్‌పూర్తి చేశాడు. స్నేహితులతో సర్కస్‌ చూసేందుకు వెళ్లి వస్తూ మృతిచెందడంతో కుటుంబసభ్యులు విలపిస్తున్నారు. జూలపల్లి మండలం కాచాపూర్‌కు చెందిన అవినాశ్‌ కుమార్‌ పెద్దాపూర్‌ ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. చిన్నతనంలోనే తల్లి మృతి చెందింది. తండ్రి మల్లేశం అన్నీ తానై చదివిస్తున్నాడు. మిత్రులతో కలిసి సర్కస్‌ చూసేందుకు వెళ్లి కానరాని లోకాలకు వెళ్లడంతో తండ్రి కన్నీరుమున్నీరవుతున్నాడు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



అజీమ్‌ (ఫైల్‌)

జమ్మికుంట: పరీక్షల్లో ఫెయిల్‌ అవుతున్నాననే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జమ్మికుంట పోలీసుల వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్‌ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎండీ.అజీమ్‌(18) కొన్నేళ్లుగా పదోతరగతి పరీక్షల్లో ఫెయిల్‌ అవుతూ వస్తున్నాడు. ఓపెన్‌ పరీక్షలు రాసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో మనస్తాపం చెందిన యువకుడు శనివారం వేకువజామున ఇంటినుంచి బయటకు వెళ్లాడు. గ్రామసమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి రాజ్‌ మహ్మద్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్‌ వివరించారు.

యువకుడి ఆత్మహత్య

గోదావరిఖని: స్థానిక చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన శ్రీపతి నరేశ్‌(37) అనే సింగరేణి కాంట్రాక్టు కార్మికుడు శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొంతకాలంగా మానసిక స్థితి సరిగాలేక హైదరాబాద్‌ ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇటీవల స్వస్థలం వచ్చాడు. అయితే, ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఇంటి ఎదుట ఉన్న షెడ్డు పైకప్పుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్‌ ఎస్సై సమ్మయ్య తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

కెనాల్‌లో మృతదేహం లభ్యం



వివరాలను నమోదు చేసుకుంటున్న పోలీస్‌

హుజూరాబాద్‌ రూరల్‌: మండలంలోని సిర్సపల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో శనివారం మృతదేహం లభ్యమైనట్లు గ్రామస్తులు తెలిపారు. కెనాల్‌లో మృతదేహం కొట్టుకొస్తుండటంతో గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించామన్నారు. పోలీసులు మృతదేహాన్ని బయటికి తీసి తనిఖీ చేయగా కరీంనగర్‌లోని విద్యానగర్‌కు చెందిన ఆర్‌.శశిధర్‌గౌడ్‌(40)గా గుర్తించిచారు. అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఇంట్లో చిందరవందరగా పడేసిన సామగ్రి

గొల్లపల్లి: తాళంవేసిన ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన గొల్లపల్లి మండలకేంద్రంలో చోటుచేసుకుంది. బొప్పపల్లికి చెందిన మూట రాజబోయి ముంబయ్‌కి వలస వెళ్లి అక్కడే జీవిస్తున్నాడు. ఏటా దీపావళి, వేసవి సెలవులకు ఇంటికి వచ్చి వెళ్తుంటాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం మధ్యాహ్నం ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న విలువైన ఇత్తడి, వెండి సామగ్రి ఎత్తుకెళ్లారు. స్థానిక మహిళ వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా కొన్ని వస్తువులు వదిలేసి పారిపోయారు. ఘటనలో ఐదుగురు మహిళలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. జరిగిన విషయాన్ని పోలీసులు, బాధిత కుటుంబసభ్యులకు వివరించారు. ఆర్నెళ్ల క్రితం కూడా నాగుల గురువయ్య ఇంట్లో ఇలాగే చోరీ జరిగింది. ఏడాది క్రితం బూసర్తి మల్లయ్య ఇంట్లో చోరీ జరిగింది. వీరంతా ముంబయ్‌లో వలస ఉంటున్నారు. ఈ మూడిళ్లను టార్గెట్‌ చేసిన గుర్తుతెలియని మహిళలు చోరీకి పాల్పడినా కేసు దర్యాప్తు దశలోనే ఉండడం గమనార్హం.

ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్‌ విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్‌ నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్‌): ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ సిల్వర్‌ జోన్‌ నిర్వహించిన రాష్ట్రస్థాయి జీకే ఒలింపియాడ్‌లో కొత్తపల్లిలోని అల్ఫోర్స్‌ ఇ టెక్నో స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్‌ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. బంగారు పతకాలు సాధించిన పెరటి మయాంక్‌రెడ్డి, పి.ఇందుహాసిత, కె.హానిష్‌రెడ్డి, జి.జోయల్‌డేవిస్‌, మహ్మద్‌ జైన్‌సిద్ధిక్‌, జయంత్‌ను శనివారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన అభినందించారు.

కాంగ్రెస్‌ ఎంపీ టికెట్‌ కోసం పది దరఖాస్తులు

కరీంనగర్‌ కార్పొరేషన్‌: రాబోయే లోకసభ ఎన్నికల్లో కరీంనగర్‌ నుంచి కాంగ్రెస్‌ టికెట్‌ ఆశిస్తున్న నాయకులు పోటాపోటీగా దరఖాస్తు చేసుకుంటున్నారు. కాంగ్రెస్‌ జిల్లా కమిటీ పంపిన పేర్లతో పాటు, పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న ఆశావహులు ప్రదేశ్‌కాంగ్రెస్‌ కమిటీకి దరఖాస్తు చేసుకోవాలని ఇటీవల అధిష్టానం పేర్కొనడం తెలిసిందే. ఈ క్రమంలోనే కరీంనగర్‌ లోక్‌సభ స్థానం నుంచి పార్టీ టికెట్‌ను ఆశిస్తున్న నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. శనివారంతో దరఖాస్తు ప్రక్రియ ముగియగా, కరీంనగర్‌ నుంచి దాదాపు పదిమంది తమ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. చివరిరోజు శనివారం నలుగురు దరఖాస్తు చేసుకోగా, ఇప్పటికే ఆరుగురు దరఖాస్తు చేసుకొన్నారు. చివరిరోజు మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్‌, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, మేనేని రోహిత్‌రావు, రేగులపాటి రమ్యారావులు దరఖాస్తు చేసుకున్నారు. కాగా టి.సంతోష్‌కుమార్‌ తరఫున ప్రశాంత్‌ దీపక్‌, కటకం మృత్యుంజయం తరఫున మూల జైపాల్‌, దిండిగాల మధు, చింతల కిషన్‌, బాశెట్టి కిషన్‌లు గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేశారు. ఇక ఇప్పటికే హుస్నాబాద్‌ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతిరావు తనయుడు వెలిచాల రాజేందర్‌రావు, గంగాధర మండలం ఆచంపల్లికి చెందిన రుద్ర సంతోష్‌, కరీంనగర్‌కు చెందిన ఉప్పు రవీందర్‌, సింగిరెడ్డి సుమనరెడ్డి, పొల్సాని స్నేహలు టికెట్‌కు దరఖాస్తు చేసిన వారిలో ఉన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో సత్తా చాటాలి

కరీంనగర్‌ స్పోర్ట్స్‌: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో సత్తా చాటాలని డీవైఎస్‌వో కీర్తి రాజవీరు అన్నారు. శనివారం నుంచి యాదాద్రి జిల్లా భువనగిరిలో ప్రారంభమైన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న జిల్లా క్రీడాకారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఒలింపిక్‌ అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌ రెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌ రెడ్డి, రగ్బీ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి చారి, ప్రధాన కార్యదర్శి నిరంజన్‌, గౌరవ అధ్యక్షుడు సంతోష్‌, పీఈటీ శివ పాల్గొన్నారు.



జై శ్రీరాం.. జై హనుమాన్‌



కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయ స్వామివారిని శనివారం వేలాది భక్తులు దర్శించుకున్నారు. సమ్మక్క, సారలమ్మ జాతర సీజన్‌ కావడంతో తరలివస్తున్నారు. భక్తుల ఏర్పాట్లను ఈవో వెంకటేశ్‌, ఏఈవో బుద్ధి శ్రీనివాస్‌, ప్రధాన అర్చకులు పెద్ద జితేంద్రప్రసాద్‌ స్వామి, సూపరింటెండెంట్‌ శ్రీనివాస శర్మ, సునీల్‌, ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

ఎల్‌కే అద్వానీతో ఎంపీ సంజయ్ జ్ఞాపకం


అద్వానీతో ఎంపీ సంజయ్ (ఫైల్)

విద్యానగర్: మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీకి భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో ఎంపీ బండి సంజయ్ ఆయనతో నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అద్వానీతో గతంలో దిగిన ఫొటోను శనివారం సోషల్ మీడియాలో పెట్టి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్‌ఎస్ సమావేశానికి తరలిరండి

విద్యానగర్: రేకుర్తిలోని ఓ గార్డెన్‌లో సోమవారం కరీంనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ కరీంనగర్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు, మేయర్ వై.సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి హాజరవుతారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అనుబంధ కమిటీల ప్రతినిధులు తరలిరావాలని కోరారు.

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం




కరీంనగర్ కల్చరల్: నగరంలోని అంజనాద్రి క్షేత్రంలో త్యాగరాజస్వామి 177వ ఆరాధనోత్సవం శనివారం కనులపండువగా నిర్వహించారు. స్వామివారికి పంచరత్న గోష్టి, గానం, సంకీర్తనార్చనలు జరిపారు.

ఆటోడ్రైవర్లకు నివాళి



సప్తగిరికాలనీ: ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్లకు కరీంనగర్ ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం నగరంలోని బస్టాండ్ ఎదుట గల శ్రీపాద చౌక్‌లో నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల ఆటోడ్రైవర్లు నష్టపోతున్నారని తెలిపారు. గిరాకీ లేక, ఆటో ఫైనాన్స్ చెల్లించలేక ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నగర అధ్యక్షుడు మద్దెల రాజేందర్, ప్రధాన కార్యదర్శి బండారి సంపత్, ఉపాధ్యక్షులు నరసింహ, మారం సంపత్, కూకట్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

‘అచీవర్స్’లో మై జూ డే



విద్యానగర్: కరీంనగర్ కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో శనివారం మై జూ డే నిర్వహించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు వివిధ రకాల జంతువుల వేషధారణలో ఆకట్టుకున్నారు. పాఠశాల డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత కంటి శస్త్రచికిత్స

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని బొమ్మకల్‌కు చెందిన నూకల రాయమల్లుకు హంగర్ రిలీఫ్ లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జీ చైర్మన్ చింతల కిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రేకుర్తి కంటి ఆస్పత్రిలో ఉచితంగా కంటి శస్త్రచికిత్స చేశారు. ఆస్పత్రి చైర్మన్ చిదుర సురేశ్ సహకారంతో 83వ ఆపరేషన్ నిర్వహించారు. బాధితుడికి పండ్లు, బ్రెడ్ అందజేశారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులను ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు చేపడుతున్నట్లు టౌన్-1 ఏడీఈ నరేందర్ తెలిపారు. ఈ కారణంగా 11 కేవీ జ్యోతినగర్, ఎల్లమ్మ, సుభాష్‌నగర్ ఫీడర్ల పరిధిలోని జ్యోతినగర్, కోర్టు వెనక భాగం, మోర్ సూపర్ మార్కెట్, రాధా నిలయం, ఆటోనగర్, కేబుల్ బ్రిడ్జి, డంపుయార్డు, సుభాష్‌నగర్, బుట్టిరాజారాంకాలనీ, శివాజీనగర్, వాటర్ ట్యాంక్, ఎస్టీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ నారీమణులు.. సమాజహితులు

పేదల సంక్షేమమే ధ్యేయంగా సేవా కార్యక్రమాలు ● స్వచ్ఛంద సంస్థలతో అభాగ్యులకు అండ

విద్యానగర్: ప్రస్తుత ఉరుకులు పరుగుల జీవితంలో పక్కవారికి కష్టమొస్తే సహాయం చేయాలన్న ఆలోచన రాని పరిస్థితి. కానీ, నగరానికి చెందిన కొందరు నారీమణులు సమాజహితం వైపు అడుగులు వేస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు ప్రారంభించి, పేదలకు, నిస్సహాయులకు అండగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వారిపై ప్రత్యేక కథనం.

సండే స్పెషల్



స్వధార్ పునరావాస కేంద్రం

కరీంనగర్‌కు చెందిన మూగ జయశ్రీ ప్రకృతి పర్యావరణ సంస్థను 1997లో జిల్లా కేంద్రంలో ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మొక్కలు నాటి, సంరక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వ వృక్ష మిత్ర అవార్డు పొందారు. స్వశక్తి సంఘాల మహిళలకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బ్యాంకు రుణాలు ఇప్పిస్తున్నారు. మహిళలు తయారు చేసిన వస్తువులు అమ్ముకోవడానికి ఏటా మహిళా హస్తకళల ప్రదర్శన, విక్రయ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. వరకట్నం, గృహహింస, లైంగిక వేధింపులు, అత్యాచారాలు, బాల్యవివాహాల బాధితులకు సఖి కేంద్రం ద్వారా సహాయ సహకారాలు అందిస్తున్నారు. అవసరమైనవారికి, అనాథ మహిళలకు స్వధార్ పునరావాస కేంద్రం ద్వారా ఆశ్రయం కల్పిస్తున్నారు.

ముస్లిం స్టూడెంట్ ఆర్గనైజేషన్



వారంతా గ్రాడ్యుయేట్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ విద్యార్థినులు. అందరూ ముస్లింలే. ముస్లిం స్టూడెంట్ ఆర్గనైజేషన్‌ను గతేడాది ఆగస్టులో ప్రారంభించారు. సంస్థ సభ్యులు సాదియా నాజ్, అయేషా మహబూబి, షర్లీన్ సుల్తానా, సైదాశరా తబస్సుమ్, సుఫియా నాజ్, అమ్మార ఫాతిమా, బుష్రా మహిన్, జార మరియం, అక్స ముస్కాన్, జోహ మస్‌జార్, హుమేరా సదాఫ్, అబీనా మంజూర్ తమ పాకెట్ మనీతోపాటు బంధుమిత్రులు వివిధ సందర్భాల్లో ఇచ్చిన డబ్బులను పేదలు, అన్నార్థులను ఆదుకునేందుకు వెచ్చిస్తున్నారు.

ఆదరణ సేవా సమితి



కరీంనగర్‌లోని జ్యోతినగర్‌కు చెందిన ఆదరణ సేవా సమితి అధ్యక్షురాలు కర్రె పావని భర్త రవి, స్నేహితులు, దాతల సహకారంతో రెండేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో దాదాపు 500 మంది పేదలకు ఆర్థికంగా, వస్తు రూపంలో సహాయం అందించారు. ఇంటి ఖర్చులు పోనూ మిగిలే కొద్దిపాటి డబ్బు, దాతల సహాయంతో పేద విద్యార్థులకు పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లు, పెన్నులు ఇస్తున్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. నిరుపేదలకు నిత్యావసర సరుకులు, ఆహారం అందిస్తున్నారు. కిశోర బాలికలకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పిస్తూ శానిటరీ నాప్కిన్స్ ఇస్తున్నారు.

భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ



కరీంనగర్‌కు చెందిన అకెనపెల్లి శివజ్యోతి ఉపాధ్యాయురాలు. భర్త నాగరాజు సహకారంతో 2017లో భరోసా స్వచ్ఛంద సేవా సంస్థను ప్రారంభించారు. కరీంనగర్‌లోని అంధులు, బధిరుల పాఠశాలల విద్యార్థులకు ఏటా బ్లూటూత్, మెమొరీ కార్డులు, టాకింగ్ వాచ్‌లు, బ్రెయిలీ స్లేట్స్, ఆట వస్తువులు, డ్రాయింట్ కిట్స్, బ్యాగులు, వాటర్ బాటిళ్లు ఇస్తున్నారు. 200 మంది పేద విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇప్పించి, సర్టిఫికెట్స్ అందించారు. విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్ విజార్డ్ అవార్డు పోటీలు నిర్వహిస్తున్నారు. పదోతరగతి వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో 1,400 వరకు వీడియో పాఠాలను రూపొందించి, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. జిల్లా ప్రధాన ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు నిత్యం దాతల సహకారంతో అన్నదానం చేస్తున్నారు.

అతివ ఉమెన్ ఆర్గనైజేషన్



కరీంనగర్‌లోని సీతారాంపూర్‌కు చెందిన కటకం దీప్తి తన సహచరులు భాగ్యశ్రీ, స్వప్న, కవిత, సంధ్యారాణిలతో కలిసి అతివ ఉమెన్ ఆర్గనైజేషన్‌ను 2019లో ప్రారంభించారు. కరోనా సమయంలో మాస్కులను తయారు చేయించి, 100 మందికి ప్రత్యక్షంగా, మరో 150 మందికి పరోక్షంగా పని చూపించారు. గ్రామీణ మహిళలకు వారి గ్రామాల్లోనే కుట్టు శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పిస్తున్నారు. మహిళల్లో వచ్చే ప్రత్యేక వ్యాధులు, చికిత్స, ఋతుక్రమ సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కిశోర బాలికలకు రక్తహీనత వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ పౌష్టికాహారం అందేలా చూస్తున్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పిస్తున్నారు.

16న సమ్మె విజయవంతం చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బుచ్చన్నయాదవ్


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీంనగర్‌రూరల్/సప్తగిరికాలనీ: దేశవ్యాప్తంగా ఈ నెల 16న చేపట్టనున్న కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్నయాదవ్ కోరారు. శనివారం కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో రైల్వే హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సమ్మె జరగనుందని తెలిపారు. అనంతరం రైల్వేస్టేషన్ మేనేజర్ రవీందర్‌ను కలిసి, సమ్మె నోటీసు అందించారు. కార్యక్రమంలో రైల్వే హమాలీ సంఘం అధ్యక్షుడు కాశెట్టి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి గాండ్ల రమేశ్, ఉపాధ్యక్షుడు దాసరి ప్రభాకర్, ఏఐటీయూసీ నగర కార్యవర్గ సభ్యులు శంకర్, కాశెట్టి శ్రీను, రాజు, గాండ్ల శ్రీను, పవన్, రవి తదితరులు పాల్గొన్నారు.

డీపీవోకు సమ్మె నోటీసు

విద్యానగర్: ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కమిటీ పాల్గొంటుందని సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు శనివారం డీపీవో వీరబుచ్చయ్యకు సమ్మె నోటీసు అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్, ఉపాధ్యక్షుడు సంపత్, కోశాధికారి రవీందర్‌రావు, నాయకులు సదయ్య, అంజిరెడ్డి, శంకర్, లక్ష్మి, లక్ష్మీనారాయణ ఉన్నారు.


డీపీవోకు నోటీసు ఇస్తున్న నాయకులు

అర్బన్ హెల్త్ సెంటర్ ఎంప్లాయీస్..

కరీంనగర్‌టౌన్: ఈ నెల 16న జరిగే గ్రామీణ భారత్ బంద్‌లో జిల్లాలోని మెడికల్ హెల్త్ సెంటర్ ఉద్యోగులు పాల్గొంటారని తెలంగాణ యునైటెడ్ మెడికల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు తెలిపారు. ఈ మేరకు శనివారం డీఎంహెచ్‌వో లలితాదేవికి సమ్మె నోటీసు అందజేశారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎడ్ల రమేశ్, నాయకులు స్రవంతి, రజిత, వరలక్ష్మి, రమాదేవి, ఉమాదేవి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.


డీఎంహెచ్‌వోకు నోటీసు ఇస్తున్న ఉద్యోగులు

కేంద్ర ప్రభుత్వ విజయాలను వివరించండి


మాట్లాడుతున్న ప్రవీణ్‌రావు

కొత్తపల్లి: గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు కోరారు. గ్రామీణులను చేరుకోవడమే లక్ష్యంగా బీజేపీ జాతీయ నాయకత్వం గావ్ చలో అభియాన్ కార్యక్రమం చేపట్టిందన్నారు. కొత్తపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్లో శనివారం పార్టీ పట్టణ అధ్యక్షుడు కెంచ శేఖర్ అధ్యక్షతన జరిగిన గావ్ చలో అభియాన్ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఈ నెల 6వ తేదీ సాయంత్రం నుంచి జిల్లాలో ప్రారంభం కానున్న గావ్ చలో అభియాన్‌ను విజయవంతం చేయడానికి బీజేపీ శ్రేణులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. గ్రామీణ ప్రజలకు ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలు, పథకాలను వివరించాలని సూచించారు. కౌన్సిలర్ వాసాల రమేశ్, నాయకులు హరీశ్, ప్రదీప్, హరిప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్, నర్సయ్య, మునీందర్ రెడ్డి, సంతోష్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో సమావేశం

కరీంనగర్ కల్చరల్: భగత్‌నగర్ అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం గురుస్వాములు, దాతలతో సమావేశం నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణంపై చర్చించినట్లు ఈవో కాంతారెడ్డి తెలిపారు. మండప నిర్మాణ ప్రారంభ తేదీ నిర్ణయించేందుకు ఈ నెల 7న ఉదయం 8.30 గంటలకు మరోసారి సమావేశం కానున్నట్లు పేర్కొన్నారు. దాతలు, గురుస్వాములు హాజరుకావాలని కోరారు.

పాఠశాలకు వంట పాత్రలు


వంట పాత్రలు అందిస్తున్న టీచర్లు

కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు టీచర్లు శ్రీదేవి, శ్రీలత శనివారం రూ.4 వేల విలువైన వంట పాత్రలు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కరుణ, టీచర్లు వినోద, మమత, మంగ, విజయలక్ష్మి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పాటవ పోటీలు


ప్రతిభ చూపిన విద్యార్థులతో నిర్వాహకులు

విద్యానగర్: తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతి అందజేశారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డమీది రథంగాపాణిరెడ్డి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ అశోక్ రెడ్డి, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ విజ్ఞాన్ ప్రతిష్ఠ చైర్మన్ రాజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ఫోరం జిల్లా అధ్యక్షుడు తిరుపతి తదితరులున్నారు.

ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్ ప్రకటించాలి


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న వెంకటేశం మోచి

కరీంనగర్ కల్చరల్: వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్ ప్రకటించి, నిధులు కేటాయించాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచి కోరారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శనివారం వినతి పత్రం అందించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే, ఎస్సీ ఉపకులాల కుల ధ్రువీకరణ పత్రాలను ఆర్డీవో ద్వారా కాకుండా తహసీల్దార్ ద్వారా ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాయిల లక్ష్మి నర్సయ్య చిందు, సిరిపాటి వేణు బేడ బుడ్గ జంగం, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బాణాల రాజారాం డక్కలి, జిల్లా అధ్యక్షుడు రవీందర్ గోసంగి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యపై వివరాల సేకరణ


వివరాలు తెలుసుకుంటున్న డీసీపీవో శాంత

కొత్తపల్లి: మండలంలోని చింతకుంట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో గత నెల 29న జరిగిన విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై డీసీపీవో శాంత, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కో–ఆర్డినేటర్ సంపత్ వివరాలు సేకరించారు. శనివారం కళాశాలకు వెళ్లి, విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న గదిని పరిశీలించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులతో మాట్లాడారు. ఆ సమయంలో వసతి గృహంలో విద్యార్థినులు లేకపోవడంతో మరోసారి వచ్చి, వారిని కూడా ఆరా తీసి, ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాస్మిన్ థెరిసా, బాలల పరిరక్షణ పథకం సోషల్ వర్కర్ కవితాదేవి, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కేసు వర్కర్ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలి


సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

కొత్తపల్లి: పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని ఎంపీడీవో, గ్రామ ప్రత్యేకాధికారి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్‌లో శనివారం ఉదయం పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్మికులతో మాట్లాడుతూ.. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలన్నారు. రానున్న వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా పంపు ఆపరేటర్లు అప్రమత్తంగా ఉండాలని, పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి, మరమ్మతు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అభినవ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసిఫ్‌నగర్‌లో పనులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కొత్తపల్లి: గ్రామంలో ఇప్పటివరకు నిర్మించిన మురికి కాల్వలు, సీసీరోడ్ల నాణ్యతపై విచారణకు ఆదేశించాలని ఆసిఫ్‌నగర్ ఎంపీటీసీ సభ్యురాలు దావ కమల, స్థానికులు కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి, ఫిర్యాదు చేశారు. ఆసిఫ్‌నగర్ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో నాణ్యత లేకుండా సీసీ రోడ్డు నిర్మిస్తున్నారని ఆరోపించారు. వెంటనే పరిశీలించి మాజీ సర్పంచ్ భర్త శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, గ్రామ పంచాయతీకి సంబంధించి ఇనుప సామగ్రి, తొక్కుడు రిక్షాలు, పాత మోటార్లు అమ్ముకున్నట్లు ఆరోపణలు ఉన్నాయని, పంచాయతీ ట్రాక్టర్‌ను వినియోగించకుండా సొంత ట్రాక్టర్‌కు నెలకు రూ.20 వేల నుంచి రూ.30 వేలు పంచాయతీ నిధుల నుంచి తీసుకున్నారని పేర్కొన్నారు.

సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఎన్నిక

సప్తగిరికాలనీ: సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం కరీంనగర్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండారుపల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా ఆరెల్లి కుమారస్వామి, కోశాధికారిగా రవీందర్, ఉపాధ్యక్షులుగా సంపత్, దివాకర్, ముంతాజ్ ఫాతిమా, సంయుక్త కార్యదర్శులుగా జాన్ సుధాకర్, తిరుపతి, జ్యోతి, పవన్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అవధూత శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా కిరణ్‌కుమార్, లచ్చయ్య, శివకుమార్, శ్రీలత ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు గడ్డమీది రథంగాపాణి రెడ్డి ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

‘సెయింట్ జార్జ్’లో వీడ్కోలు హంగామా


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కొత్తపల్లి: స్థానిక సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్(సీబీఎస్‌ఈ)లో శనివారం రాత్రి నిర్వహించిన వీడ్కోలు హంగామా అలరించింది. పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ విద్యార్థులు చేసిన సంగీత, నాటక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల చైర్మన్ ఫాతిమారెడ్డి, తిమ్మాపూర్ ఎస్సై శ్రీకాంత్, రిటైర్డ్ ఎంపీడీవో దేవేందర్, డా.సన జవేరియా, అకాడమిక్ సీఈవో ఉమాకాంత్, ప్రిన్సిపాళ్లు భార్గవ్, నిరంజన్, టీచర్లు పాల్గొన్నారు.

‘వింధ్యావాలీ’ విద్యార్థుల క్షేత్ర పర్యటన


డీర్ పార్కులో విద్యార్థులు

సప్తగిరికాలనీ: స్థానిక మెహర్‌నగర్‌లోని వింధ్యావాలీ విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా శనివారం ఎల్ఎండీ సమీపంలోని డీర్ పార్కును సందర్శించారు. ప్రత్యక్ష సందర్శన ద్వారా పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకోవచ్చన్న ఉద్దేశంతో 1వ, 2వ తరగతుల పిల్లలను తీసుకెళ్లామని పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు తెలిపారు. వైస్ చైర్మన్ పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం


బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

విద్యానగర్: యువతకు ఉద్యోగ, ఉపాధి అంశాలను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని డీవైఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. శనివారం నగరంలోని తెలంగాణ చౌక్‌లో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి మాట్లాడుతూ.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ దేశ యువతను మోసం చేసేలా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు లకుపతి నాయక్, నాయకులు నవీన్, కృష్ణ, వినోద్, శ్రవణ్, పవన్, నవీన్, రాజేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

హైటెక్ మోసాల ఆటకట్టు

సైబర్ నిందితుడి వద్ద నేరాలపై శిక్షణ

- ఆపై సొంతంగా నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు
- డేటా ఎంట్రీ జాబ్స్ అంటూ నిరుద్యోగులకు వల
- తెలంగాణ సహా 25 రాష్ట్రాలలో మోసాలు
- రూ.100 కోట్లకు పైగా సొమ్ము వసూలు చేసిన ముఠా
- నలుగురు అంతర్రాష్ట్ర సైబర్ నిందితుల అరెస్టు

సాక్షి, హైదరాబాద్: సైబర్ నిందితుడి వద్ద శిక్షణ తీసుకొని, ఆపై సొంతంగా నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి తెలంగాణ సహా దేశవ్యాప్తంగా మోసాలకు పాల్పడుతున్న మోస్ట్ వాంటెడ్ సైబర్ ముఠా గుట్టురట్టయింది. డేటా ఎంట్రీ జాబ్స్ పేరిట నిరుద్యోగులకు వల వేసి.. ఆపై కంపెనీ షరతులను ఉల్లంఘించారని పేర్కొంటూ నకిలీ లీగల్ నోటీసులు పంపించి బాధితుల నుంచి సొమ్ము వసూలు చేసిందీ గ్యాంగ్. తెలంగాణ, రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్, హరియాణా, ఢిల్లీ, మహారాష్ట్ర వంటి



పోలీసుల అదుపులో నిందితులు

25కుపైగా రాష్ట్రాలలో 358 సైబర్ కేసులున్న ఈ ముఠా.. ఇప్పటివరకు సుమారు రూ.100 కోట్లకు పైగానే సొమ్ము వసూలు చేసినట్లు సైబరాబాద్ సైబర్ క్రైం డీసీపీ శిల్పవల్లి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..

టెలీ కాలర్‌గా పని చేసి..

గుజరాత్‌లోని సూరత్‌లో నకిలీ డేటా ఎంట్రీ కంపెనీలో దిండోలి ప్రాంతానికి చెందిన రాహుల్ అశోక్ భాయ్ భాస్కర్ టెలీ కాలర్‌గా పని చేశాడు. ఓ సైబర్ క్రైమ్ కేసు దర్యాప్తులో భాగంగా స్థానిక పోలీసులు కంపెనీ యజమాని నితీష్‌ను అరెస్టు చేసి, కాల్ సెంటర్‌ను మూసేశారు. కాల్ సెంటర్, డేటా ఎంట్రీ కార్యకలాపాలపై పట్టు సాధించిన రాహుల్.. తన స్నేహితులైన సాగర్ పాటిల్, కల్పేష్ థోరట్, నీలేష్ పాటిల్‌లను సంప్రదించి సైబర్ మోసాల గురించి వివరించాడు. ఈ నలుగురూ కలిసి సూరత్‌లో ఫ్లోరా సొల్యూషన్ పేరుతో నకిలీ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ పోర్టల్స్ నుంచి నిరుద్యోగుల డేటాను సేకరించి, వారికి వాట్సాప్ ద్వారా డేటా ఎంట్రీ జాబ్ సందేశాలను పంపించేవారు. ఆసక్తి కనబరిచిన వారికి జాబ్ లాగిన్ కోసం ఐడీ, పాస్‌వర్డ్ అందించేవారు.



నకిలీ లీగల్ నోటీసులతో బెదిరింపులు..

డేటా ఎంట్రీ పని పూర్తయ్యాక ఉద్యోగికి సొమ్ము చెల్లించకుండా కంపెనీ ప్రమాణాలకు తగిన స్థాయిలో డేటా ఎంట్రీ లేదని మాయమాటలు చెబుతూ సొమ్ము చెల్లించరు. దీంతో కొంతకాలం ఎదురుచూసిన ఉద్యోగికి డేటా ఎంట్రీ చేయడం మానేస్తాడు. అప్పుడే నిందితులు రంగంలోకి దిగుతారు. కంపెనీ నిబంధనలు, షరతులను ఉల్లంఘించారని పేర్కొంటూ నకిలీ లీగల్ నోటీసులను బాధితులకు వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా పంపించి బెదిరింపులకు తెగిస్తారు. నోటీసులు రద్దు చేసుకోవాలంటే చార్జీలను చెల్లించాల్సి ఉంటుందని చెబుతారు. ఈక్రమంలో సైబరాబాద్‌కు చెందిన ఓ బాధితుడు వీరి వలలో చిక్కి రూ.6.17 లక్షలు మోసపోయాడు. ఇప్పటికే ఈ ముఠాపై సైబరాబాద్‌లో 11 కేసులున్నాయి.

వేలాది బ్యాంకు ఖాతాల విశ్లేషణ..

బాధితులు పంపించిన సొమ్ము ఏ బ్యాంకు ఖాతాలు నుంచి ఎక్కడికి బదిలీ అయ్యాయో విశ్లేషించారు. ఇతరత్రా సాంకేతిక అంశాల ఆధారంగా నిందితులు రాహుల్, సాగర్, కల్పేష్, నీలేష్‌లు సూరత్‌లో ఉన్నట్లు గుర్తించారు. రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం వారిని అరెస్టు చేసి, స్థానిక న్యాయస్థానంలో హాజరుపరిచారు. ట్రాన్సిట్ వారంట్ నగరానికి తీసుకొచ్చి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి ఆరు ఫోన్లు, ల్యాప్‌టాప్, 5 డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు సోమవారం కస్టడీకి పిటీషన్ దాఖలు చేయనున్నట్లు డీసీపీ తెలిపారు.

డ్రగ్స్ ముఠా అరెస్ట్

గచ్చిబౌలి: ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో డ్రగ్స్ విక్రేతలను అరెస్టు చేశారు. గచ్చిబౌలి సీఐ జేమ్స్ బాబు తెలిపిన ప్రకారం..యూసూఫ్‌గూడకు చెందిన సులేమాన్ అబుబాకర్ అలియాస్ వాసిమ్, హుమాయున్‌నగర్‌కు చెందిన షేక్ అర్మన్, బంజారాహిల్స్‌కు చెందిన అర్కమ్ హుస్సేన్ రెండేళ్లుగా బెంగళూర్, గోవా నుంచి డ్రగ్ తీసుకొచ్చి పబ్‌లలో విక్రయిస్తున్నారు. నోవాటెల్ అర్బిస్ట్రీ, ఎయిర్ లైవ్ పబ్, క్లబ్‌రాక్‌లో కొకైన్ గ్రాము రూ.15 వేలు, గ్రాము ఎండీఎంఏ రూ.8 వేలకు విక్రయించారు. ఈ క్రమంలో క్లబ్‌లో నిజాంపేట్‌లో నివాసం ఉండే మిథున్ అనే మహిళతో సులేమాన్‌కు పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడటంతో డ్రగ్‌ను ఆమెకు ఉచితంగా ఇచ్చేవాడు. ఆమెతో పాటు వారి స్నేహితులకు డ్రగ్ విక్రయించేవారు. ఈ క్రమంలో విభేదాలు రావడంతో సులేమాన్ మిథున్‌ను వేధించడం మొదలుపెట్టాడు. ఓ వైపు ఆరోగ్యం క్షీణించడం, మరోవైపు వేధింపులు తట్టుకోలేక ఆమె బాచుపల్లి షీ టీంను ఆశ్రయించింది. వారి సూచనలతో టీఎస్ న్యాబ్ సిబ్బందిని ఆశ్రయించింది. జనవరి 30న బెంగళూర్‌కు వెళ్లిన సులేమాన్, అబుబాకర్‌లు అజీం అనే వ్యక్తి వద్ద 10 గ్రాముల కొకైన్, 13 గ్రాముల ఎండీఎంఏ కొనుగోలు చేశారు. ఫిబ్రవరి 2న మిథున్ రెండు గ్రాముల కొకైన్ కావాలని ఆర్డర్ చేసింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మైహోం విహంగ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో మిథున్‌కు రెండు గ్రాముల కొకైన్ అందజేశారు. అప్పటికే మాటు వేసి ఉన్న టీఎస్ న్యాబ్, ఎస్‌వోటీ, గచ్చిబౌలి పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.26 లక్షల విలువ చేసే 10 గ్రాముల కొకైన్, 13 గ్రాముల ఎండీఎంఏ, స్కోడా, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు సులేమాన్, అర్మన్, అర్కమ్, మిథున్‌లను అరెస్ట్ చేశారు. మిథున్‌తో పాటు డ్రగ్ కొనుగోలు చేసేందుకు వచ్చిన కేపీహెచ్‌బీకి చెందిన కొనగళ్ల ప్రియ, బంజారాహిల్స్‌కు చెందిన డాక్టర్ చల్లా చైతన్యలకు '41' నోటీసులు జారీ చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.

అధిక లాభాల పేరిట కుచ్చుటోపీ

సాక్షి, హైదరాబాద్: అధిక లాభాలు ఆశ చూపించి అమాయకులను మోసం చేస్తున్న ఎక్స్‌ఐటీఓ కన్సల్టెన్సీ సర్వీసెస్ (ఎక్స్‌సీఎస్‌పీఎల్) కంపెనీ డైరెక్టర్ బీఎస్ సతీష్‌ను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..బెంగళూరుకు చెందిన సతీష్, అవలకొండప్ప వెంకటచలపతి అనే వ్యక్తితో కలిసి 2015లో బెంగళూరులో ఎక్స్‌సీఎస్‌పీఎల్ పేరుతో కంపెనీ ప్రారంభించారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు చెందిన గాదిరాజు రాజేంద్రప్రసాద్ రాజు, గురు ప్రసాద్, పాసం వెంకట్ ప్రసాద్, జ్యోతిలతో కలిసి కేపీహెచ్‌బీలోని మంజీరా ట్రినిటీలో బ్రాంచ్ ఆఫీసును ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది సామన్యుల నుంచి రూ.2 కోట్లు డిపాజిట్లు వసూలు చేశారు. ఆ తర్వాత పరారయ్యారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

అపోలో కేన్సర్ ఆస్పత్రిలో 'విక్టరీ బెల్'



విక్టరీ బెల్ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు

బంజారాహిల్స్: అపోలో కేన్సర్ ఆస్పత్రిలో 'విక్టరీ బెల్'ను మంత్రి శ్రీధర్‌బాబు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. కేన్సర్ రోగులు అధైర్యపడొద్దన్నారు. ఆత్మవిశ్వాసమే కొండంత బలమని సూచించారు. అపోలో హాస్పటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా విక్టరీ బెల్‌ను ఆవిష్కరించడం ముఖ్యమైన ఘట్టంగా అభివర్ణించారు. ఇది ఆస్పత్రిలోని ఆంకాలజీ యూనిట్లలో జరిగిన పోరాటాలకే కాకుండా ప్రతి కేన్సర్ రోగి ప్రయాణాన్ని ఆవిష్కరిస్తుందన్నారు. విజయం, పట్టుదల స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. అపోలో కేన్సర్ హాస్పటల్ డైరెక్టర్ విజయ్ ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ... విక్టరీ బెల్ నుంచి వచ్చే శబ్దం కేన్సర్‌ను జయించిన వ్యక్తి విజయాన్ని సూచిస్తుందన్నారు.

8,9 తేదీల్లో ఢిల్లీలో బీసీ సమరభేరి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ గౌడ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ బీసీలకు తీవ్ర నిరాశ మిగిల్చిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. బీసీలపై కేంద్ర తీరును నిరసిస్తూ ఈ నెల 8, 9 తేదీలలో ఢిల్లీలో జరిగే బీసీల సమర భేరి సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం రవీంద్రభారతిలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కె.గణేష్ చారి ఆధ్వర్యంలో బీసీల సమర భేరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి బీసీ ప్రధాని ఉన్నప్పటికీ బడ్జెట్‌లో తమకు మొండిచేయే మిగిలిందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బి.బాల్‌రాజ్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ తదితరులున్నారు.

అమెరికా నుంచి వచ్చి.. యువతిని వేధించి..

కటకటాల పాలైన ఓ కంపెనీ సీఈఓ

వెంగళరావునగర్: తన సంస్థలో విధులు నిర్వహిస్తున్న యువతి కోసం అమెరికా నుంచి వచ్చిన ఓ సీఈఓ..ఆమెను వేధించి కటకటాల పాలైన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అమీర్‌పేటలో ఉన్న ఇన్ఫోగ్రావిటీ సంస్థ సీఈఓ టి.చంద్ర అమెరికాలో ఉంటాడు. ఇండియాలో తన కంపెనీ అభివృద్ధిలో భాగంగా నిరంతరం జూమ్ సమావేశాలు ఏర్పాటు చేసి ఉద్యోగులకు సలహాలు, సూచనలు ఇస్తుంటాడు. ఈ క్రమంలో తన కంపెనీలో (అమీర్‌పేట సంస్థ)లో హెచ్‌ఆర్‌గా విధులు నిర్వహిస్తున్న యువతిని జూమ్ సమావేశంలో చూశాడు. అంతేగాకుండా ఆమెపై మనసు పారేసుకున్నాడు. తన కంపెనీ అభివృద్ధి కోసం అందమైన అమ్మాయిలకు ఉద్యోగాలు ఇవ్వాలని సూచించడమే కాకుండా ఆమెను నిత్యం పొగిడేవాడు. అయితే అతను తన యజమాని కావడంతో యువతి ఏమీ అనలేక పోయింది. గతేడాది డిసెంబర్‌లో ఇండియాకు వచ్చిన చంద్ర ఆ యువతిని వేధించడం మొదలుపెట్టాడు. తనతో సన్నిహితంగా ఉండాలని ఒత్తిడి చేశాడు. దీంతో విసుగుచెంది అదే నెల 12న ఉద్యోగానికి రాజీనామా చేసింది. తనకు రిలీవింగ్ లెటర్, జీతం, లీగల్ సరీ్వసెస్ డ్యూస్, ఎక్స్‌పీరియన్స్ లెటర్స్ కావాలని కోరింది. అయితే తన కోర్కె తీరిస్తేనే వాటిని ఇస్తానని చంద్ర చెప్పడంతో ఆమె ఆగ్రహించి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుమారి ఆంటీ హోటల్ రీ ఓపెన్

గచ్చిబౌలి: ఎట్టకేలకు కుమారి ఆంటీ హోటల్ తెరుచుకుంది. ఐటీ కారిడార్‌లో కోహినూర్ హోటల్ ఎదురుగా ట్రాఫిక్ జాం నెలకొనడంతో కుమారి ఆంటీ హోటల్‌ను ఇటీవల రాయదుర్గం ట్రాఫిక్ పోలీసులు తొలగించడంతో వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో కుమారి ఆంటీ హోటల్ తొలగింపు వైరల్ కావడంతో సీఎం కార్యాలయం స్పందించింది. ఈ హోటల్‌ను అదే స్థలంలో నడుపుకోవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ అధికారులను ఆదేశించడంతో వివాదానికి తెరపడింది.



భోజనం వడ్డిస్తున్న కుమారి ఆంటీ

ఆరోగ్యమే విలువైన సంపద

- రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరెపల్లి నంద
- వైద్య శిబిరం ప్రారంభం

మంచిర్యాలఅగ్రికల్చర్: ఆరోగ్యమే అన్నింటికన్నా విలువైన సంపద అని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, మంచిర్యాల జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి సూరెపల్లి నంద అన్నారు. శనివారం నస్పూర్‌లోని సింగరేణి అతిథి గృహంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు, కలెక్టర్ బి.సంతోష్, డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డిలు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. న్యాయమూర్తి పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం సమీకృత కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కోర్టు యూనిట్, కలెక్టరేట్ సిబ్బంది, న్యాయవాదులు, ప్రజల కోసం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సూరెపల్లి నంద మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి, జిల్లా జూనియర్ సివిల్ న్యాయమూర్తులు సీహెచ్.సంపత్, డీ.ఉపనిషధ్వని, జే.ముఖేష్, టీ.రవి, డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో న్యాయమూర్తులు, కలెక్టర్

జిల్లా కోర్టు భవన నిర్మాణానికి కృషి

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కోర్టు భవన నిర్మాణానికి కృషి చేస్తానని హైకోర్టు న్యాయమూర్తి సూరెపల్లి నంద అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం స్థానిక జిల్లా కోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గజమాలతో సన్మానించారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య, సభ్యులు, న్యాయవాదులు జిల్లాలోని కోర్టు భవనాల నిర్మాణం, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు, న్యాయమూర్తులు, అర్పిత మారంరెడ్డి, అసదుల్ల షరీఫ్, ఉపనిషధ్వని, పీపీ పులి రాజమల్లు, న్యాయవాదులు కర్రె లచ్చన్న, సదానందం, రాజేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



న్యాయమూర్తి నందకు గజమాలతో సన్మానం

కాల్చి‌నోళ్లే కన్నీళ్లు పెడుతున్నారు

- హోదా మరిచి మాట్లాడిన సీఎం
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అర్బన్: భూమి కోసం.. భుక్తి కోసం పోరాడిన ఆదివాసీ బిడ్డలను నిర్దాక్షిణ్యంగా కాల్చిచంపిన వారే నేడు కన్నీరు పెడుతున్నారని, ఇంద్రవెల్లి సభలో సీఎం రేవంత్‌రెడ్డి హోదా మరిచి మాట్లాడారని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆరోపించారు. కుమురంభీం జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌లో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మంజూరైన పనులనే ప్రారంభిస్తూ తాము అభివృద్ధి చేస్తున్నామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబంపై విమర్శలు చేస్తే ప్రతి విమర్శలకు దిగుతామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీలను మోసం చేస్తే సహించేది లేదని చెప్పారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగేశ్వర్‌రావ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు మల్లేశ్, శ్రీనివాస్, గుండా వెంకన్న, బాలేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నేడు సీఓఈ సెట్

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఆదిలాబాద్ రీజియన్‌లోని 14 పరీక్ష కేంద్రాల్లో 5,918మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో 1,723మంది, కుమురంభీం జిల్లాలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో 1,495మంది, మంచిర్యాల జిల్లాలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో 2,700 మంది పరీక్షకు హాజరు కానున్నారు. ఆయా జిల్లాల్లో పరీక్ష కేంద్రాలను సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి పర్యవేక్షించారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ తదితర సౌకర్యాలు కల్పించారు. ఓఎంఆర్‌లో బబ్లింగ్ విధానంపై ఇన్విజిలేటర్లు అవగాహన కల్పిస్తారని బెల్లంపల్లి సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు.



బెల్లంపల్లి కేంద్రంలో నంబర్లు వేస్తున్న ప్రిన్సిపాల్

రేపటి నుంచి అయోధ్యకు ప్రత్యేక రైలు

మంచిర్యాలక్రైం: ఈ నెల 5నుంచి అయోధ్యకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే ఆస్తా పేరుతో సికింద్రాబాద్-సాలర్‌పూర్ ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. 5న ప్రారంభమయ్యే రైలు 7, 9, 11, 13వ తేదీల్లో నడుస్తుందని, జనరల్ బోగీలకు మాత్రమే అవకాశం ఉందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో 8వ తేదీ నుంచి 10, 12, 14, 16వ తేదీల్లో రైలు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ రైలుకు సికింద్రాబాద్, జనగాం, ఖాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్లలో హాల్టింగ్ ఉందని తెలిపారు. అయోధ్యకు వెళ్లేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.


5న నాగోబా జాతర ఏర్పాట్లపై సమీక్ష

ఇంద్రవెల్లి: నాగోబా జాతరకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో ఈనెల 5న సమీక్ష ఉంటుందని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత అధికారులు జాతర ఏర్పాట్ల నివేదికలతో హాజరు కావాలని అలయ ఈవో రాజమౌళి ప్రకటనలో కోరారు.

మన పీవీ భారతరత్నం కాదా?

- మంథని నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యే
- మంత్రి నుంచి ప్రధాని వరకు ఎదిగిన దార్శనికుడు
- ఆర్థిక సంస్కరణల ఆద్యుడికి అందని అత్యున్నత పురస్కారం
- అద్వానీకి భారతరత్నతో జోరుగా చర్చ

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముద్దుబిడ్డ, దేశంలో ఆర్థిక సంస్కరణలకు బీజం వేసిన మహోన్నతుడు మాజీప్రధాని పీవీ నరసింహారావు. పుట్టింది పాత వరంగల్ జిల్లాలోనైనా, పెరిగింది మన కరీంనగర్‌లోనే. ఆయన మంథని నుంచి 1957 నుంచి 1977 వరకు ఎమ్మెల్యేగా గెలిచారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా, ముఖ్యమంత్రిగా కరీంనగర్ నుంచి సేవలు అందించారు. రాజీవ్‌గాంధీ మరణం తర్వాత మైనార్టీ ప్రభుత్వాన్ని విజయవంతంగా ఐదేళ్లు నడిపిన ఏకైక ప్రధానిగా అరుదైన రికార్డును సొంతం చేసుకున్న గొప్ప వ్యక్తి. ఆయన ప్రధానిగా పదవి చేపట్టిన సమయంలో దేశఆర్థిక వ్యవస్థ పతనావస్థలో ఉంది. దీనికి తోడు ఉత్తరాన పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం, దక్షిణాదిన నక్సలిజం, భూపోరాటాలు పేట్రేగిపోతున్నాయి. ఇవి చాలవన్నట్లుగా మైనార్టీ ప్రభుత్వం. ఇన్ని ఆటంకాలను విజయవంతంగా దాటి దేశ ఆర్థిక వ్యవస్థను సుస్థిర మార్గంలో ప్రయాణింపజేసిన దార్శనికుడికి భారతరత్న ఇంకా రాకపోవడంపై ఉమ్మడి జిల్లావాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దేశంలో టెక్నాలజీ, ఐటీ, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేసి యువతను ఉగ్రవాదం నుంచి ఉపాధి వైపు మళ్లించిన మహనీయుడిగా పీవీ ఖ్యాతికెక్కారు. లిబరైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్(ఎల్‌పీజీ) అన్న పీవీ విధానం దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించింది. తమిళనాడు, బిహార్ మాజీ ముఖ్యమంత్రులకు, పాకిస్తాన్, సౌతాఫ్రికా పౌరులకు దక్కిన అత్యున్నత పురస్కారం మన మంథని మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ ముద్దుబిడ్డకు మాత్రం ఎందుకు దక్కడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవతీసుకుని ఆయనకు భారతరత్న పురస్కారం ఇప్పించేలా కృషి చేయాలని కోరుతున్నారు.




రాజకీయ ప్రస్థానం ఇక్కడే..

1921లో అప్పటి హైదరాబాద్ సంస్థానంలోని వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లంకెపల్లి గ్రామంలో సీతారామారావు- రుక్మాబాయి దంపతులకు పీవీ నర్సింహారావు జన్మించారు. అనంతరం ఆయన్ను పాములపర్తి రంగారావు దంపతులు దత్తత తీసుకోవడంతో అప్పటి కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం(ప్రస్తుతం హన్మకొండ జిల్లా)లోని వంగరకు వచ్చారు. అక్కడ ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేశారు. ఉస్మానియా వర్సిటీలో వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్నందుకు ఆయన్ను బహిష్కరించారు. దీంతో ఆయన నాగ్‌పూర్ వెళ్లి విద్యనభ్యసించారు. దేశ స్వాతంత్య్ర సమరంలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్‌లో చేరారు. 1957లో మంథని నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత ఆయన రాజకీయ జీవితంలో వెనుదిరిగి చూసుకోలేదు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా, కేంద్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా.. ఇలా అన్నిరకాల పదవులకు ఆయన వన్నె తెచ్చారు. నిర్వహించిన ప్రతీ పదవిలో ఆయన సమర్థతను చాటుకున్నారు.

కరీంనగర్‌పై ఆయన ముద్ర..

- పాత కరీంనగర్ జిల్లాపై పీవీ నరసింహారావు చెరగని ముద్రవేశారు.
- మంథని నుంచి 20 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న ఆయన ఇక్కడ ఉన్నప్పుడే ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా సేవలందించారు.
- ముఖ్యంగా జిల్లావ్యాప్తంగా లక్షలాదిమందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఎస్ఆర్ఆర్ కాలేజీ ఆరంభంలో 1959లో గవర్నింగ్ కౌన్సిల్‌లో ఆయన సభ్యుడిగా కాలేజీ అభివృద్ధికి కృషి చేశారు.
- మహారాష్ట్ర, తెలంగాణను కలిపేలా పెద్దపల్లి – నిజామాబాద్ మధ్య రైల్వే మార్గం ఆయన చొరవతోనే సాకారమైంది

పీవీకి ఇస్తే దక్షిణాది రాష్ట్రాలకు గౌరవం



ఆర్థిక సంస్కరణల పితామహుడు, దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో సంకీర్ణ ప్రభుతానికి ఐదేళ్లపాటు పగ్గాలు చేపట్టారు. అన్ని రంగాల్లో దేశాన్ని అగ్రగామిగా అభివృద్ధి చేయడమే కాకుండా కీర్తి, ప్రతిష్టలను ఇనుమడింపజేశారు. ప్రధానిగా దేశానికే వన్నే తెచ్చిన వ్యక్తికి భారతరత్న ఇవ్వడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు గౌరవం దక్కినట్లు అవుతుంది.

– కె.రామకృష్ణ, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్

బకాయిలు చెల్లించండి

- త్వరలోనే 'గృహ జ్యోతి' రాయితీ
- ట్రాన్స్‌కో ఎస్ఈ సుదర్శనం

సుల్తానాబాద్(పెద్దపల్లి): విద్యుత్ వినియోగదారులు బకాయిలు చెల్లించి సంస్థకు సహకరించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ సుదర్శనం కోరారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ మీటర్ల పనితీరును అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ వివరాలు వెల్లడించేందుకు స్థానిక యశోద నరహరి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సుదర్శనం మాట్లాడారు. సుల్తానాబాద్‌లో 6,500 విద్యుత్ మీటర్లు ఉన్నాయని తెలిపారు. ఇందులో నివాసాల కోసం తీసుకున్న కనెక్షన్ల ఆధారంగా కమర్షియల్‌కు వినియోగిస్తున్నారని గుర్తించామని అన్నారు. పోల్ టు పోల్ సర్వే ద్వారా మీటర్లకు వేసిన సీల్ తొలగించిన కొందరు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నారని తేల్చామని చెప్పారు. అదేవిధంగా వినియోగదారులు తమ దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారని, వాటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు ఉచిత విద్యుత్ కోసం ఏఈలకు కుల ధ్రువీకరణపత్రం అప్పగించాలని సూచించారు. ప్రభుత్వం త్వరలో గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు సబ్సిడీ విద్యుత్ అందించబోతుందని తెలిపారు. అందుకే, బకాయిలు వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. కుటుంబంలో వేరుపడిన వారికి విద్యుత్ మీటర్లు మంజూరు చేస్తున్నామని, ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అధికారులు తిరుపతి, ఈశ్వర్ ప్రసాద్, రవి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.







'మీ ఎట్ 21' వైరల్ ట్రెండ్

ఇన్‌స్టాగ్రామ్‌లో ఇప్పుడు 'మీ ఎట్ 21' వైరల్ ట్రెండ్ నడుస్తోంది. ఈ ట్రెండ్‌లో భాగంగా 21 ఏళ్ల వయసులోని తమ ఫోటోలను సామాజిక మాధ్యమాల్లో యూజర్‌లు పోస్ట్ చేస్తున్నారు. ఆ వయసులో తమ తీపి, చేదు జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకుంటున్నారు.

అరిజోనా (యూఎస్)కు చెందిన 43 ఏళ్ల డామిన్ రఫ్ ఈ ట్రెండ్‌కు కారణం. మెక్సికోలో జరిగిన తన 21 వ బర్త్‌డే ఫోటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు.ఈ ఫోటో 'ఇంతింతై... అంతంతై' చివరికి వైరల్ ట్రెండ్‌గా మారింది.

కరీనా కపూర్, ప్రియాంక చోప్రా, కాజల్‌లు కూడా ఈ వైరల్ ట్రెండ్‌లో భాగం అయ్యారు. కరీనా కపూర్ తన ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. 'అశోక' సినిమాలో షారుఖ్‌ఖాన్ పక్కన ఉన్న ఫోటోను షేర్ చేస్తూ 'ఫీలింగ్ 21 దిస్ మార్నింగ్' అనే కాప్షన్ ఇచ్చింది. మరో ఫోటోకు '21' అని కాప్షన్ ఇచ్చి రెడ్ హార్ట్ ఇమోజీ జోడించింది. ప్రియాంక చోప్రా మోడలింగ్ రోజుల నాటి ఫోటోలను షేర్ చేసి 'లెర్న్ ఏ లాట్ సిన్స్ దెన్' అని కాప్షన్ ఇచ్చింది. బైక్‌పై కూర్చున్న తన ఫోటో షేర్ చేస్తూ 'ఉయ్ డిడ్ వెల్. ప్యాట్ ఆన్ ది బ్యాక్ ఫర్ ది యంగర్ మీ' అని కాప్షన్ ఇచ్చింది కాజల్.



తమ్ముడూ... ఎలా ఉన్నావు?

మనం స్కూటర్‌పై వెడుతుంటే పక్కన కారులో మన అభిమాన హీరో లేదా క్రికెటర్ కనిపిస్తే 'ఇది కలా? నిజమా?' అనుకుంటాం. సచిన్ టెండూల్కర్ వీరాభిమానికి కూడా ఇలాంటి అనుభవమే ఎదురైంది.

టూ వీలర్‌పై వెళుతున్న హరీష్‌కుమార్‌ను కారులో వెళుతున్న వ్యక్తి 'ఎయిర్‌పోర్ట్‌కు ఎలా వెళ్లాలి?' అని అడిగాడు.

సమాధానం చెప్పడానికి రెడీ అయిన హరీష్ అటువైపు చూసి స్వీట్ షాక్‌కు గురయ్యాడు. అతడు ఎవరో కాదు సచిన్ టెండూల్కర్. రోడ్డు మీద నుంచి క్లౌడ్ 9లోకి వెళ్లిన హరీష్ 'నమ్మలేకపోతున్నాను. థ్యాంక్యూ గాడ్' అన్నాడు. ఆటోగ్రాఫ్ ఇచ్చి సెల్ఫీ దిగిన సచిన్ హెల్మెట్ ధరించి డ్రైవ్ చేస్తున్నందుకు హరీష్‌ను అభినందించాడు. 'నేను కూడా సీటు బెల్ట్ ధరించాను చూడు' అన్నాడు.

హరీష్ ధరించిన ముంబై ఇండియన్స్ జెర్సీ వెనుక 'టెండూల్కర్ 10 ఐ మిస్ యూ' అనే అక్షరాలు కనిపిస్తాయి. కారులో వస్తున్న సచిన్‌కు ఆ అక్షరాలు కనిపించాయి. అభిమానితో కాసేపు ఆప్యాయంగా మాట్లాడేలా చేశాయి. ఈ వీడియో క్లిప్‌ను సచిన్ టెండూల్కర్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. ఇది క్విక్‌గా వైరల్ అయింది. అయిదు మిలియన్‌లకు పైగా వ్యూస్ వచ్చాయి.

వైరల్

వర్చువల్ ఎవరెస్ట్ జర్నీ

ఎవరెస్ట్ శిఖరం 360 డిగ్రీల కెమెరా వ్యూ ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. వర్చువల్ జర్నీ రూపంలో సరికొత్త అనుభవాన్ని అందిస్తోంది. పర్వతారోహకులు ఎదుర్కొనే కఠినమైన వాతావరణ పరిస్థితులను అనుభవంలోకి తెచ్చేలా ఉంటుంది ఈ వర్చువల్ జర్నీ. స్కిల్‌డ్ మౌంటెనీర్స్ టీమ్ ఈ ఫుటేజిని కాప్చర్ చేసింది.



'ఏ 360 డిగ్రీ కెమెరా వ్యూ ఫ్రమ్ ది టాప్ ఆఫ్ మౌంట్ ఎవరెస్ట్' కాప్షన్‌తో అష్రఫ్ జబ్ర 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఈ వీడియో వేలాది వ్యూస్‌ను సొంతం చేసుకుంది. పర్వతారోహక బృందం ధైర్యసాహసాలకు, సాంకేతిక నైపుణ్యానికి నెటిజనులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

'టాప్ ఆఫ్ ది వరల్డ్! థ్యాంక్‌ఫుల్ ఫర్ గాడ్స్ క్రియేషన్'... నెటిజనుల నుంచి ఇలాంటి కామెంట్స్ ఎన్నో కనిపించాయి.

దొరకునా ఇటువంటి దోశ!

● ఈ దోశను గాల్లో విసురుతారు



'వ్యాపారం అన్నాక నమ్మకమే కాదు కాస్త స్పెషాలిటీ కూడా ఉండాలి' అంటూ రకరకాల పబ్లిసిటీ గిమ్మిక్కులు చేస్తుంటారు కొందరు వ్యాపారులు. ముంబైలో 'వికెట్–కీపర్ దోశవాలా' అనే టిఫిన్ సెంటర్ ఉంది. బోడిగుండుకూ మోకాలికీ ముడిపెట్టినట్లు 'వికెట్ కీపర్‌కు, దోశకు ఏమిటి సంబంధం?' అనే కొశ్చన్ వస్తుంది.

ఈ టిఫిన్ సెంటర్ స్పెషాలిటీ ఏమిటంటే...

పెనం మీద తయారైన వేడి వేడి దోశను కస్టమర్‌కు ప్లేట్లో పెట్టి ఇవ్వరు.

కస్టమర్ ఒక ప్లేటు పట్టుకొని కాస్త దూరంలో నిలబడాలి. పెనం మీద ఉన్న వేడి వేడి దోశను బాల్‌ని విసిరినట్లు గాల్లో విసిరేస్తారు. కస్టమర్ మహాశయుడు ఈ దోశను తన ప్లేటుతో క్యాచ్ పట్టాలి.

'ఇదేమి పిచ్చి నాయనా' అని మనం అనుకున్నా సరే 'ఆ కిక్కే వేరప్పా' అంటున్నారు ఈ టిఫిన్ సెంటర్‌కు రెగ్యులర్‌గా వచ్చే కస్టమర్‌లు.

ముకాబులా సాంగ్ ఘంటసాల గొంతులో...




'రెహమాన్‌జీ... ముక్కాలా ముకాబులా పాటను ఘంటసాల గొంతులో వినిపిస్తే వినాలని ఉంది'

'ఒకే ఒక్కడు సినిమాలో జానకి పాడిన ధీరా మగధీరా పాటను భానుమతి గొంతులో వినిపించగలరు'... ఇలాంటి విన్నపాలెన్నో సోషల్‌మీడియా వేదికగా వినిపిస్తున్నాయి.

రజనీకాంత్ 'లాల్ సలాం' సినిమాలోని ఒక పాట కోసం దివంగత గాయకులు బంబా బక్యా, షాహుల్ హమీద్ గొంతులను ఏఆర్ రెహమాన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో రీక్రియేట్ చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన రెహమాన్ పోస్ట్ వైరల్ కావడం మాట ఎలా ఉన్నా...'బంబా బక్యా–షాహుల్ హమీద్‌ల గురించి తెలియనివారు గూగుల్‌లో సెర్చ్ చేస్తున్నారు. వారి గురించి విశేషాలు తెలుసుకుంటున్నారు.

గోపాల మురిపాల బాల

కొన్ని వీడియోలు వైరల్ కావడానికి మాటలు, నిడివితో పనిలేదు. 'హార్ట్ వార్మింగ్ ఎలిమెంట్'తో మౌనంగానే వైరల్ అవుతాయి. ఈ వీడియో అలాంటి కోవకు చెందింది. ఆరుబయట మంచంపై కూర్చొని ఆడుకుంటున్న ఓ పాప దగ్గరికి ఆవు వచ్చి 'ఎలా ఉన్నావు పాపా?' అన్నట్లుగా



ఎక్స్‌ప్రెషన్ ఇచ్చింది. పాప ఆవు ముఖాన్ని చేతుల్లోకి తీసుకొని నిమురుతూ 'నేను బాగానే ఉన్నాను. నీ సంగతి ఏమిటి?' అన్నట్లుగా నవ్వుతుంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అయిన ఈ వీడియో లక్షలాది వ్యూస్‌తో దూసుకుపోతోంది.

హెల్త్

నేడు వరల్డ్ క్యాన్సర్ డే



జీన్ సైలెన్సింగ్ ఎడిటింగ్!



మనం ఏదైనా రాస్తుంటాం. లేదా సినిమా కోసం రీల్స్ తీస్తుంటాం. తీరా రాశాక లేదా తీశాక అది అంత సరిగా లేదని లేదా కోరుకున్నట్లుగా రాలేదనీ లేదా తీసిన సమాచారం అవసరం లేదనిపిస్తుంది. అప్పుడు మనం చేసే పని 'ఎడిటింగ్'! అలాగే... మన ప్రతి ఒక్కరి జీవితంలో... మన అవయవ నిర్మాణం, వికాసం, ఆరోగ్యచరిత్ర... వీటన్నింటికీ మూలం ఈ రాత లేదా రీల్స్ రూపంతో పోలిక గల జన్యువులు. ఎక్కడైనా పదాలు తప్పుగా వస్తే వాటిని సవరించినట్లుగా, సినిమాలో రీల్స్ తప్పుగా వస్తే వాటిని సరి చేసినట్టుగానే... ఈ జన్యుపొరబాట్లనూ సరి చేసే ప్రక్రియే 'జీన్ ఎడిటింగ్'. అత్యంత సంక్లిష్టమైన ఈ ప్రక్రియలతో జన్యులోపాలతో వచ్చే క్యాన్సర్లనూ లేదా జబ్బులను పూర్తిగా నయం చేయవచ్చు. ఫిబ్రవరి 4న 'ప్రపంచ క్యాన్సర్ డే' సందర్భంగా ఈ అత్యంత కొత్త చికిత్స విధానాల్ని తెలుసుకునే ప్రయత్నమే ఈ కథనం.

మన దేహం మొత్తం కణాలతో నిర్మితమై ఉంటుంది. కణం మధ్యలోని న్యూక్లియస్‌లో క్రోమోజోములుంటాయి. ఈ క్రోమోజోములన్నీ డీఎన్ఏ, ఆర్ఎన్ఏలతో కలగలసిన జన్యువులతో నిర్మితమై ఉంటాయి. మన దేహం తాలూకు అన్ని జీవక్రియలూ వాటి మీదే ఆధారపడి నడుస్తుంటాయి. అంటే జీవకణంలో జరిగే మొత్తం ప్రాసెసింగ్‌కు ఈ ఆర్ఎన్ఏలు దోహదపడుతుంటాయి. అవి చేసే పనులను బట్టి ఎమ్ ఆర్ఎన్ఏ, ఆర్ ఆర్ఎన్ఏ, టీ ఆర్ఎన్ఏ అనే రకాలతో ప్రోటీన్‌ల రూపకల్పనకు సహాయపడుతుంటాయి. ఈ ఆర్ఎన్ఏ, డీఎన్ఏల ప్రాసెసింగ్ ప్రక్రియల్లో తేడాలు జరిగినప్పుడు అవి వ్యాధుల రూపంలో... ప్రధానంగా క్యాన్సర్లుగా బయటపడతాయి.

జన్యులోపాలతో వ్యాధులు ఎలాగంటే...

కొన్ని మన జన్యువుల మూలస్థానాల్లో పొరబాటు జరిగినప్పుడు... అది ఓ జబ్బు రూపంలో అందునా క్యాన్సర్‌ల రూపంలో ఎలా బయటపడతాయో చూద్దాం. ఉదాహరణకు బీసీఆర్ ఏబీఎల్ అనే జన్యువులో లోపం వల్ల... టైరోసిన్ కైనేజ్ అనే ఓ ఎంజైము నిరంతరాయంగా ఉత్పత్తి అవుతూ ఉంటుంది. అది అత్యధికంగా తెల్లరక్త కణాలను ఉత్పత్తి చేయమంటూ దేహానికి ఆదేశాలు అందజేస్తుంది. దాంతో ఓ తెల్లరక్తకణం జీవితకాలం పూర్తి కాకుండానే అనేక తెల్లరక్తకణాలు పుట్టుకొస్తుంటాయి. పాలు విరిగినప్పుడు పనికిరాని విధంగానే... రక్తంలో లోపభూయిష్టమైన తెల్లరక్తకణాలు గుంపులు గుంపులుగా గుమిగూడిపోయి, పూర్తిస్థాయి మెచ్యూరిటీ రాకుండానే నశించిపోయి రక్తం విరిగినట్లుగా కనిపిస్తుంటుంది. ఇలా జరగడం వల్ల అది 'క్రానిక్ మైలాయిడ్ లుకేమియా' అనే బ్లడ్ క్యాన్సర్‌కు దారితీస్తుంది. ఇదొక ఉదాహరణ మాత్రమే. ఇలా ఒక జన్యువు చెడిపోవడం వల్ల / లోపం కలగడం వల్ల వచ్చే క్యాన్సర్లు చాలా రకాలే ఉంటాయి.

కొత్త చికిత్స ప్రక్రియలేమిటి... అవి ఎలా పనిచేస్తాయంటే...

జన్యువులు, జెనెటిక్ కోడ్స్‌లో వచ్చే మ్యూటేషన్లు, వాటి కారణంగా ఉత్పన్నమయ్యే లోపాల కారణంగా వచ్చే వ్యాధులకు చికిత్స అందించడానికి పరిశోధకులు సరికొత్త విధానాలను కనుగొంటున్నారు. వాటిల్లో జీన్ ఎడిటింగ్‌లూ, జీన్ సైలెన్సింగ్‌లన్నవి ఇటీవలే కనుగొన్న విధానాలు.

అదెలాగంటే...

ఇంతకుముందు మనం చెప్పుకున్నట్లుగా కణంలోని జీవక్రియల్లో రకరకాల ఆర్ఎన్ఏలు... (తాము ఏ రకానికి చెందినవన్న దాన్ని బట్టి)... జన్యు సమాచారాన్ని అందజేయడం, నిక్షిప్తపరచడం వంటి పనులు చేస్తాయి. ఇవన్నీ ఎమైనో యాసిడ్‌లూ, ప్రోటీన్‌లు ఏర్పడటం ద్వారా జరుగుతుంటాయి. ఇలా ప్రోటీన్‌లు రూపొందే సమయంలో కొన్ని అదనంగా (ఎక్స్‌ట్రా) ఏర్పడవచ్చు. మరికొన్ని ఏర్పడాల్సిన విధంగా ఏర్పడకుండా మిస్ (మిస్సింగ్) కావచ్చు. లేదా ఇంకొన్ని తప్పుడు సీక్వెన్స్‌లో ఏర్పడవచ్చు. వీటిల్లో ఏది జరిగినా.... అది వ్యాధిగా వ్యక్తమవుతుంది.

చక్కదిద్దడానికి పరిశోధకులు చేస్తున్నదేమంటే...

ఇలా జన్యువుల్లోని లోపాల వల్ల వచ్చే క్యాన్సర్లను చక్కదిద్దడానికి పరిశోధకులు కొన్ని ఎడిటింగ్ ప్రక్రియలను అనుసరిస్తున్నారు. ఇందులో భాగంగా వారు మొత్తం ఆర్ఎన్ఏ కాకుండా... తమకు కావాల్సిన మేరకు చిన్న చిన్న ఆర్ఎన్ఏ లేదా డీఎన్ఏ స్ట్రాండ్స్ రూపొందిస్తారు. ఇలా రూపొందించిన స్ట్రాండ్స్‌ను 'యాంటీ సెన్స్ ఆలిగో న్యూక్లియోటైడ్స్' (ఏఎస్ఓ)లని అంటారు.

కణంలోని జన్యుసమాచారాన్ని అందించడం, ఉపయోగించడం వంటి కార్యకలాపాలు జరిగే సమయంలో.. బహిర్గతం కావాల్సిన ప్రోటీన్ భాగాలు బయటకు రాకపోయినా, లోపలే ఉండాల్సినవి బయటకు వచ్చినా లేదా ఆర్ఎన్ఏ రూపంలో తేడాలు వచ్చినా అది క్యాన్సర్‌గా బయటపడుతుందని ఇప్పటికే తెలుసుకున్నాం కదా.

ఇప్పుడు పరిశోధకులు రూపొందించిన ఈ 'యాంటీ సెన్స్ ఆలిగోన్యూక్లియోటైడ్స్' లేదా సంక్షిప్తంగా ఏఎస్ఓలనేవి చిన్న చిన్న స్ట్రాండ్స్‌గా ఏర్పడి... ప్రధానంగా ఈ కింద పేర్కొన్న పద్ధతుల్లో వాటిని చక్కదిద్దుతాయి. అదెలాగంటే...

1. ఆర్ఎన్ఏలో లోపభూయిష్టమైన ప్రాంతం ఉంటే...

ఈ చిన్న స్ట్రాండ్స్ అక్కడికి వెళ్లి లోపభూయిష్టమైన / ప్రమాదకరమైన దాన్ని తొలగించడం లేదా పూర్తిగా కత్తిరించి మాయం చేయడం చేస్తాయి. (ఇది ఒకరకంగా ఎడిటింగ్ లాంటి ప్రక్రియ).

2. ఈ ఏఎస్ఓలు...

ఆర్ఎన్ఏ లోని లోపభూయిష్టమైన ప్రాంతాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడం ద్వారా జన్యులోపాలను చక్కదిద్దుతాయి. ఇక్కడ ఏఎస్ఓలు రెండు రకాలుగా పని చేస్తాయి. మొదటిది లోపభూయిష్టం కావడం వల్ల అవాంఛితమైన జన్యుపదార్థాలను అసలు పుట్టకుండా చేయడం లేదా ఆలస్యం చేయడం.

3. మరో ఇతర ఆరోగ్యకరమైన జన్యువులోంచి...

తనకు కావాల్సిన విధమైన కార్యకలాపాలు నిర్వహించే ఆరోగ్యకరమైన జన్యువునే ఉద్భవింపజేసి, దాన్ని ఇక్కడ వాడుకునేలా చేస్తాయి ఈ ఏఎస్ఓలు.

ఇలా చేయడం ద్వారా స్పైనల్ మస్క్యులార్ ఎట్రోఫీ అనే వెన్నుకు సంబంధించిన కండరాల వ్యాధి, ఫ్రంటో టెంపోరల్ డిమెన్షియా అనే మతిమరపు వ్యాధులకు పరిశోధకులు ఇప్పటికే సమర్థమైన చికిత్సా విధానాలను, పూర్తిస్థాయి పరిష్కారాలను కనుగొన్నారు.



డాక్టర్ సురేశ్ ఏవీఎస్
సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్

'యాంటీ సెన్స్ ఆలిగోన్యూక్లియోటైడ్స్'లను రూపొందింది ప్రకృతి నేర్పిన పాఠాల నుంచే...

ప్రకృతి చాలా అద్భుతమైనదీ, సంక్లిష్టమైనది. మన దేహంలోని ఒక కణంలో పది పక్కన పదమూడు సున్నాలు పెట్టినన్ని జన్యువులు ఉంటాయి. అంతేకాదు... రోజుకు మన దేహంలో పది పక్కన పన్నెండు సున్నాలు పెట్టినన్ని కొత్త కణాలు పుడుతూ ఉంటాయి. ఇన్నిన్ని కణాల్లో ఇంతగా విభజన జరిగే సమయంలో ఎక్కడో ఒకచోట ఎంతో కొంత పొరబాటు జరగకమానదు. వీటిని సరి చేయడం కోసమే మన దేహంలో 'మిస్ మ్యాచ్ రిపేర్ జీన్ మెకానిజమ్' అనే ప్రక్రియ ద్వారా పొరబాట్లను చక్కదిద్దడం జరుగుతుంది. ఏఎస్ఓ జీన్ మాడిఫికేషన్‌లూ, ఎడిటింగ్‌లూ, సైలెన్సింగ్‌లను జీన్ మాడిఫికేషన్ ప్రక్రియ ద్వారా ప్రకృతి నేర్పిన పాఠాల నుంచే నేర్చుకున్న పరిశోధకులు... ఇప్పుడు వీటినే లోకకళ్యాణం కోసం ఉపయోగిస్తూ కొత్త చికిత్స ప్రక్రియలను కనుగొంటున్నారు.

చివరగా... ఇప్పుడు ఇదే ప్రక్రియనూ, ఇవే సిద్ధాంతాలను ఉపయోగించి... కొన్ని జన్యువులను ఎడిటింగ్ చేయడం ద్వారా, అవ్యక్తంగా ఉండాల్సిన మరికొన్ని జన్యువులు వ్యక్తమవుతున్నప్పుడు వాటిని నిశ్శబ్దపరచడం (సైలెన్సింగ్) ద్వారా సీఎమ్ఎల్ మొదలుకొని చాలా రకాల క్యాన్సర్లకు చికిత్సలను కనుగొని పూర్తిగా నయం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే ప్రస్తుతానికి కేవలం ఒకే జన్యువు లోపం వల్ల ఒకే వ్యాధి వచ్చే కేసుల్లోనే ఈ తరహా చికిత్స పనిచేస్తుందంటూ పరిశోధకులు దీని పరిమితులనూ చెబుతున్నారు. ఈ తరహా చికిత్సతో చాలా క్యాన్సర్లు పూర్తిగా నయమయ్యే అవకాశం ఉండటం మనకు దగ్గర్లో కనిపిస్తున్న ఓ ఆశారేఖ.

క్యాన్సర్ చికిత్స కోసం మరికొన్ని కొత్త పద్ధతులు

జీన్ సైలెన్సింగ్, జీన్ ఎడిటింగ్ అన్నవి ప్రయోగాత్మకంగా విజయవంతమైన చికిత్స ప్రక్రియలు. ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావాల్సి ఉంది. కానీ ఇప్పటికే కొన్ని దేశాలలో కొంతవరకు అందుబాటులోకి వచ్చిన మరికొన్ని ఆధునిక, ఆసక్తికరమైన చికిత్స, నిర్ధారణ ప్రక్రియల గురించి తెలుసుకుందాం.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో

ఇప్పుడంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్రెండ్ నడుస్తోంది. క్యాన్సర్ చికిత్సలోనూ పరిశోధకులు కృత్రిమ మేధ సహాయం తీసుకుంటున్నారు. క్యాన్సర్ సెల్ కూడా ఒక కణమే కాబట్టి దాని జన్యుపటలాలను మనిషి ఒక్కడే అర్థం చేసుకోవాలంటే చాలా టైమూ, శ్రమ వృథా అయ్యే అవకాశముంది కాబట్టి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ 'ఏఐ' సహాయంతో క్యాన్సర్ జీనోమ్ స్ట్రక్చర్‌ను విశ్లేషిస్తున్నారు. ఆ విశ్లేషణల ఆధారంగా క్యాన్సర్ కణాన్ని ఎలా తుదముట్టించవచ్చో తెలుసుకుని, ఆ మేరకు కొత్త చికిత్సలను రూపొందిస్తున్నారు.

ఎలక్ట్రానిక్ నోస్ (ఈ–నోస్)తో క్యాన్సర్ వాసన పసిగట్టే ప్రయత్నం

క్యాన్సర్ వ్యాధి కణం చాలా చాలా చిన్నగా ఉంటుంది. దాని సైజుకు దాదాపు నాలుగు వందల రెట్లు పెరిగాకే... ఆ కణజాలాన్ని కనుగొనడం సాధ్యమవుతుంది. కానీ అప్పటికే ఆలస్యం కావడంతో క్యాన్సర్‌ను ఎదుర్కోవడం కష్టమవుతుంది. అయితే ఒక చిన్న మూత్రపరీక్షతో చాలా చాలా తొలిదశలోనే క్యాన్సర్‌ను కనుగొనే సాంకేతికతను అభివృద్ధి చేశారు ఇజ్రాయెల్‌లోని బీర్షెబాలో ఉన్న 'బెన్–గురియన్ యూనివర్సిటీ ఆఫ్ నెగావ్' కు చెందిన పరిశోధకులు. ఒక ఎలక్ట్రానిక్ ముక్కును వీరు రూపొందించారు. రొమ్ము క్యాన్సర్ ఉన్న మహిళల్లో వాళ్ల మూత్రపు వాసన ద్వారా ఈ ఎలక్ట్రానిక్ ముక్కు క్యాన్సర్‌ను పసిగడుతుంది. దీన్ని 'ఈ–నోస్' అని పిలుస్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే మామోగ్రఫీ లాంటి అడ్వాన్స్‌డ్ పరీక్షలతో కాకుండా... చాలా చవగ్గా రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్ష చేయించుకునే అవకాశం రాబోతోంది.

టీఆర్‌కే ఫ్యూజన్ ప్రోటీన్

క్యాన్సర్ కణం తాలూకు జన్యుపటలం ఆరోగ్యకరమైన కణంలా కాకుండా విభిన్నంగా ఉండటమే కాదు... విపరీతంగా కూడా ప్రవర్తిస్తుంటుంది. టీఆర్‌కే ఫ్యూజన్ ప్రోటీన్ అనే ప్రక్రియ ద్వారా క్యాన్సర్ కణ జన్యుపటలంలోని ప్రోటీన్ల చైన్‌లలో మార్పులేవైనా చేయడం ద్వారా అది తనంతట తాను నశించిపోయే అవకాశాల్ని పరిశీలిస్తున్నారు. ఇది జరిగితే క్యాన్సర్ చికిత్సలో అది ఓ విప్లవాత్మకమైన మార్పు అవుతుంది.

హైపర్‌థెర్మిక్ ఇంట్రా పెరిటోనియల్ కీమోథెరపీ ప్రయోగం మరింత విస్తృతంగా

కీమోథెరపీ ఇచ్చినప్పుడు అది దేహంలోని ఒక భాగంలో ఉన్న క్యాన్సర్‌పైనే కాకుండా దేహంలోని మొత్తం కణాలపైనా పనిచేస్తుంటుంది. దీనికి భిన్నంగా ప్రయోగించేదే హైపర్ థెర్మిక్ ఇంట్రా పెరిటోనియల్ కీమోథెరపీ. ఇందులో పొట్ట తెరిచి కడుపు కుహరంలో మందును ఉంచుతారు. అక్కడది విపరీతమైన వేడిపుట్టిస్తూ, క్యాన్సర్ కణాలను మాడ్చేస్తుంది. ఆరోగ్యకరమైన కొన్ని కణాలూ భస్మమైనప్పటికీ అవి మళ్లీ పుడతాయి. కానీ క్యాన్సర్ కణాలు పూర్తిగా మటుమాయమైపోతాయిగానీ మళ్లీ పుట్టవు. ఈ థెరపీని కొన్ని కడుపు క్యాన్సర్లలో వాడుతున్నారు.

స్పోర్ట్స్



రష్మిక సంచలనం

ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ-125 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సంచలనం సృష్టించింది. ముంబైలో శనివారం జరిగిన మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో ప్రపంచ 374వ ర్యాంకర్ రష్మిక 6-3, 6-2తో ప్రపంచ 117వ ర్యాంకర్ వాలెంటిని గ్రామటికోపులు (గ్రీస్)ను బోల్తా కొట్టించింది. మొర్వాయోవా (స్లొవేకియా)తో నేడు జరిగే క్వాలిఫయింగ్ రెండో మ్యాచ్‌లో రష్మిక గెలిస్తే మెయిన్ 'డ్రా'కు అర్హత సాధిస్తుంది.

సెమీస్‌లో ఓడిన అష్మిత

థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ బరిలో మిగిలిన భారత క్రీడాకారిణి అష్మిత చాలిహా సెమీఫైనల్లో వెనుదిరిగింది. బ్యాంకాక్‌లో శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 61వ ర్యాంకర్ అష్మిత 13-21, 12-21తో ప్రపంచ 17వ ర్యాంకర్ సుపనిద (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. అష్మితకు 3,045 డాలర్ల (రూ. 2 లక్షల 52 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 4,900 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



బుమ్రా కూల్చేశాడు


బుమ్రా
6/45


బుమ్రా యార్కర్‌కు ఒలీ పోప్ క్లీన్‌బౌల్డ్

- ఇంగ్లండ్ 253 ఆలౌట్
- యశస్వి డబుల్ సెంచరీ
- రెండో టెస్టుపై పట్టుబిగించిన భారత్
- మొత్తం 171 పరుగుల ఆధిక్యం

విశాఖ స్పోర్ట్స్: హైదరాబాద్‌లో మన స్పిన్ కుదర్లేదు. మ్యాచ్ చేతికందలేదు. కానీ వైజాగ్‌లో మాత్రం ఆల్‌రౌండ్ ప్రదర్శన ఆతిథ్య జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని కట్టబెట్టింది. మ్యాచ్‌లో పట్టు సాధించేందుకు ఉపయోగపడుతోంది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (290 బంతుల్లో 209; 19 ఫోర్లు, 7 సిక్సర్లు) కెరీర్‌లో తొలి ద్విశతకం సాధించడంతో... ఓవర్‌నైట్ స్కోరు 336/6తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 112 ఓవర్లలో 396 పరుగుల వద్ద ఆలౌటైంది. అశ్విన్ (20; 4 ఫోర్లు) ఏడో వికెట్‌గా పెవిలియన్ చేరగా, డబుల్ సెంచరీ పూర్తయ్యాక జైస్వాల్ నిష్క్రమించాడు. కాసేపటికే బుమ్రా (6), ముకేశ్ (0)లు నిష్క్రమించడంతో భారత్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. అనంతరం ఇంగ్లండ్‌ను బుమ్రా పేస్ (15.5-5-45-6) రెండు సెషన్లలో కూల్చేసింది. దీంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 55.5 ఓవర్లలో 253 పరుగుల వద్ద ఆలౌటైంది. జాక్ క్రాలీ (76; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ స్టోక్స్ (47; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు 143 పరుగుల ఆధిక్యం లభించింది. ఆట ముగిసే సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేయడంతో టీమిండియా ఓవరాల్ ఆధిక్యం 171కి చేరింది.

బ్యాట్ వదిలేసి... చేతులెత్తేశాడు!

తొలి సెషన్‌లో ఇంగ్లండ్ కేవలం 6 ఓవర్లే ఆడింది. కానీ ఓపెనర్లు క్రాలీ, డకెట్ ఎదురుదాడికి దిగడంతో చకచకా 32/0 స్కోరు చేసింది. రెండో సెషన్ మొదలైన కాసేపటికి డకెట్ (21)ను కుల్దీప్ అవుట్ చేయడంతో 59 పరుగుల తొలివికెట్ భాగస్వామ్యం ముగిసింది. జట్టు స్కోరు వంద దాటేవరకు క్రాలీ, ఒలీ పోప్ (23; 2 ఫోర్లు) చక్కగా బ్యాటింగ్ చేశారు. బుమ్రా పేస్‌కు ఎదురునిలిచి వన్డేను తలపించే ఇన్నింగ్స్ ఆడిన క్రాలీని అక్షర్ బోల్తా కొట్టించాడు. అక్కడి నుంచి బుమ్రా పేస్ ఆటను మలుపు తిప్పింది. రివర్స్‌స్వింగ్‌తో రూట్ (5), బుల్లెట్‌లా దూసుకెళ్లిన యార్కర్‌తో ఒలీ పోప్‌లను బుమ్రా అవుట్ చేయడంతో ఒకదశలో 114/1తో పటిష్టంగా ఉన్న ఇంగ్లండ్ టీ బ్రేక్‌కు 155/4తో ఆత్మరక్షణలో పడింది. ఆఖరి సెషన్‌లో కుల్దీప్ స్పిన్ జత కలవడంతో ఇంగ్లండ్ కుదేలైంది. బుమ్రా ఇన్‌స్వింగర్‌కు బెయిర్‌స్టో (25; 4 ఫోర్లు) వికెట్ సమర్పించుకోగా... ఫోక్స్ (6), రేహాన్ (6) కుల్దీప్ ఉచ్చులో పడ్డారు. చివరి సెషన్‌లో కెప్టెన్ స్టోక్స్ వికెట్ హైలైట్‌గా నిలిచింది. బుమ్రా ఆఫ్‌స్టంప్ దిశగా వేసిన కట్టర్‌ను స్టోక్స్ డిఫెన్స్ ఆడలేక క్లీన్‌బౌల్డయ్యాడు. ఆ క్షణంలో బ్యాట్ వదిలేసి చేతులెత్తేయడం చూస్తే ఆ బంతినెదుర్కోవడం స్టోక్స్ వల్ల కాలేదని స్పష్టమవుతుంది. ఈ వికెట్ల పరంపరలో బుమ్రా... హార్ట్‌లీ (21), అండర్సన్ (6)లను పడేశాడు.

యశస్వి గ్రే 'టెస్ట్' ఇన్నింగ్స్....

తొలిరోజు కెప్టెన్ రోహిత్‌తో భారత ఇన్నింగ్స్‌ను ఓపెన్ చేసిన 22 ఏళ్ల యశస్వి రెండో రోజు డబుల్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. భారత్ చేసిన స్కోరు 396 అయితే... అతనిదొక్కడిదే 209! అంటే సగానికిపైగా పరుగులు జైస్వాలే చేశాడు. ఇంకా చెప్పాలంటే మిగతా పది మందిలో ఏ ఒక్కరు కనీసం అర్ధసెంచరీ అయినా చేయలేదు. అయినాసరే తనతో జోడీకట్టిన బ్యాటర్‌తో తన డబుల్ సెంచరీని సాకారం చేసుకున్నాడు. టెస్టు క్రికెట్‌లోకి వచ్చిన ఏడు నెలల్లోనే ద్విశతకాన్ని ఓ పటిష్టమైన ప్రత్యర్థిపై సాధించడం విశేషం. వినోద్ కాంబ్లీ (21 ఏళ్లు), సునీల్ గావస్కర్ (21 ఏళ్లు) తర్వాత పిన్న వయసులోనే ద్విశతకం చేసిన మూడో భారత బ్యాటర్ జైస్వాల్. తక్కువ ఇన్నింగ్స్ (10వ)ల్లో డబుల్ సెంచరీ బాదిన ఆరో భారత ఆటగాడిగా నిలిచాడు. ఈ జాబితాలో కరుణ్ నాయర్ (3), కాంబ్లీ (4), మయాంక్ (8), పుజారా (9) ముందున్నారు.


యశస్వి డబుల్ సెంచరీ సంబరం

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 396; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: జాక్ క్రాలీ (సి) అయ్యర్ (బి) అక్షర్ 76; డకెట్ (సి) రజత్ (బి) కుల్దీప్ 21; పోప్ (బి) బుమ్రా 23; రూట్ (సి) గిల్ (బి) బుమ్రా 5; బెయిర్‌స్టో (సి) గిల్ (బి) బుమ్రా 25; స్టోక్స్ (బి) బుమ్రా 47; ఫోక్స్ (బి) కుల్దీప్ 6; రేహాన్ (సి) గిల్ (బి) కుల్దీప్ 6; హార్ట్‌లీ (సి) గిల్ (బి) బుమ్రా 21; అండర్సన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బుమ్రా 6; బషీర్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం (55.5 ఓవర్లలో ఆలౌట్) 253. వికెట్ల పతనం: 1-59, 2-114, 3-123, 4-136, 5-159, 6-172, 7-182, 8-229, 9-234, 10-253. బౌలింగ్: బుమ్రా 15.5-5-45-6, ముకేశ్ కుమార్ 7-1-44-0, కుల్దీప్ 17-1-71-3, అశ్విన్ 12-0-61-0, అక్షర్ పటేల్ 4-0-24-1. భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వి (బ్యాటింగ్) 15; రోహిత్ శర్మ (బ్యాటింగ్) 13; మొత్తం (5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 28. బౌలింగ్: అండర్సన్ 2-0-6-0, బషీర్ 2-0-17-0, రేహాన్ 1-0-5-0.


రామ్‌కుమార్


శ్రీరామ్ బాలాజీ

భారత్ 2 పాక్ 0

సింగిల్స్‌లో రామ్‌కుమార్, శ్రీరామ్ బాలాజీ విజయం

ఇస్లామాబాద్: డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్-1 ప్లే ఆఫ్ పోటీలో భారత టెన్నిస్ జట్టు తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. పాకిస్తాన్‌తో జరుగుతున్న ఈ పోటీలో తొలిరోజు శనివారం జరిగిన రెండు సింగిల్స్ మ్యాచ్‌ల్లోనూ భారత క్రీడాకారులు రామ్‌కుమార్ రామనాథన్, శ్రీరామ్ బాలాజీ విజయం సాధించారు. ఫలితంగా ఐదు మ్యాచ్‌ల ఈ పోటీలో ప్రస్తుతం భారత్ 2-0తో ఆధిక్యం సంపాదించింది. నేడు జరిగే మిగతా మూడు మ్యాచ్‌ల్లో (డబుల్స్, రెండు రివర్స్ సింగిల్స్) ఒకదాంట్లో గెలిచినా భారత జట్టు విజయం ఖరారవుతుంది. 1964 తర్వాత పాకిస్తాన్‌లో పర్యటిస్తున్న భారత జట్టుకు ఈసారి ఎలాంటి పోటీ ఎదురుకాలేదు. తొలి సింగిల్స్‌లో ప్రపంచ 461వ ర్యాంకర్ రామ్‌కుమార్ 6-7 (3/7), 7-6 (7/4), 6-0తో సింగిల్స్‌లో ర్యాంక్‌లేని ఐజామ్ ఉల్ హఖ్ ఖురేషీని ఓడించాడు. 2 గంటలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్‌కుమార్ 20 ఏస్‌లు సంధించాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి ఐజామ్ సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. రెండో సింగిల్స్‌లో శ్రీరామ్ బాలాజీ 7-5, 6-3తో అకీల్ ఖాన్‌పై గెలిచాడు. ఏటీపీ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో వీరిద్దరికీ ర్యాంక్ లేకపోవడం గమనార్హం. 75 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ ఎనిమిది ఏస్‌లు సంధించడంతోపాటు అకీల్ ఖాన్ సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. నేడు జరిగే డబుల్స్ మ్యాచ్‌లో బర్కతుల్లా-ముజమ్మిల్ ముర్తజాలతో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ తలపడతారు.

రాహుల్, నితేశ్ సెంచరీలు


రాహుల్


నితేశ్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్‌లో భాగంగా మిజోరం జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ క్రికెట్ జట్టు 259 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 120/1తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 116 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 458 పరుగులు సాధించింది. కెప్టెన్ రాహుల్ సింగ్ (108; 14 ఫోర్లు, 2 సిక్స్‌లు), నితేశ్ రెడ్డి (115; 11 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలు సాధించారు. ప్రజ్ఞయ్ రెడ్డి (91; 10 ఫోర్లు, 1 సిక్స్) శతకం చేజార్చుకోగా... రోహిత్ రాయుడు (60; 3 ఫోర్లు, 1 సిక్స్) కూడా రాణించాడు. మిజోరం తొలి ఇన్నింగ్స్‌లో 199 పరుగులకు ఆలౌటైంది.

చైనా చేతిలో భారత్ ఓటమి

భువనేశ్వర్: మహిళల ప్రొ లీగ్ హాకీ టోర్నీలో భాగంగా చైనా జట్టుతో శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 1-2 గోల్స్ తేడాతో ఓడింది. భారత్ తరఫున వందన (15వ ని.లో) ఏకైక గోల్ చేసింది. చైనా జట్టు తరఫున వెన్ డాన్ (40వ ని.లో), బింగ్ ఫెంగ్ గు (52వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. నేడు నెదర్లాండ్స్‌తో భారత్ ఆడుతుంది.

మళ్లీ ఓడిన తెలుగు టైటాన్స్

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ జట్టు ఖాతాలో 16వ పరాజయం చేరింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 33-44తో దబంగ్ ఢిల్లీ చేతిలో ఓడిపోయింది. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 39-23తో యు ముంబాపై గెలిచింది. నేడు బెంగళూరు బుల్స్‌తో యు ముంబా; గుజరాత్ జెయింట్స్‌తో తమిళ్ తలైవాస్ తలపడతాయి.

ఆంధ్రకు ఆధిక్యం

పట్నా: బిహార్ జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 131 పరుగుల ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు కోల్పోయి 313 పరుగులు చేసింది. రికీ భుయ్ (58; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), షేక్ రషీద్ (76 బ్యాటింగ్; 13 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు.

సినిమా

మరో నెలలో ఆపరేషన్

దేశంలోని వైమానిక దళ వీరుల అలుపెరుగని పోరాటం, దేశాన్ని రక్షించడంలో వారు ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. ఎయిర్ ఫోర్స్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో హీరో వరుణ్ తేజ్ ఇండియన్ ఎయిర్ పైలట్‌గా, హీరోయిన్ మానుషీ చిల్లర్ రాడార్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తారు. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వంలో సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, సందీప్ ముద్దా రినైసన్స్ పిక్చర్స్ నిర్మించిన ఈ తెలుగు-హిందీ ద్విభాషా చిత్రం ఈ నెలలోనే విడుదల కావాల్సింది. అయితే మార్చి 1న రిలీజ్ చేయనున్నట్లు శనివారం యూనిట్ ప్రకటించింది. ''ఈ చిత్రం టీజర్, పోస్టర్లు, రిపబ్లిక్ డేకి ముందు విడుదల చేసిన దేశభక్తి జ్వాలని రగిలించిన ఫస్ట్ సింగిల్ 'వందేమాతరం...' వంటివి సినిమాపై అంచనాలు పెంచాయి. ఆ అంచనాలు చేరుకునేలా ఈ చిత్రం ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.



● వరుణ్ తేజ్

అసాధారణమైన ప్రయాణం

మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ కెరీర్ ఆరంభమై పుష్కర కాలం అయింది. ఇన్నేళ్లల్లో మలయాళంతో పాటు తెలుగు, తమిళ, హిందీ భాషల్లో వినూత్న చిత్రాలు, పాత్రలు చేస్తూ వస్తున్నారు దుల్కర్. ఇక పన్నెండేళ్లయిన సందర్భంగా దుల్కర్ హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం 'లక్కీ భాస్కర్' ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు చిత్ర నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. మీనాక్షి చౌదరి కథానాయిక. ''ఈ చిత్రంలో మగధ బ్యాంక్‌లో క్యాషియర్‌గా పని చేసే దుల్కర్ లుక్‌ని విడుదల చేశాం. 1980ల నాటి బొంబాయి నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ఒక సాధారణ మనిషి తాలూకు అసాధారణమైన ప్రయాణమే ఈ సినిమా. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది'' అని యూనిట్ పేర్కొంది. తెలుగు, మలయాళ, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.


● దుల్కర్

నేను విన్నాను...


● మమ్ముట్టి, జీవా

''నా బిడ్డకు పుట్టుకతోనే చెవుడు ఉందన్నా.. చెవుడు వల్ల మాటలు కూడా రావు. ఏదో మిషన్ పెడితే వినపడి మాటలు వస్తాయని డాక్టర్లు చెప్పినారు.. అన్నా.. మాకంత స్తోమత లేదు (ఓ పాత్రధారి). మన రాష్ట్రానికి ఉన్న బడ్జెట్‌కి ఒక మనిషి మీద నాలుగు లక్షల రూపాయలు ఖర్చు పెట్టడం.. ఐ డోంట్ థింక్.. ఇట్స్ రైట్ సార్ (మరో పాత్రధారి)... నువ్వు చెప్పింది కరెక్టే అయ్యా.. నాకు అర్థమైంది. కానీ మనం చేయలేమనే మాట ఈ పాపకు అర్థమయ్యేలా చెప్పు (మమ్ముట్టి) అనే సీన్‌తో మొదలైంది 'యాత్ర 2' సినిమా టీజర్. 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకున్న రాజకీయ పరిస్థితులు, పేదల కోసం వైఎస్ జగన్ చేసిన పాదయాత్ర ఆధారంగా రూపొందిన సినిమా 'యాత్ర 2'. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పాద యాత్ర ఆధారంగా రూపొందిన 'యాత్ర'కు సీక్వెల్‌గా 'యాత్ర 2' వస్తోంది. ఈ చిత్రంలో వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో మమ్ముట్టి, వైఎస్ జగన్ పాత్రలో జీవా నటించారు. మహి. వి. రాఘవ్ దర్శకత్వంలో త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యూలాయిడ్, శివ మేక నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. జగన్ రెడ్డి కడపోడు సార్.. శత్రువుపై ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నాకా.. వాళ్లు నాశనమైపోతారు అని తెలిసినా.. శత్రువుకి తలవంచరు సార్ (శుభలేక సుధాకర్) ఎన్నికలైపోయాక జనాల్ని మోసం చేసి నా క్రెడిబిలిటీని పోగొట్టుకోలేనన్నా.. ఈ క్రెడిబిలిటీ లేని రోజు.. మా నాయనా లేడు.. నేనూ లేను, నేను విన్నాను... నేనున్నాను (జీవా) అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.

ఆ రెంటినీ నమ్ముకున్నవారు ఫెయిల్ కాలేదు

\- నిర్మాత బన్నీ వాసు


● విరాన్, బన్నీ వాసు, లావణ్య

హీరో అల్లు అర్జున్ కజిన్ విరాన్ ముత్తంశెట్టి హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'ముఖ్య గమనిక'. ఇందులో లావణ్య హీరోయిన్. సినిమాటోగ్రాఫర్ వేణు మురళీధర్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ రాజశేఖర్, సాయికృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన నిర్మాత బన్నీ వాసు మాట్లాడుతూ– ''ఏ పరిశ్రమలోనైనా ఓర్పు, కష్టం.. ఈ రెండింటినీ నమ్ముకున్న వారు ఫెయిల్ కాలేదు. హీరో కావాలన్న విరాన్ కల ఈ సినిమాతో నిజం అవుతోంది. అల్లు అర్జున్‌గారితో పాటుగా కథలు వినేవాడు విరాన్. ఈ సినిమా పెద్ద సక్సెస్ అయ్యాక, సక్సెస్ మీట్‌కు తాను వస్తానన్నట్లుగా అల్లు అర్జున్ నాకు చెప్పారు. 'ముఖ్య గమనిక' సినిమా పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''ఓర్పుగా ఉంటే ఏదో రోజు సక్సెస్ అవుతాం అనడానికి బన్నీ వాసు అన్న ఓ ఉదాహరణ. హీరోగా నాకు చాన్స్ ఇచ్చిన దర్శక-నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు విరాన్. ''ఈ కథ అనుకున్నప్పుడే హీరోగా విరాన్‌ను అనుకున్నాను'' అన్నారు వేణు మురళీధర్. ''మా సినిమాకు అందరూ సపోర్ట్ చేయాలి'' అన్నారు రాజశేఖర్, సాయికృష్ణ.

నేను జీవించే ఉన్నాను!

\- పూనమ్ పాండే



''సర్వైకల్ క్యాన్సర్ (గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్) కారణంగా నేను చనిపోలేదు... బతికే ఉన్నాను. దురదృష్టం ఏంటంటే.. అనేక మంది మహిళలకు ఈ వ్యాధిపై అవగాహన లేకపోవడం వల్ల వారు వారి జీవితాలను కోల్పోతున్నారు. సర్వైకల్ క్యాన్సర్ మిగతా క్యాన్సర్ల మాదిరి కాదు. ఇందుకు మెరుగైన చికిత్స ఉంది. హెచ్‌పీవీ వ్యాక్సిన్, వైద్య పరీక్షలతో వెంటనే ఈ క్యాన్సర్‌ను గుర్తించి, చికిత్స తీసుకోవడం వంటి చర్యలతో ఈ వ్యాధిని నివారించవచ్చు. ఈ వ్యాధితో ఎవరూ ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు మార్గాలు ఉన్నాయి. వాటిపై అవగాహన కల్పిద్దాం'' అని పేర్కొన్నారు నటి, మోడల్ పూనమ్ పాండే. ఫిబ్రవరి 2న సర్వైకల్ క్యాన్సర్ కారణంగా ఆమె మరణించినట్లు ఆమె సోషల్ మీడియా అకౌంట్ నుంచి ఓ పోస్ట్ షేర్ అయింది. కానీ ఆమె కుటుంబ సభ్యులు మరణ విషయాన్ని ధృవీకరించలేదు. అలాగే కాన్పూర్ పోలీసులకు, అక్కడి మీడియాకు పూనమ్ పాండే మరణంపై సరైన స్పష్టత లేదు. దీంతో పూనమ్ జీవించే ఉన్నారని, పబ్లిసిటీ స్టంట్ కోసమే ఇలా తాను మృతి చెందినట్లు ఫేక్ చేశారనే వార్తలు కూడా వినిపించాయి. ఫైనల్‌గా ఇదే నిజమైంది. సర్వైకల్ క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించే ప్రక్రియలో భాగంగానే తన చావును ఫేక్ చేసినట్లుగా పూనమ్ సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా వీడియోలు షేర్ చేశారు. నేడు (ఫిబ్రవరి 4) వరల్డ్ క్యాన్సర్ డే. ఈ సందర్భంగానే పూనమ్ ఇలా చేశారని తెలుస్తోంది. అయితే పూనమ్ ఈ విధంగా చేయడం వివాదాస్పదంగా మారడంతో మరికొన్ని వీడియోలను కూడా ఆమె షేర్ చేశారు. ''అవును.. నా చావును ఫేక్ చేశాను. కానీ సడన్‌గా అందరూ సర్వైకల్ క్యాన్సర్ గురించి చర్చించుకోవడం మొదలుపెట్టారు. సైలెంట్‌గా జీవితాలను ముగించే వ్యాధి అది. ఈ వ్యాధి గురించి అవగాహన కల్పించాల్సి ఉంది. నా చావు వార్త సర్వైకల్ క్యాన్సర్ గురించిన చర్చను పైకి తెచ్చినందుకు గర్వంగా ఫీలవుతున్నాను. ఓ సెలబ్రిటీ సర్వైకల్ క్యాన్సర్ వల్ల చనిపోయిందన్న వార్త దేశవ్యాప్తంగా ఆ క్యాన్సర్ గురించి మాట్లాడుకునేలా చేసింది. నేను చేయాలనుకున్నది ఇదే. నేను ఎవర్నైనా బాధపెట్టి ఉంటే క్షమించండి'' అంటూ వీడియోలు షేర్ చేశారు పూనమ్.

నాగమ్మ పోరాటం

మంచు లక్ష్మి లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఆదిపర్వం'. ఈ చిత్రానికి సంజీవ్ మేగోటి దర్శకుడు. రావుల వెంకటేశ్వర రావు సమర్పణలో అన్విక్కా ఆర్ట్స్, ఏ వన్ ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించిన ఈ చిత్రం 1974 నుంచి 1992 మధ్య జరిగే పీరియాడిక్ డ్రామాగా సాగుతుంది. ఈ చిత్రం ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఘంటా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ– ''దక్షిణ భారతదేశంలోని అన్ని భాషలతో పాటు హిందీలోనూ ఈ సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు. ''నాగలాపురం నాగమ్మగా మంచు లక్ష్మి నట విశ్వరూపం చూపించే సినిమా ఇది. ఈ చిత్రంలో భారీ గ్రాఫిక్స్ ఉంటాయి'' అన్నారు సంజీవ్ మేగోటి. 'గ్రాఫిక్స్, మంచు లక్ష్మి ఈ చిత్రానికి పెద్ద ఎస్సెట్'' అన్నారు చిత్ర సమర్పకులు రావుల వేంకటేశ్వర రావు. ''పోస్ట్ ప్రొడక్షన్ దశలోనే ఈ సినిమాని చూసి హ్యాపీ ఫీల్ అయ్యాం'' అన్నారు సహనిర్మాతల్లో ఒకరైన గోరెంట శ్రావణి.


● మంచు లక్ష్మి

షరతులు వర్తిస్తాయి మంచి చిత్రంగా నిలవాలి

\- నిర్మాత 'దిల్' రాజు

చైతన్యా రావు, భూమి శెట్టి జంటగా కుమారస్వామి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డా. కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుడు వేణు ఊడుగుల, మామిడి హరికృష్ణ అతిథులుగా పాల్గొన్నారు. ఈ వేదికపై ముఖ్య అతిథి 'దిల్' రాజు మాట్లాడుతూ– ''బలగం' కంటే ఎక్కువగా తెలంగాణ నేటివిటీ ఈ సినిమాలో ఉంది. సాంగ్, టీజర్ బాగున్నాయి. ఇదొక మంచి సినిమా కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''సహజమైన కథా కథనాలతో, కొంత సినిమాటిక్ లిబర్టీని తీసుకుని ప్రేక్షకులకు నచ్చే అంశాలతో ఈ సినిమాను తీశారు'' అన్నారు హరికృష్ణ. ''నేను కరీంనగర్ వాసిని. పరిశ్రమలో నటుడిగా ఎదిగి మళ్లీ కరీంనగర్ వెళ్లి సినిమా షూటింగ్ చేయడం ఒక అఛీవ్‌మెంట్‌లా ఫీలవుతున్నాను'' అన్నారు చైతన్య. ''సినిమాలో మంచి కంటెంట్ ఉంది'' అన్నారు కుమారస్వామి. ''సమాజంలోని ఓ సమస్య పరిష్కారానికి హీరో ఎలా ముందుకు వచ్చాడన్నదే ఈ చిత్రకథ'' అన్నారు డా. కృష్ణకాంత్ చిత్తజల్లు.


● భూమి శెట్టి, చైతన్యా రావు, 'దిల్' రాజు

ఆ మైలురాయిని చేరుకుంటాం

\- టీజీ విశ్వప్రసాద్



''మా బ్యానర్‌లో వంద సినిమాలను త్వరితగతిన పూర్తి చేయాలనే మా మిషన్ ఆన్‌లోనే ఉంది. మా నిర్మాణ సంస్థ నుంచి ఈ ఏడాది కనీసం 15 సినిమాలు విడుదల కావొచ్చు. రవితేజగారి 'మిస్టర్ బచ్చన్', శర్వానంద్, శ్రీ విష్ణు సినిమాలు ఈ ఏడాదే విడుదలవుతాయి. నాలుగు సినిమాలు అమెరికాలో చేస్తున్నాం. ప్రభాస్‌గారి 'రాజా సాబ్' సినిమా రిలీజ్ గురించి త్వరలోనే చెబుతాం. అలాగే ఈ ఏడాది మా సంస్థలో 50వ చిత్రం మైలురాయిని అందుకుంటామనే నమ్మకం ఉంది'' అన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. రవితేజ హీరోగా నటించిన యాక్షన్ చిత్రం 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ – ''ఈగల్'ను 2023 డిసెంబరు చివరి వారంలో విడుదల చేద్దామనే ఆలోచన చేశాం. అయితే ఆ తర్వాత ప్రభాస్ 'సలార్: సీజ్‌ఫైర్' రిలీజ్ కన్ఫార్మ్ కావడంతో 'ఈగల్'ను సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల చేయాలనుకున్నాం. కానీ తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ రిక్వెస్ట్, పరిశ్రమ మేలుని దృష్టిలో పెట్టుకొని ఫిబ్రవరి 9కి వాయిదా వేశాం. ఈ టైమ్‌కి 'యాత్ర 2' కూడా వస్తోంది. కానీ ఆ సినిమా డిఫరెంట్. ఏ సినిమా రీచ్ ఆ సినిమాకు ఉంటుంది. 'ఈగల్' క్లాసిక్ అండ్ స్టయిలిష్ మాస్ ఎంటర్‌టైనర్. రవితేజగారు కొత్తగా కనిపిస్తారు. కథ, మెసేజ్, యాక్షన్, సాంగ్స్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటాయి'' అన్నారు.

పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



2nd మ్యారేజ్/ CNB / 43Y / 5'6"/ BA / Business / 5Cr Properties/ Hyd వరుడుకు అందమైన వధువు కావలెను. Ph: 9182594903 [H-801521]

గౌడ/కట్న ప్రసక్తి లేదు / M.Tech / C. Govt. టెక్నికల్ Asst./ఇస్రో/60,000/-PM /6'ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-14972]

బెస్త, గంగపుత్ర/BE/Govt.ఇంజినీర్/ ఎలక్ట్రికల్ Dept/1.30Lakhs.PM/5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-14972]

వడ్డెర/M.Tech / C.Govt. రెవెన్యూ ఆఫీసర్ / కస్టమ్స్ Dept/75000/-PM/ 5'11"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-14972]

క్రిస్టియన్ మాల/కట్న ప్రసక్తి లేదు/ B.Tech /Govt.ఇన్స్‌పెక్టర్/కస్టమ్స్ Dept/ 80,000/-PM/ 6'ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి తగిన వధువు కావలెను. Ph: 8297439565 [HA-14972]

రిటైర్డ్ Govt. ఇంజనీర్ – హైదరాబాద్‌కు ఏ బాదరాబందీలేని BC, OC వధువు కావలెను. డైరెక్ట్‌గా సంప్ర : 8179713792 [H-801520]

II Match కాపు CNB/45/5'9" సెంట్రల్ Govt. Job 18L P/A సొంత ఇల్లు, పొలము బాగా స్థిరపడిన వరుడికి తగిన వధువు కావలెను. No Issues 6281925716 Whatsapp. [HA-13031]

SC మాల/30/5'9"/ B.Tech MBA Govt. Job (గ్రూప్ 1 AEE) (ట్రాన్స్‌కో) SC ఆస్తి 12L P/A వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన అమ్మాయి కావలెను. Ph: 7702195227 [HA-13031]

SC మాదిగ & క్రిస్టియన్/M.Tech(IT)/C. Govt.డిప్యూటీ మేనేజర్/SBI/85000/-PM/ 5'9" ఎత్తు/28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. కట్నప్రసక్తి లేదు. Ph: 9676995093, 9703978131 [HA-14975]

యాదవ / కట్నప్రసక్తి లేదు / B.Tech (Civil) / Govt.A.E.E / ఇరిగేషన్ Dept/ 14 Lakhs PA/5'9" ఎత్తు/28సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9515755529 [HA-14975]

SC మాల & క్రిస్టియన్/ M.Tech IT/ Govt. A.E.E./ట్రాన్స్‌కో/18 Lakhs. PA / 5'8" ఎత్తు/28 సం॥ల వరుడికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. Ph: 9676995093 [HA-14975]

రజక/కట్నప్రసక్తి లేదు / B.Tech/C. Govt. మెకానికల్ ఇంజినీర్ / రైల్వే / 80,000/-PM/5'10"ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 7075953400 [HA-14975]

క్రిస్టియన్ మాల/కట్నప్రసక్తి లేదు / 28/ 5'9"/B.Tech / Govt.A.E.E. / ఇరిగేషన్ Dept/90,000/-PM/అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-14975]

డివోర్స్/కుల పట్టింపు లేదు/45/5'6"/ డిగ్రీ/ MNCలో Job 80,000/-PM/Own Flat Hyd/ Settled వరుడికి తగిన వధువు కావలెను- పిల్లలు (ఒకరు) ఉన్నా ఓకే. Ph: 9550650024 [HA-14976]

కుల పట్టింపు లేదు/49yrs/2వ మ్యారేజ్/ ప్రైవేట్ జాబ్/మంచి జీతం కలిగిన వరునికి 40 సం॥ పైబడిన విడో & డైవర్సీ గల వధువు కావలెను. (మధ్యతరగతి వారికి ప్రాధాన్యత) డైరెక్ట్ సంప్ర : 9492373784 [H-787979]

Govt. Emp/40yrs/రెండవ వివాహము/ 3,00,000 (PM)/Doctors, Any Profetion Rents 100,000/- బాగా స్థిరపడిన అబ్బాయికి వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు. సంప్ర : 9381696641 [H-787979]

Reddy/Groom/ 30/5'8" / B.Tech (Civil)/ 5Cr./ Govt. A.E. Seeks Bride B.Tech/ Any Degree. Contact: Prabhakar Reddy. 9391198332 [H-801663]

Reddy/Groom/ 35 / 5'9" / MCA-LLB Advocate/ 15 Crores Property/1.5 Lak P/M. Seeks Bride . Contact: Prabhakar Reddy. 9391198332 [H-801663]

Reddy/Groom/ 32/ 5'10" / MBA / 15Cr Builder. Seeks Bride Any Degree. Contact: Prabhakar Reddy. 9391198332 [H-801663]

Reddy/Groom/ 28 / 5'10"/ MD. (General)/ 25Cr/Handsome. Seeks Bride Doctor only. Contact: Prabhakar Reddy. 9391198332 [H-801663]

Reddy/Groom/ II Marriage-33/5'9"/ B.Tech/ IIIT/ C.Govt.Officer/15Lac P/A. Seeks Bride Any Degree. Contact: Prabhakar Reddy. 9391198332 [H-801663]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Business, BE, MS (USA), 34, 5' 11", Hyd, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 30, 5' 8", Sr Analyst, 30 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE, 29, 5' 8", SWE, 40 L P/A, 10 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 29, 5' 11", Data Engineer, 13 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి USA Citizen, BS, 23, 5' 5", SWE, 20 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి UK, BE, MBA, 25, 5'6", 5Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 25, 5' 5", 25 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 27, 5' 7", Sr Associate, 30 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MS, 32, 5' 11", SWE, 350 K, 10 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 29, 5' 11", 22 L P/A, 100 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BS (Australia), 33, 6', Manager, 5 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, M Tech, 33, 6', 16 L P/A, 10 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBA, 26, 5' 7", Deloitte, 10 L P/A, 5 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, 26, 5' 5", 40 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA (ISB), 27, 5' 4", 28 L P/A, 10 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 6", PG Doctor, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

★

కులపట్టింపులేదు/ DIVORCE/ SC (MALA), 55y, M.Com/ MBA, వాలంటరీ రిటైర్డ్ సెంట్రల్ Govt. Employee 65 K pm సొంత ఇల్లు Hydలో వరునికి మధ్యతరగతి వధువు కావలెను. Ph: 9703177245 [H-801582]

రెడ్డి/లేట్ మ్యారేజ్/34y/ నెలకు లక్ష రూపాయల ఆదాయం, Hyd లో సొంత ఇల్లు, కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి ఓట్రీ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ / విడో Ok కుల, కట్న ప్రసక్తిలేదు. డైరెక్ట్. Ph: 7989079290 [H-801473]

వరుడు కావలెను



యాదవ/ఏకైక కుమార్తె/B.Tech/C. Govt. బ్యాంక్ P.O/ SBI బ్యాంక్ / 50,000/-PM /5'5"ఎత్తు/25సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-14972]

ముదిరాజ్/B.Tech/Govt.Asst.ఇంజినీర్/ R&B Dept/ 50,000/-PM / 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-14972]

వాల్మీకి బోయ/B.Tech/Govt.సబ్ ఇంజినీర్/ఎలక్ట్రికల్ Dept/70,000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-14972]

SC మాదిగ హిందూ/B.Tech/ Govt. Asst.ఇంజినీర్ / జెన్‌కో /60,000/-PM/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-14972]

రజక/B.Tech/Govt. గ్రూప్–II ఆఫీసర్ /ఎక్సైజ్ Dept / 50,000/-PM /5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6305007091 [HA-14972]

SC హిందూ మాల/ఏకైక కుమార్తె/ B.Tech / C.Govt. Jr. ఇంజినీర్ / రైల్వే / 8 Lakhs. P.A / 5'5"ఎత్తు /25సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-14972]

FC/విడో/58y/5'4"/Fair / ప్రభుత్వ పెన్షనర్/ సొంత ఇల్లు / 5 ఎకరాల పొలం సాంప్రదాయ కుటుంబానికి చెందిన వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 8125290259 [H-801520]

వైశ్య/విడో/60y/5'4"/ కిరాణం హోల్‌సేల్ షాప్/ 1L pm/ సొంత ఇల్లు/ ఫైనాన్స్ బిజినెస్/ ఆస్తి, కుల పట్టింపులేని వధువుకి వరుడు కావలెను. Ph: 9063539575 [H-801520]

బ్రాహ్మణ/33yrs/5'2"/ ఇంటర్/ 29yrs/5'4"/ డిగ్రీ/25yrs/5'2"/MBA వధువులకు వరులు కావలెను/ రిటైర్‌మెంట్/ Pvt, Govt. జాబ్ & పురోహితం అయినా Ok. Ph: 9959725419 [H-801520]

SC/మాల హిందూ/B.Tech/25y/5'4"/ సాఫ్ట్‌వేర్ కాగ్నిజెంట్ (Hyd) 60K per month/ చాలా అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9705960270 [H-801520]

రెడ్డి II Match CNB/43/5'3"/ MBA డైవర్సీ సొంత వ్యాపారము 30L P/A 10 Cr ఆస్తి అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9390933661 [A-13031]

MALA SC/25/5'3"/ M.Sc/ Finance Govt. Job Well Settled అమ్మాయికి తగిన వరుడు కావలెను. Ph : 9581616774 [A-13031]

యాదవ/ M.Tech / Govt.క్లర్క్ /SBI బ్యాంక్/ 40,000/-PM / 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7075953400 [HA-14975]

క్రిస్టియన్ మాల / 25/5'4" / B.Tech/ Govt.A.E/ ఎలక్ట్రికల్ Dept / 40,000/-PM అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-14975]

బ్రాహ్మణ/25/5'3"/ ఇంటర్ * 29/5'4"/ B.Sc *33/5'3"/ఇంటర్ *35/5'3"/B.Sc వధువులకు వరులు కావలెను. పురోహితులు కూడా సంప్ర : Ph: 7842635086 [HA-14975]

కాపు/కుల పట్టింపు లేదు/2వ పెళ్లి/ 51Yrs / Govt. ఎంప్లాయి / 85000/-PM గల వధువుకు కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 7729090846 [HA-14975]

రెడ్డి/కుల పట్టింపు లేదు/30Y/5'3"/ ఎత్తు పెద్ద ప్రాపర్టీ కలిగి తండ్రి లేని వధువుకు 1వ లేదా 2వ వరుడు కావలెను. ఆస్తి పట్టింపు లేదు. Photos Whatsapp Send me. Ph: 9885492498 [HA-14975]

SC మాల/26years/5'4"/B.Tech/ Software Engineering, 50K PM, Well Settled Family కలిగిన వధువుకి వరుడు కావలెను (S/W/E Govt. Doctor's). Ph: 7416007604 (Whats App) [HA-14976]

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/A:31, H:5'4"/అందమైన వధువుకి వరుడు కావలెను (అన్ని కులముల వారికి వివాహం కుదర్చబడును) Ph: 9849337176 [HA-14976]

రెండో పెళ్ళి/63y&61y&59y&57y & 55y & 53y& 52y& 50y&49y&47y&45y&44y&42y& 41y&39y& 38y&36y&35y&33y&31y& 30y&28y& 26y & 24y & / "మా సేవ" (Since 1998): PH/WA: 9291503949 [HA-14976]

38yrs/డైవర్సీ/రెండవ పెళ్లి/Govt. ఎంప్లాయ్/ 2,75,000/- (PM)/ కుల ప్రసక్తి లేని బాగా స్థిరపడి అందమైన వధువుకి తగిన వరుడు కావలెను (పిల్లలు ఉన్నా) సంప్ర : 7386550413 [H-787979]

రెడ్డి/40yr/5'5"/కుల పట్టింపు లేదు / ఫెయిర్/ MA, B.Ed/Govt. ఎంప్లాయ్/80K (PM)/వెల్ సెటిల్ ఫ్యామిలీ & 2 సొంత ఇల్లులు & ఫ్లాట్స్ కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర : 8008474869 [H-787979]

కాపు/49yr/కుల పట్టింపు లేదు/2nd మ్యాచ్/ Govt. ఎంప్లాయ్/1.5 లక్షలు(PM)/ వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ & 2 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర : 9492081545 [H-787979]

రెడ్డి/విడో/55y / తక్కువ చదువు / ప్రైవేట్ జాబ్/2 ఇల్లు గల ఒంటరి వధువుకు స్నేహ స్వభావం గల వరుడు కావలెను. Ph: 9030993696 [H-801521]

కమ్మ/విడో/58y/5'5"/V.Fair/Govt (HM)/సొంత ఇల్లు & రెంట్స్/25 ఎకరాల పొలం/3L PM ఏ బాదరబందీలేని సాంప్రదాయక వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 7093717220 [H-801521]

రెడ్డి/2nd మ్యారేజ్ : కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/Age : 29, Qly: డిగ్రీ సొంత వ్యాపారం కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. 1st (or) 2nd (ఇల్లరికం OK) Ph: 9515673252 [H-801521]

★

రెడ్డి డాక్టర్/1990/ 5'-10"/MD.(DVL)/డెర్మటాలజిస్ట్/ 15 Cr. Property/Parents Hyd. Settled/ వధువుకు/Hydలో Well Settled/5'-11" పైన ఎత్తు కలిగిన రెడ్డి వరుడు కావలెను. సెల్: 9490927263. [K-1185967]

వేదికలు



ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 7702955854 [H-793580]

శ్రీ రిజిస్ట్రేషన్. అన్ని కులముల వారికి Govt/సాఫ్ట్‌వేర్/ గెజిటెడ్/MBBS/PG/ NRI/PVT/బిజినెస్/1వ/2వ/లేట్/ AP/ TS 15 సం॥ Exp. Ph: 9989140444 [HA-31363]

కుల పట్టింపులేని అన్ని కులముల వారికి 1st, IInd సంబంధములు చూడబడును. 21 సం॥ నుండి 60 సం॥ వరకు సంబంధములు చూడబడును. Ph: 8897091964 [HA-13031]

రిష్తా పక్కా షాదీ కరో. ఇక్కడ అన్ని కులాల వారికి సంబంధాలు చూడబడును. ఒకవేళ మీకు ఏ సంబంధం నచ్చకపోతే 70% మనీ వాపస్ ఇవ్వబడును. సంప్ర : 6301956609 [HA-14976]

Padmashali-Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14976]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14976]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14976]

Madiga-Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14976]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14976]

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే. అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర : Ph: 8555980066 [H-801521]

పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారా! వ్యక్తిగతంగా పెళ్లి సంబంధాలు చూడాలా!! సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, అబ్రాడ్,VIP అన్ని కులాలకు Fast Settlement పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-1995]

15లో॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriagelines.com ✆ 98490 58673, వాట్సప్: 94401 57931, 94407 85888 [B-613]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC Matches, Late & 2nd Matchesకై సంప్రదించండి: 97046 56103, 9533608887 (Whatsapp) [HA-644]

న్యాయ సేవలను రైతులు అందిపుచ్చుకోవాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరావు

పాలకుర్తిటౌన్: రైతులు మోసాలకు గురికాకుండా న్యాయసేవలు అందుబాటులోకి వచ్చాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రహైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె. శ్రీనివాసరావు అన్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని బమ్మెర గ్రామంలోని 'అగ్రి లీగల్ ఎయిడ్ సెల్'ను శనివారం ఆయన సందర్శించారు. అనంతరం బమ్మెర పోతన సమాధిని సందర్శించి నివాళి అర్పించారు. పోతన వ్యవసాయం చేసిన సాగు నీటి బావిని పరిశీలించారు. ఈ సందర్భంగా జస్టిస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రైతులకు న్యాయ సహాయం అందించేందుకు దేశంలోనే తొలిసారి పాలకుర్తి మండలం బమ్మెరలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు కావడం గర్వకారణమన్నారు. ఈ కేంద్రం ద్వారా న్యాయ సేవలు అందడంతో పాటు భూ చట్టాలపై రైతులకు అవగాహన కలుగుతుందన్నారు. దుక్కి దున్నిన నాటినుంచి పంటను మార్కెట్‌లో అమ్మే వరకు రైతులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరించేందుకు బమ్మెరలోని లీగల్ క్లినిక్ వేదికగా మారడం ఆనందదాయకమన్నారు.



బమ్మెరలో పోతన సాగుకు వినియోగించిన సేద్యపు బావిని పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరావు

బమ్మెర పోతన నడయాడిన నేలలో, వ్యవసాయం చేసిన ప్రాంతంలో రైతులకు న్యాయ సేవా కేంద్రం అందుబాటులో ఉండటం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు జడ్జి డి. రవీందర్‌శర్మ, న్యాయమూర్తులు సి.విక్రమ్, సుచరిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్

భువనగిరి క్రైం: పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శరత్ అన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలో శనివారం జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ కేసుల పరిష్కారం, పనితీరు, పరిపాలన వంటి అంశాలపై సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల విచారణపై చర్చించి జాప్యం లేకుండా చూడాలని భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్రకు సూచించారు. యాదగిరిగుట్టలో ఏర్పాటు చేయనున్న నూతన కోర్టుకు తాత్కాలిక భవనం, శాశ్వత నిర్మాణానికి ఐదు ఎకరాల భూమి సేకరణ, నూతన జిల్లా కోర్టుల భవన సముదాయ నిర్మాణానికి కేటాయించిన పది ఎకరాల భూమిలో తదుపరి చేపట్టనున్న పనులపై భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జండగే, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, రోడ్లు, భవనాల శాఖ ఈఈ శంకరయ్యతో చర్చించారు. అనంతరం అధికారులతో కలసి స్థలాన్ని పరిశీలించారు. భువనగిరి సబ్ జైలును సందర్శించి ఖైదీలకు వారి కేసులలో అందజేస్తున్న న్యాయ సహాయం, వసతి, ఇతర సదుపాయాలపై సమీక్షించారు.



భువనగిరిలో జిల్లా కోర్టు భవనానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్, జిల్లా న్యాయమూర్తులు, అధికారులు

అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ముద్రించిన డైరీని జస్టిస్ శరత్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.మాధురిదేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, రామన్నపేట జూనియర్ సివిల్ జడ్జి ఎ.ప్రదీప్, ఆలేరు జడ్జి ఎస్.సుమలత, చౌటుప్పల్ జడ్జి టి.మహతి వైష్ణవి, ఆర్డీఓ అమరేందర్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగారం అంజయ్య, సీహెచ్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాత్మక విమర్శలు చేయండి

ఎమ్మెల్సీ కవితకు సూచించిన మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం నెలకొల్పాలనే విషయం పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాలేదా అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి ప్రశ్నించారు. శనివారం గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్, అధికార ప్రతినిధి సుధాకర్‌గౌడ్ తదితరులతో కలిసి మల్లు రవి విలేకరులతో మాట్లాడారు. నిర్మాణాత్మకంగా విమర్శలు చేయాలికానీ మాయమాటలు కాదని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాభవన్‌కు పేరు పెట్టిన తర్వాత కవితకు పూలే పేరు గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు.

ప్రియాంకపై మాట్లాడే స్థాయి కవితకు లేదు: మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: లిక్కర్ వ్యాపారం చేసి నిజామాబాద్ జిల్లా పరువు తీసిన కవితకు.. త్యాగాల కుటుంబం నుంచి వచ్చిన ప్రియాంకాగాంధీ గురించి మాట్లాడే స్థాయి ఎక్కడిదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డినుద్దేశించి మాట్లాడిన తీరు ఆమె దిగజారుడు రాజకీయాలకు నిదర్శమన్నారు. ఆయన శనివారం గాంధీ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇంద్రవెల్లికి వెళ్లిన సీఎం రేవంత్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని, భద్రత దృష్ట్యా మాత్రమే హెలికాప్టర్‌లో వెళ్లారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతల తరహాలో ప్రైవేట్ కార్యక్రమాలకు హెలికాప్టర్లు వాడలేదన్నారు. తొమ్మిదిన్నరేళ్లలో ఎంత దోచుకున్నారో, కాళేశ్వరంలో ఎంత డబ్బు నొక్కారో, మేడిగడ్డ ప్రాజెక్టులో ఎంత కమీషన్ తీసుకున్నారో త్వరలోనే బయటకు తీస్తామని పేర్కొన్నారు.

ఆరు గ్యారంటీలు గారడీ మాటలే

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- పార్టీలో చేరిన ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్



సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే దేశంలో ఉగ్రవాదాన్ని, అవకతవకలను పెంచి పోషించడమే అవుతుందని కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచేది లేదు, రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేది లేదని అన్నారు. ఆరు గ్యారంటీలు అమలయ్యే పరిస్థితి కూడా లేదని, అవి ఒట్టి గారడీ మాటలేనని విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే పాయల్ శంకర్, జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల రాజేందర్‌ల సమక్షంలో ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ జనార్దన్ రాథోడ్, నర్సంపేటకు చెందిన రాణాప్రతాప్‌రెడ్డి, పలువురు పట్టణ కౌన్సిలర్లు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు.

రెండు నెలల్లో పలు రాజకీయ మార్పులు

ఫిబ్రవరి, మార్చి నెలల్లో రాష్ట్రంలో అనేక రాజకీయ మార్పులు చోటు చేసుకోనున్నాయని, బీజేపీలోకి చేరికలు పెరుగుతాయని కిషన్‌రెడ్డి చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత దేశంలో కొత్త చరిత్ర లిఖించబోతున్నామని, అందులో తెలంగాణ ప్రజలు భాగస్వామ్యం కాబోతున్నారని అన్నారు. రాష్ట్రంలో మెజారిటీ సీట్లు బీజేపీ గెలిచి తీరుతుందనే ధీమా వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ అవినీతికి పాల్పడి, రాష్ట్రాన్ని ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలివ్వలేని పరిస్థితికి తీసుకొచ్చారన్నారు. స్వాతంత్య్రం వచ్చాక ఏ ప్రభుత్వం చేయలేని పనులు, పాలనా సంస్కరణలు, అనేక రకాల చట్టాలు, భారతీయ ఆధ్యాత్మిక, సంస్కృతిని పునరుద్ధరించే కార్యక్రమాలు మోదీ నాయకత్వంలో చేపట్టారని చెప్పారు. యూపీఏ హయాంలో కాంగ్రెస్ మంత్రులు కుంభకోణాలతో కేసుల్లో ఇరుక్కుని జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. ఈటల మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో రాష్ట్రంలో అధికారం సంపాదించిందని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అంతరించిపోయే స్థితిలో ఉందని అన్నారు.

ఏ హోదాలేని ప్రియాంకను ఎలా ఆహ్వానిస్తారు?

- ప్రభుత్వ కార్యక్రమాలకు ఆమెను ఆహ్వానిస్తే నల్లబెలూన్లు ఎగరేస్తాం
- ప్రభుత్వాన్ని పడగొట్టాల్సిన అవసరం మాకు లేదు: కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ కార్యక్రమానికి ఏ హోదా లేని ప్రియాంక గాంధీని ఎలా ఆహ్వానిస్తారని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. రూ.500కే వంట గ్యాస్ పథకం ప్రారంభానికి ప్రియాంకాగాంధీని ఆహ్వానిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడంపై కవిత అభ్యంతరం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యక్రమానికి ప్రియాంక గాంధీని ఆహ్వానిస్తే నల్ల బెలూన్లు ఎగరేస్తామని తెలిపారు. 'ప్రియాంక దేశంలో ఏ గ్రామం నుంచైనా సర్పంచ్‌గా గెలిచారా? మీ పార్టీకి చెందిన ముఖ్యనాయకురాలైతే ఇంటికి పిలుచుకొని మీ మనవడికి ఆశీర్వాదం ఇప్పించుకోండి. తెలంగాణకు వచ్చిన ఆడబిడ్డ కాబట్టి చీరసారె పెట్టి సాదరంగా సాగనంపండి. కానీ ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రియాంకా గాంధీని పిలుస్తామంటే తప్పకుండా నిరసన తెలియజేస్తాం' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఇప్పటికైనా తప్పు తెలుసుకొని ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలకు క్షమాపణలు చెప్పడం మంచి పరిణామమని, తెలంగాణ అమరుల కుటుంబాలకు కూడా రేవంత్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అద్దంకి దయాకర్‌కు రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలనుకుంటే.. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా ఒత్తిడి చేసిన నల్లగొండ, ఖమ్మం నాయకులే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతారని అన్నారు. సీఎం రేవంత్ యూ–టర్న్ ముఖ్యమంత్రిగా మారారని విమర్శించారు. నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసే అంశంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్సీ కవిత సమాధానమిస్తూ 'పార్టీ ఎలా నిర్ణయిస్తే అలా' అని వ్యాఖ్యానించారు.

హిమాన్షు ఏ హోదాలో పట్టువస్త్రాలు సమర్పించాడు?

కవితకు మంత్రి కొండా సురేఖ ప్రశ్న



నయీంనగర్: ప్రియాంకాగాంధీకి ఏ హోదా ఉందని రెండు గ్యారెంటీలను అమలు చేయిస్తారని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించడంపై మంత్రి కొండా సురేఖ మండిపడ్డారు. శనివారం హనుమకొండలో మంత్రి మీడియాతో మాట్లాడారు. "మీ అన్న (కేటీఆర్) కుమారుడు హిమాన్షు ఏ హోదాలో భద్రాద్రి రాముల వారికి పట్టువస్త్రాలు సమర్పించాడో చెప్పాలి. దీనికి బదులిస్తే కవిత అడిగే అన్ని ప్రశ్నలకు మేం సమాధానం చెప్తాం. ఢిల్లీ లిక్కర్ పాలసీ స్కాంలో ఇరుక్కున్న లిక్కర్ రాణి కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తే ప్రజలు నవ్వుతారు. కాంగ్రెస్ పార్టీని, నాయకులను విమర్శించే అర్హత కవితకు లేదు. కవితకు దమ్ముంటే నిజామాబాద్‌లో మళ్లీ పోటీ చేసి గెలవాలి.." అని కొండా సురేఖ వ్యాఖ్యానించారు.

బీఆర్ఎస్‌కు రాజయ్య గుడ్‌బై

- పార్టీ పదవులు, సభ్యత్వానికి రాజీనామా... బీఆర్ఎస్ విధానాలు నచ్చడం లేదని వ్యాఖ్య
- భవిష్యత్ కార్యాచరణపై త్వరలో నిర్ణయం తీసుకుంటానని వెల్లడి



సాక్షి ప్రతినిధి, వరంగల్: వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పార్టీ పదవులు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు పంపిన తన రాజీనామా లేఖను శనివారం హనుమకొండలో మీడియాకు చూపించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో తాను అసంతృప్తితో ఉన్న మాట నిజమేనని చెప్పారు. పార్టీకి ఎంతో సేవ చేసినా తనకు సరైన గుర్తింపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను, తన క్యాడర్ మానసిక క్షోభకు గురయ్యామని, పార్టీ అధినాయకత్వాన్ని కలిసే అవకాశమే దక్కలేదని అన్నారు. బీఆర్ఎస్ విధానాలు నచ్చట్లేదని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలుస్తామనడం సరికాదని వ్యాఖ్యానించారు. తాను 15 ఏళ్లు కాంగ్రెస్‌లోనే ఉండి తెలంగాణ కోసం పోరాడానని పేర్కొన్నారు. 'ఉప ముఖ్యమంత్రిగా, మాదిగ కులానికి ప్రాతినిధ్యం వహించిన నేతగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించిన అనుభవం నాకుంది. ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా మాదిగ కుల నేతలు, మేధావులు, కార్యకర్తలనుంచి నాపై ఒత్తిడి ఉంది. వారితో చర్చించి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటా' అని చెప్పారు.

టికెట్ ఇవ్వకపోవడంతో అసంతృప్తి

రాజయ్య రాజీనామా బీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 2009 అసెంబ్లీ ఎన్నికలలో స్టేషన్ ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన రాజయ్య.. కడియం శ్రీహరిపై విజయం సాధించారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఇవ్వడానికి 2011లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. 2011 అక్టోబర్ 30న బీఆర్ఎస్‌లో చేరారు. 2012 ఉప ఎన్నికలో మళ్లీ విజయం సాధించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి 58,829 ఓట్ల తేడాతో గెలుపొందారు. కేసీఆర్ తొలి మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రిగా నియమితులయ్యారు. రాజయ్య పనితీరుపై విమర్శలు రావడంతో 2015 జనవరి 25న అప్పటి సీఎం కేసీఆర్ మంత్రివర్గం తొలగించారు. 2018 ఎన్నికల్లో రాజయ్యకే స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి అవకాశం కల్పించగా మరోసారి విజయం సాధించారు. అయితే 2023లో కడియం శ్రీహరికి టికెట్ ఇవ్వడంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు.

రాజయ్యను అడ్డుకుంటాం

జనగామ కాంగ్రెస్ నేతలు

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ రాజయ్య కాంగ్రెస్ పార్టీలోకి వస్తే సహించేది లేదని, పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో గ్రామగ్రామాన అడ్డుకుంటామని ఆ పార్టీ జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, రఘునాథపల్లి ఎంపీపీ మేకల వరలక్ష్మి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే పదవి, కాంగ్రెస్ పార్టీని గడ్డిపోచలా, కాలి చెప్పులా భావిస్తూ రాజీనామా చేశానని పలుమార్లు చెప్పిన రాజయ్య.. మళ్లీ ఏ ప్రయోజనం ఆశించి వస్తున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లో రాజయ్య చేసిన చిల్లర, అవినీతి పనులు రాష్ట్రమంతా తెలుసనని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాజయ్య చెల్లని నాణెంలా ఉన్నారని, బీఆర్ఎస్‌లో చెల్లని రాజయ్య కాంగ్రెస్ పార్టీలో ఎలా చెల్లుతాడని ఎద్దేవా చేశారు.

క్లుప్తంగా...

శివబాలకృష్ణ సోదరుడి పేరిట బినామీ ఆస్తులు

- విచారించిన ఏసీబీ అధికారులు


శివబాలకృష్ణ

సాక్షి, హైదరాబాద్: భారీ ఎత్తున అక్రమ ఆస్తులు సంపాదించిన హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ తన సోదరుడు శివసునీల్ పేరిట ఆస్తులు కూడబెట్టినట్లు అవినీతి నిరోధక శాఖ అధికారులు గుర్తించారు. లాకర్లు తెరుస్తున్న అధి కారులకు పెద్దమొత్తంలో బంగారు నగలు, ఆస్తుల పత్రాలు, పాసు పుస్తకాలు లభించినట్లు తెలిసింది. బినామీగా సోదరుడి పేరిట ఆస్తులు కొనుగోలు చేయడమేకాక రియల్ ఎస్టేట్ బిజినెస్‌లోనూ బాలకృష్ణ పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టినట్లు అధికారులు గుర్తించారు. రెరా కార్యాలయంలోని ఆయన లాకర్‌ను పరిశీలించిన అధికారులు రూ.20 లక్షల నగదు, ఆభరణాలు, ఆస్తిపత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. బాలకృష్ణ సంపాదించిన ఆస్తుల చిట్టా చూసి ఏసీబీ అధికారులు విస్తుపోతున్నట్లు సమాచారం.

7 నుంచి 'ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్': సీతక్క



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 7 నుంచి 14వ తేదీ దాకా 'ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్' చేపట్టి పల్లెలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. ఈ సందర్భంగా ఉత్తమ గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి సన్మానించాలని కలెక్టర్లకు సూచించారు. కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులతో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ములుగు నుంచి మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. మంచినీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించడం, క్లోరినేషన్, పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు వంటి ప్రతి అంశంపై దృష్టి సారించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికే తొలి ప్రాధాన్యత: తుమ్మల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికే తొలి ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం సచివాలయంలో కేరళ వ్యవసాయ శాఖ మంత్రి పి.ప్రసాద్‌తో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ, అనుబంధ రంగాల కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను ఆయనకు వివరించడంతో పాటు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం వరి ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే మొదటి స్థానంలో, పత్తి ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉందన్నారు. రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్నామని, ఈ పథకం కిందకు 59 సంవత్సరాలలోపు రైతులకు జీవిత బీమా పథకాన్ని కూడా అమలు అమలు చేస్తున్నామని చెప్పారు. పంట నమోదు పద్ధతి ద్వారా ప్రతి పంటను నమోదు చేసి, రైతులకు ఉపయోగపడే విధంగా నాటిన రోజు నుంచి పంట చేతికి వచ్చే వరకు క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా తనిఖీలు చేయిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఐఎస్టీఏ ప్రయోగశాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నామని వివరించారు.

ఉపేందర్‌రావుకు అండగా రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ

- రూ.5 లక్షల చెక్కును అందచేసిన జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: కిడ్నీ సమస్యతో బాధపడుతున్న తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రావుకు తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ అండగా నిలిచింది. ఉపేందర్‌రావుకు ఇటీవల హైదరాబాద్‌లో కిడ్నీ మార్పిడి జరిగింది. ఈ నేపథ్యంలో ఆస్పత్రి ఖర్చులు, ఇతర అవసరాల నిమిత్తం తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి రూ.5 లక్షల చెక్కును ఉపేందర్‌రావుకు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్ పాక తదితరులు పాల్గొన్నారు.

డైరీ, కేలండర్‌ను ఆవిష్కరించిన పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం (జీటీఏ), గృహ నిర్మాణశాఖ ఇంజనీర్ల డైరీ, కేలండర్‌ను శనివారం తెలంగాణ సచివాలయంలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీటీఏ, గృహనిర్మాణ శాఖ ఇంజనీర్ల సంఘం నేతలు పాల్గొన్నారు.

75 గజాల్లోపు ఉన్నా.. అనుమతి తప్పనిసరి

- ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక 'ఆక్యుపెన్సీ' అవసరం లేదు
- తేల్చిచెప్పిన ఉన్నత న్యాయస్థానం
- జీహెచ్‌ఎంసీ వాదనలను సమర్థించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 75 చదరపు గజాల కంటే తక్కువ విస్తీర్ణం ప్లాట్‌లో ఎలాంటి నిర్మాణాన్ని చేపట్టాలనుకున్నా.. భవన యజమానులు మున్సిపాలిటీ లేదా కార్పొరేషన్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని పొందడం తప్పనిసరి అని హైకోర్టు స్పష్టం చేసింది. 75 చదరపు గజాల కంటే తక్కువ ఉన్నా.. ఎక్కువ ఉన్నా అధికారుల నుంచి ధ్రువీకరణ, పని ప్రారంభ ఉత్తర్వును పొందాలని, దీనికి ఎలాంటి మినహాయింపు లేదని తేల్చిచెప్పింది. తమ ప్లాట్‌లలో నిర్మాణ పనులను ఆపివేయాలంటూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ నేరేడ్‌మెట్ వినాయకనగర్‌కు చెందిన ఒక కుటుంబంలోని ముగ్గురు వ్యక్తులు పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్లలో తండ్రి కొడుకులు, ప్లాట్‌ను రెండు భాగాలుగా విభజించారు. టీఎస్ బీపాస్ చట్టం–2020 ప్రకారం నిర్మాణాలకు రిజిస్ట్రేషన్ చేసుకుని ఒక్కొక్కటి 40 చదరపు గజాల్లో నిర్మాణాన్ని ప్రారంభించారు. మరొక పిటిషనర్ 54 చదరపు గజాలలో నిర్మాణాన్ని ప్రారంభించారు. అయితే వీరి నిర్మాణాలపై పొరుగు వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిర్మాణాలను ఆపివేయాలంటూ జీహెచ్‌ఎంసీ నోటీసులు జారీ చేసింది. అయితే టీఎస్ బీపాస్ చట్ట ప్రకారం నిర్మాణాలను ప్రారంభించామని.. జీహెచ్‌ఎంసీ ఇచ్చిన నోటీసులను రద్దు చేస్తూ ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ తడకమళ్ల వినోద్‌కుమార్ విచారణ చేపట్టారు. జీహెచ్‌ఎంసీ తరఫున స్టాండింగ్ కౌన్సిల్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు రిజిస్ట్రేషన్ చేసుకుంటే మాత్రమే సరిపోదని, దాని పరిశీలన తర్వాతే నిర్మాణంపై ముందుకు వెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని టీఎస్ బీపాస్ చట్టంలోని సెక్షన్ 7 చెబుతోందని చెప్పారు. రిజిస్ట్రేషన్ తర్వాత అధికారులు నిర్ణయం తీసుకోవడానికి 21 రోజుల సమయం ఉంటుందని, ఆ తర్వాత ఎలాంటి కారణం చూపకుండా దరఖాస్తును ఆపితే పిటిషనర్లు ముందుకు వెళ్లవచ్చని తెలిపారు. కానీ, పిటిషనర్లు జనవరి 9న రిజిస్ట్రేషన్ చేసి, వెంటనే నిర్మాణం ప్రారంభించారని పేర్కొన్నారు. దీంతో అదే నెల 18న జీహెచ్‌ఎంసీ నోటీసులు జారీ చేసిందని వెల్లడించారు. టీఎస్ బీపాస్ నిబంధనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. జీహెచ్‌ఎంసీ వాదనలను సమర్థించారు. 75 చదరపు గజాల కంటే తక్కువ ప్లాట్‌లలో నిర్మాణానికి ప్రారంభ అనుమతి సర్టిఫికెట్ అవసరమని స్పష్టం చేశారు. అయితే వీటికి రూ.1 మాత్రమే నామమాత్రపు రుసుము ఉంటుందని, నిర్మాణం పూర్తయిన తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందవలసిన అవసరం ఉండదని తేల్చిచెప్పారు.



సర్టిఫికెట్ల పరిశీలన కౌంటర్ల వద్ద బారులుదీరిన యువతీయువకులు

జాబ్‌మేళాకు పోటెత్తారు..!

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్ర ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన ఖమ్మం జిల్లాకేంద్రంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు నిరుద్యోగులు పోటెత్తారు. ఎస్సెస్సీ మొదలు ఆపై విద్యార్హత ఉన్నవారికి 65కి పైగా కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ జాబ్‌మేళా ఏర్పాటు చేశారు. దీనికి ఆన్‌లైన్ ద్వారా 11,530 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ మేరకు జాబ్‌మేళాను కలెక్టర్ గౌతమ్ ప్రారంభించారు. హాజరైన 1,122 మంది అభ్యర్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపిక కాగా.. మరికొన్ని కంపెనీలు 2,698 మందిని రెండోదశ ఇంటర్వ్యూలకు ఎంపిక చేశాయి.

'మేనేజ్' చేస్తున్నారా?

- ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్డగోలు దోపిడీపై నివేదిక కోరిన ముఖ్యమంత్రి
- మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీపై ఆరా!
- ఫ్యాకల్టీ ఎవరు.. పాఠాలు చెప్పేదెవరు?
- కంప్యూటర్ కోర్సుకు అధ్యాపకులున్నారా..?
- సమగ్ర వివరాలివ్వమని వీసీలకు ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: మేనేజ్‌మెంట్ కోటాలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల భర్తీపై ప్రభుత్వం దృష్టి సారించింది. దీనిపై ఇటీవల ముఖ్యమంత్రి కార్యాలయం ఉన్నతవిద్య అధికారులను అప్రమత్తం చేసింది. విద్యార్థి సంఘాలు, వివిధ వర్గాల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిగణలోనికి తీసుకున్నట్టు తెలిసింది. దీని ఆధారంగా సమగ్ర వివరాలు అందించాలని అధికారులను సీఎంఓ ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఉన్నత విద్యామండలి సహా అన్ని యూనివర్సిటీల వీసీలు వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. విశ్వవిద్యాలయాలపై వస్తున్న ఫిర్యాదులపై ఇటీవల ముఖ్యమంత్రి విద్యాశాఖ సమీక్షలో ప్రస్తావించారు. ఇదే క్రమంలో సీట్ల అమ్మకాలపైనా ఆరా తీశారు. ఆ తర్వాతే వర్సిటీల ప్రక్షాళన దిశగా విద్యాశాఖ ముఖ్య కార్యదర్శితో ప్రత్యేకంగా మాట్లాడినట్టు తెలిసింది. వచ్చే విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపుపై కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

పక్కాగా తనిఖీలుండాల్సిందే...

ప్రైవేట్ కాలేజీలకు గుర్తింపు ఇచ్చే సమయంలో యూనివర్సిటీ స్థాయిలో ప్రత్యేకంగా కమిటీలు వేస్తారు. ఇవి ప్రతీ కాలేజీకి వెళతాయి. అక్కడ మౌలిక వసతులు, అధ్యాపకుల పరిస్థితిని సమీక్షిస్తాయి. ఈ వ్యవహారం మొత్తం నామమాత్రంగానే సాగుతోందనే ఫిర్యాదులున్నాయి. ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలతో వర్సిటీ అధికారులు బేరం కుదుర్చుకుంటున్నారనే విమర్శలూ వస్తున్నాయి. ఇలాంటి ఆరోపణలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సీఎం సూచించినట్టు తెలిసింది. చాలా కాలేజీల్లో మౌలిక వసతులు లేకున్నా అడ్డగోలుగా అనుమతులు ఇచ్చారనే ఆరోపణలున్నాయి. ఇలాంటి కాలేజీల జాబితా సిద్ధం చేయాలని అధికారులను సీఎంఓ ఆదేశించినట్టు సమాచారం. ఈ ప్రక్రియలో వీసీలనే కాకుండా, ఇతర అధికారులను కూడా భాగస్వామ్యం చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం.

ఫ్యాకల్టీపై ప్రత్యేక దృష్టి

గత ఏడాది రాష్ట్రంలో 14 వేల వరకూ కంప్యూటర్ దాని అనుబంధ బ్రాంచ్‌లలో సీట్లు పెరిగాయి. సీఎస్‌సీ, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి బ్రాంచ్‌లలో సీట్లను యాజమాన్యాలు రూ.12 నుంచి రూ.18 లక్షల వరకూ అమ్ముకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. ఉన్నత విద్యామండలికి కూడా ఇలాంటి ఫిర్యాదులు 145 వరకూ వచ్చాయి. దీనిపై ఏం చర్యలు తీసుకున్నారనే విషయమై సీఎంఓ ఆరా తీసింది. సరైన ఆధారాలు లేవంటూ అధికారులు వీటిని పక్కన బెట్టడంపై ఇటీవల సీఎం సీరియస్ అయినట్టు సమాచారం. ఫిర్యాదుల ఆధారంగా కొంతమంది అధికారుల బృందంతో దర్యాప్తు జరిపించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. వచ్చే ఏడాది కూడా కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు యూజీసీ నిబంధనల ప్రకారం అర్హతలు ఉంటేనే అఫ్లియేషన్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించినట్టు సమాచారం.

9 నుంచి 19 వరకు 'బుక్ ఫెయిర్'

హైదరాబాద్: 36వ జాతీయ పుస్తక ప్రదర్శన ఈ నెల 9వ తేదీ నుంచి 19 వరకు ఎన్టీఆర్ స్టేడియం, కళాభారతిలో నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ బుక్‌ఫెయిర్ కార్యదర్శి వాసు, ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, కోశాధికారి రాజేశ్వర్‌రావుతో కలిసి మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం డిసెంబర్‌లో నిర్వహించే పుస్తక ప్రదర్శన ఎన్నికల కారణంగా, ఎన్టీఆర్ స్టేడియంలో వేరే కార్యక్రమాలు ఉండటం వల్ల ఆలస్యమయిందని తెలిపారు. ప్రాంగణానికి తన కాలి గజ్జెతో ప్రభుత్వాలను కదిలించిన ప్రజా యుద్ధనౌక గద్దర్ పేరు పెడుతున్నామని, సంస్కృత పండితులు రవ్వా శ్రీహరి వేదికగా నామకరణం చేసినట్లు తెలిపారు. రాష్ట్ర సాధనలో అసువులు బాసిన అమరవీరులకు నివాళిగా ఉద్యమకారుల స్థూపాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జూలూరు గౌరీశంకర్

అన్ని రాష్ట్రాల నుంచి మొత్తం 300 పైగా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు, శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 9 వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు. పిల్లలకు, టీచర్లకు, జర్నలిస్టులకు ఉచిత ప్రవేశమని, కవులు, కళాకారులు, రచయితలకు లక్ష పాసులు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి లేదా ఉపముఖ్యమంత్రి, లేదా సాంస్కృతిక శాఖ మంత్రితో ప్రదర్శన ప్రారంభిస్తామని తెలిపారు.

ఆర్టీసీకి రూ.212.50 కోట్లు విడుదల

సాక్షి, హైదరాబాద్: బడ్జెట్‌లో ఆర్టీసీకి కేటాయించిన మొత్తం నుంచి రూ.212.50 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. బస్‌పాస్ రాయితీల రూపంలో ఆర్టీసీ కోల్పోయే ఆదాయాన్ని రీయింబర్స్ చేసే క్రమంలో ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుంది. గత బడ్జెట్‌లో ఆ పద్దు కింద కేటాయించిన మొత్తంలో రూ.850 కోట్లలో రూ.637.50 కోట్లను ఇప్పటికే విడుదల చేసింది. మిగతా మొత్తానికి సంబంధించి ఆర్థిక శాఖ బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ ఇవ్వడంతో రవాణా శాఖ శనివారం రాత్రి ఉత్తర్వు జారీ చేసింది. ఇక నుంచి మహిళల ఉచిత ప్రయాణ మొత్తాన్ని నెలనెలా చెల్లించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నేత వీఎస్ రావు, ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు కోరారు.

ఎన్టీపీసీ రెండో యూనిట్‌లో 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి

పూర్తిస్థాయి లోడ్ సామర్థ్యం చేరుకున్న తెలంగాణ స్టేజీ–1లోని రెండో యూనిట్


రెండో యూనిట్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సందర్భంగా సంబరాలు చేసుకుంటున్న అధికారులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఆవరణలో నిర్మించిన తెలంగాణ స్టేజీ–1లోని 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండో యూనిట్ పూర్తిస్థాయి లోడ్ సామర్థ్యానికి చేరుకొంది. ఈ మేరకు శనివారంరాత్రి 9.20 గంటలకు యూనిట్–2లో 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి అయినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు, జనరల్ మేనేజర్లు సంజీవ్ కుమార్, సురేశ్, సంతోష్ తివారి ప్రాజెక్ట్, కమిషనింగ్ బృందాన్ని ప్రశంసించారు. చాలారోజులుగా ఎదురుచూస్తున్న తెలంగాణ స్టేజీ–1లోని రెండో యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి కావడంతో అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో విద్యుత్ స్థిరీకరణ కార్యకలాపాలపై ఎన్టీపీసీ యాజమాన్యం దృష్టి సారిస్తుందని తెలుస్తోంది. ఈ ప్రక్రియ పూర్తికావడంతో కమర్షియల్ ఆపరేషన్ డిక్లరేషన్(సీవోడీ) చేసే అవకాశాలు ఉన్నాయి.

బీడీఆకుల ధరపై సలహా కమిటీ

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది బీడీఆకుల సేకరణ సీజన్‌కు సంబంధించి.. సలహా కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ సీజన్‌లో బీడీఆకుల (అబ్నస్ లీవ్స్) కొనుగోలు ధరపై ప్రభుత్వానికి సలహా ఇచ్చేందుకు దీన్ని ఏర్పాటు చేశారు. సలహా కమిటీ చైర్మన్‌గా అరణ్యభవన్‌లోని కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (ప్రొడక్షన్), కన్వీనర్‌గా స్టేట్ ట్రేడింగ్ సర్కిల్ డీఎఫ్‌వో/ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక, ప్రణాళికశాఖ కార్యదర్శి ప్రతినిధి, సభ్యులుగా టీఎస్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ జీఎం (ఆపరేషన్స్), మంచిర్యాల జిల్లా హాజీపూర్ వేంపల్లి గ్రామానికి చెందిన సీహెచ్ సందీప్‌రెడ్డి, బీడీఆకుల కలెక్షన్ లేబర్ ప్రతినిధిగా (సభ్యుడు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం, లచ్చిగూడెంకు చెందిన శీలం లక్ష్మీనరసులను నియమించారు. రిజిస్టర్డ్ గ్రోయర్స్ నుంచి నలుగురు సభ్యులను నామినేట్ చేయాల్సి ఉండగా ఈసారి ఎవరినీ నామినేట్ చేయలేదు. ఈ మేరకు శనివారం అటవీశాఖ ముఖ్యకార్యదర్శి ఎ.వాణీప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

కేంద్ర బడ్జెట్‌పై పెదవి విప్పని కాంగ్రెస్: భరత్ కుమార్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగినా, కాంగ్రెస్ నేతలు పెదవి విప్పకపోవడంలో ఉన్న ఆంతర్యం ఏంటని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సోమ భరత్‌కుమార్ ప్రశ్నించారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌పై కనీసం సమీక్ష కూడా నిర్వహించలేదన్నారు. రాష్ట్రానికి కాంగ్రెస్ బీజేపీలు కలిసి అన్యాయం చేస్తున్నాయని, స్థానిక సంస్థల్లో చట్టాలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ కాంగ్రెస్ బీజేపీలు బీఆర్‌ఎస్ పాలకవర్గాలపై అవిశ్వాస తీర్మానం పెడుతున్నాయని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపు కోసం కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఒత్తిడి చేయలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర సమస్యలపై కేంద్రాన్ని కాంగ్రెస్ నిలదీయాలని సూచించారు.

వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి మాట్లాడుతూ విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గాయని చెప్పారు. రైల్వేల్లో తెలంగాణకు కేటాయింపులు తగ్గాయని, కేంద్ర ఉద్యోగాలు 14 లక్షలు ఖాళీగా ఉంటే వాటి భర్తీ ఊసే లేదన్నారు.

కేసీఆర్ హయాంలోనే ఆదిలాబాద్ అభివృద్ధి

- మాజీ మంత్రి జోగు రామన్న

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కేసీఆర్ హయాంలోనే నిధులొచ్చాయని మాజీ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో శనివా రం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే 220కిపైగా తండాలు, గూడేలు గ్రామ పంచాయతీలుగా మారాయని, జోడే ఘాట్‌ను రూ. 22 కోట్లతో కేసీఆర్ అభివృద్ధి చేశా రని గుర్తుచేశారు. కొత్తగా జిల్లాలు, మండలాలు, మున్సిపాలిటీలు, రెవెన్యూ డివిజన్లు చేయడం వల్ల ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా స్వరూపం మారిపోయిందన్నారు. కేసీఆర్ హయాంలో 13 మధ్యతరహా ప్రాజెక్టులను రూ. 800 కోట్లతో పూర్తి చేశామని, 50 ఏళ్లలో కాంగ్రెస్ ఏనాడూ ఆదిలాబాద్ జిల్లాను పట్టించుకోలేదని విమర్శించారు.

'ఐఎన్‌ఎస్ సంధాయక్' జాతికి అంకితం


ఐఎన్‌ఎస్ సంధాయక్‌ను జాతికి అంకితం చేస్తున్న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్, ఇండియన్ నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్, అధికారులు

- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- హిందూ మహాసముద్ర జలాల్లో శాంతిని కాపాడేందుకే 'సంధాయక్'
- దేశీయ యుద్ధ నౌకల తయారీలో ఇదొక చరిత్రాత్మక రోజు
- సముద్రపు దొంగల ఆటకట్టిస్తాం




సాక్షి, విశాఖపట్నం: ఇండో–పసిఫిక్ ప్రాంతంలో సూపర్ పవర్‌గా భారత్ పాత్రను మరింత బలోపేతం చేయడంతో పాటు శాంతి భద్రతలను కాపాడుకోవడంలో భారత నౌకాదళానికి ఐఎన్‌ఎస్ సంధాయక్ సహాయపడుతుందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'ఐఎన్‌ఎస్ సంధాయక్'ను శనివారం విశాఖపట్నంలోని నేవల్ డాక్‌యార్డులో భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్‌తో కలిసి రాజ్‌నాథ్ జాతికి అంకితమిచ్చారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ మాట్లాడుతూ.. 'దేశీయంగా తయారు చేస్తున్న నాలుగు భారీ సర్వే వెసల్స్‌లో సంధాయక్ మొదటిది. భారత నౌకాదళానికి ఇదొక చరిత్రాత్మక దినం. దేశీయంగా యుద్ధనౌకల తయారీలో చరిత్ర సృష్టించాం. హిందూ మహాసముద్ర జలాల్లో శాంతిని కాపాడేందుకు ఐఎన్‌ఎస్ సంధాయక్ ఉపయోగపడుతుంది. ఇటీవల రెండు విదేశీ నౌకలను సముద్రపు దొంగల బారి నుంచి కాపాడిన ఘనత భారత నౌకాదళం సొంతం. అంతర్జాతీయ జలాల్లో వాణిజ్య నౌకలు స్వేచ్ఛగా తిరిగేందుకు మన నౌకాదళం తన వంతు సహకారాన్ని అందిస్తోంది. ఒకప్పుడు మనల్ని మనం రక్షించుకునేందుకు ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి నుంచి.. నేడు ప్రపంచ దేశాలకు రక్షణ కల్పించేస్థాయికి భారత్ ఎదిగింది. స్నేహపూర్వక దేశాలను కూడా రక్షించుకునే సామర్థ్యం భారత్ సొంతం. హిందూ మహాసముద్రంలో పెద్ద మొత్తంలో అంతర్జాతీయ వాణిజ్యం జరుగుతున్న నేపథ్యంలో సముద్రపు దొంగల బెదిరింపులు, దాడులు జరుగుతున్నాయి. సముద్రపు దొంగలను ఎట్టి పరిస్థితిలోనూ సహించం. భారత సముద్ర జలాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు' అని హెచ్చరించారు. ఇటీవల పలువురు మత్స్యకారులు, మెరైన్‌లను రక్షించడంతో పాటు దాడులకు గురైన నౌకలకు సాయం అందించిన భారత నౌకాదళాన్ని రాజ్‌నాథ్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేశ్ పెందార్కర్, కలెక్టర్ డా.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంధాయక్ షిప్ విశేషాలు

- నాలుగు భారీ సర్వే వెసల్స్ నిర్మాణంలో భాగంగా 2019లో కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్‌ఎస్‌ఈ)లో ఐఎన్‌ఎస్ సంధాయక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.
- 2021 నాటికి నౌక నిర్మాణం పూర్తయింది. 2023 డిసెంబర్ 4న భారత నౌకాదళానికి షిప్‌ని అప్పగించారు.
- దీని పొడవు 110 మీటర్లు. వెడల్పు 16 మీటర్లు. బరువు 4,130 టన్నులు. ప్రయాణ వేగం గంటకు 18 నాటికల్ మైళ్లు.
- 3.2 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే సామర్థ్యం కూడా ఉంది.
- 80 శాతానికి పైగా దేశీయ సాంకేతిక సామర్థ్యంతో రూపుదిద్దుకున్న యుద్ధనౌక ఇది.
- సముద్ర జలాలు, అంతర్జాతీయ ప్రాదేశిక సరిహద్దులు నిర్ణయించేందుకు ఈ నౌకను వినియోగించనున్నారు.
- ఇతర దేశాల నౌకల మ్యాపింగ్‌లో కీలకపాత్ర పోషించనుంది.
- అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్, సర్వే మోటర్ బోట్స్, డిజిటల్ సైడ్ స్కానర్ సోనార్, రిమోట్ ఆపరేటింగ్ వెహికల్స్ ఇందులో ఉంటాయి.
- సముద్రగర్భంలో వెయ్యి మీటర్ల లోతులో అతి సున్నితమైన, కీలకమైన సూక్ష్మ సమాచారాన్ని గ్రహించగల సామర్థ్యంగల పరికరాలు అమర్చారు.
- అండర్ వాటర్ వెహికల్స్, వెపన్స్ కూడా ఇందులో అందుబాటులో ఉంటాయి.
- సముద్రజలాల సర్వే మ్యాప్ కోసం అవసరమైన మల్టీ బీమ్ ఎకో సౌండర్ సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేశారు.
- అత్యవసర సమయాల్లో పరిమిత సౌకర్యాలతో హాస్పిటల్ షిప్‌గాను సేవలందించగలదు.
- పరిశోధన, రెస్క్యూ, డిజాస్టర్ రిలీఫ్ పాత్రల్ని కూడా సంధాయక్ సులువుగా నిర్వర్తించగలదు.
- సంధాయక్ నౌకకు మొదటి కమాండింగ్ అధికారి కెప్టెన్ ఆర్.ఎం.థామస్.

దేశీయంగానే సబ్‌మెరైన్ల తయారీ



అంతర్జాతీయ, దేశీయ జలాల మ్యాపింగ్‌లో సంధాయక్ కీలక పాత్ర పోషించనుంది. హైడ్రోగ్రాఫిక్ సహాయకారిగా అంతర్జాతీయ నౌకలకు కూడా ఇది ఉపయోగపడాలన్నది ప్రధాని మోదీ లక్ష్యం. హిందూ మహాసముద్రంలో శాంతి పరిరక్షణే మన ప్రధానమైన లక్ష్యం. 66 షిప్‌లు, సబ్‌మెరైన్లలో దేశీయంగానే 64 తయారు చేస్తున్నాం.

– అడ్మిరల్ ఆర్ హరికుమార్, ఇండియన్ నేవీ చీఫ్

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.